fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 40 | విజయవాడ, శనివారం 10 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



ప్రతి యేటా ఫిబ్రవరిలో జరిగే మేరిమాత ఉత్సవాల సందర్భంగా విద్యుత్ దీపాలతో ధగధగలాడుతున్న విజయవాడలోని గుణదల కొండ

మే 6వ తేదీన నీట్

న్యూఢిల్లీ : మెడికల్ కాలేజీల్లో ప్రవేశాల కోసం జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-2018)ను మే నెల 6వతేదీన నిర్వహిస్తామని సిబిఎస్ఇ గురువారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా వివిధ వైద్య, దంత కళాశాలల్లో ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశించే విద్యార్థులు నీట్ కోసం దరఖాస్తు చేసుకొనేందుకు నోటిఫికేషన్ జారీచేసింది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంది. విభిన్న ప్రతిభావంతులు మార్చి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. పరీక్షను హిందీ, ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, గుజరాతీ, మిగతా 9లో



అన్ని పార్టీలు ఏకం కావాలి

ఏపీ డిమాండ్లపై రాహుల్ గాంధీ

కొనసాగిన ఏపి ఎంపిల ఆందోళన

వాయిదాల పర్వంలో ఉభయ సభలు

మార్చి 5కి పార్లమెంట్ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌పై చిన్న చూపు తగదని, ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఏపికి జరిగిన అన్యాయంపై గత ఐదు రోజులుగా పార్లమెంట్ వేదికగా ఆందోళన చేస్తున్న టిడిపి, వైసిపి, కాంగ్రెస్‌కు చెందిన ఏపి ఎంపిలకు, విభజన హామీలు నెరవేర్చాలంటూ ఏపి ప్రజలు చేస్తున్న డిమాండ్లకు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన తన అధికారిక ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా డిమాండ్‌కు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే త్వరిత గతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏపికి న్యాయం చేయడానికి అన్ని పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

కొనసాగిన ఏపి ఎంపిల ఆందోళన

శుక్రవారం కూడా పార్లమెంట్‌లోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు, గేట్ నెంబర్ 1వద్ద వైసిపి ఎంపిలు ఆందోళన చేపట్టారు. టిడిపి ఆందోళనలో ఎంపిలు మిగతా 9లో



మళ్లీ అదే మాట

చాలా చేశా.. ఇంకా చేస్తాం

నాలుగే నాలుగు ముక్కల్లో తేల్చేసిన వైనం

రాజ్యసభలో అరుణ్ జైట్లీ ప్రకటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతులో జరిగిన బంద్‌కు, పార్లమెంట్‌లో ఏపి ఎంపిలు చేస్తున్న ఆందోళనలకు కేంద్రంలోని మోడీ సర్కార్ దిగిరాలేదు. తమ రాష్ట్రానికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎంపిలు గత ఐదు రోజులుగా పార్లమెంట్ సాక్షిగా మొత్తుకున్నా కేంద్రం కదలలేదు. కేంద్ర బడ్జెట్‌లో ఏపికి జరిగిన అన్యాయంపై మళ్లీ పాత పాటే వినిపించింది. ఎంతో చేశాం, ఇంకా చేశామన్న పడికట్టు పదాలనే మళ్లీ వల్లించారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, రెవెన్యూ లోటు, కడప మిగతా 8లో

అన్నీ ఆమోదించారంటూ లీక్

న్యూఢిల్లీ : రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన అన్ని కీలక అంశాలను కేంద్రం ఆమోదించిందంటూ శుక్రవారం రాత్రి వార్తలు లీక్ అయ్యాయి. అరుణ్‌జైట్లీ మూడోసారి చేసిన ప్రసంగంలోనూ కొత్త విషయాలు ఏమీ చెప్పకపోవడంతో విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ ప్రచారం సాగింది. కేంద్ర మంత్రి సుజనచౌదరి చొరవ తీసుకుని అరుణ్‌జైట్లీ, అమిత్‌షా తదితరులతో చర్చలు మిగతా 9లో



సిపిఎం సభలు జరగనున్న హాలులో ముస్తాబవుతున్న వేదిక

భీమవరం సిద్ధం

నేటి నుంచి మూడురోజుల పాటు సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు

నేడు ప్రజా ప్రదర్శన, భారీ బహిరంగ సభ

హాజరుకానున్న అఖిలభారత నాయకులు

300 మంది వలంటీర్ల సేవలు

ప్రత్యేక ఆకర్షణగా భీమవరం ఫెస్ట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలకు భీమవరం అరుణశోభితమైంది. ఈ నెల 10 నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్న మహాసభల నేపథ్యంలో పట్టణమంతా ఎర్రజెండాల రెపరెపలతో అరుణవర్ణం పులుముకుంది. రాష్ట్రంలోని పదమూడు జిల్లాలకు చెందిన జిల్లా, పట్టణ, మండలాలకు ప్రాతినిధ్యం వహించే 600 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరు కానున్నారు. ఎఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో మూడు రోజులు ఈ సభలు జరగనున్నాయి. తొలిరోజు శనివారం సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. అనంతరం వివిధ వామపక్షాల ప్రధాన నాయకులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రసంగించనున్నారు. శనివారం మధ్యాహ్నం భీమవరం పాతబస్టాండ్ నుంచి జువ్వలపాలెం రోడ్డు, బొంబాయి స్వీట్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, ప్రకాశం చౌక్, మావుళ్లమ్మ గుడి రోడ్డుగుండా లూథరన్ హైస్కూల్ గ్రౌండ్ వరకూ పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం భారీ బహిరంగ సభ జరగనుంది. బహిరంగ సభకు ఏచూరితోపాటు పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, బివి రాఘవులు తదితరులు హాజరు కానున్నారు. ప్రదర్శన, సభకు దాదాపు 50 వేల మంది వరకూ హాజరు కానున్నట్లు అంచనా వేస్తున్నారు. 'ఇంటికో మనిషి, ఊరుకో బండి' భీమవరం తరలిరావాలంటూ సిపిఎం శ్రేణులు కొన్నిరోజులుగా జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. సిపిఎం మిగతా 9లో

రాష్ట్ర సమస్యలపై విస్తృత చర్చ

వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో కలిసి ముందుకు

25వ రాష్ట్ర మహాసభలపై రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

భీమవరంలో శనివారం నుంచి మూడు రోజులపాటు జరగనున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో భీమవరంలో జరగనున్న సిపిఎం మిగతా 9లో



భీమవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పి. మధు

లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తు

రాష్ట్రపతిని కలిసిన ప్రతిపక్ష నేతలు



న్యూఢిల్లీ : న్యాయమూర్తి బి.హెచ్.లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తును నిర్వహించాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో 15మంది ప్రతిపక్ష నేతలు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 2014లో లోయా గుండెపోటుతో మరణించే నాటికి ప్రస్తుత బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా పై వచ్చిన హత్యా అభియోగాలను ఆయన విచారిస్తున్నారు. లోయా తర్వాత వచ్చిన న్యాయమూర్తి, అమిత్‌షాను విచారించేందుకు సరైన సాక్ష్యాధారాలు లేవని చెప్పారు. లోయ మృతికి దారి తీసిన పరిస్థితులు అనుమానాలు రేకెత్తించేలా వున్నాయని అందువల్ల దీనిపై స్వతంత్రంగా, సక్రమంగా దర్యాప్తు నిర్వహించాలని కోరినట్లు రాహుల్ గాంధీ విలేకర్లకు చెప్పారు. లోయా మృతిపై దర్యాప్తు జరపాలని కోరుతున్న రెండు పిటిషన్లను ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారిస్తోంది. న్యాయమూర్తి మిగతా 9లో



ఖజానాకు కలవరం

ఎక్కడి బిల్లులక్కడే పెండింగ్

రూ.2 వేల కోట్లు దాటిన బకాయిలు

విద్యుత్ బిల్లులే అధికం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా వివిధ బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో పడింది. కలవరపెడుతున్న ఖజానాతో ఎక్కడి బిల్లులక్కడే నిలిచిపోతున్నాయి. గత నాలుగు నెలలుగా ఉన్న ఈ పెండెన్సీ గత నెల నుంచి మరింతగా పెరిగిపోయింది. ఫలితంగా పలు శాఖలు ఆందోళన చెందుతూ ఆర్థిక శాఖను ఆశ్రయిస్తున్నాయి. అయినా ఖజానా నిండుకోవడంతో ఏమీచేయలేమని ఆ శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న బిల్లుల విలువ రూ. 2 వేల కోట్లు దాటిపోయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాస్తవానికి ఈ ఆర్థిక సంవత్సరారంభం నుంచే కాసుల కష్టాలు ప్రారంభమయ్యాయి. తొలి రెండు త్రైమాసికాల తర్వాత ఈ ఇబ్బందులు మరింతగా పెరిగాయి. ఒక్క జీతాలు చెల్లించేందుకు మాత్రమే నిధులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు అంగీకరిస్తున్నారు. అప్పటి నుంచీ వివిధ పథకాలు, ప్రభుత్వ బిల్లులకు సంబంధించి ఎటువంటి చెల్లింపులూ చేయలేక పోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పెండింగ్ బిల్లులు మిగతా 9లో



అమెరికా మార్కెట్ కుదేలు

డోజోన్స్ మళ్లీ భారీ పతనం

34వేలకు పడిపోయిన సెన్సెక్స్

ముంబయి : అమెరికా స్టాక్ మార్కెట్ కుదేలైంది. ఆ దేశంలో ద్రవ్యోల్బణం ఎగిసిపడనుందన్న అంచనాలకు తోడు ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు నేపథ్యంలో గురువారం వాల్‌స్ట్రీట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. డోజోన్స్ ఏకంగా 4.15 శాతం లేదా 1033 పాయింట్లు కుప్ప కూలింది. ఎస్అండ్‌పి 101 మిగతా 9లో

15 నుంచి బడ్జెట్ కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



రానున్న వార్షిక బడ్జెట్ కూర్పుపై అన్ని శాఖల మంత్రులతో భేటీ అవ్వాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు నిర్ణయించారు. ఈ నెల 15, 16 తేదీలతోపాటు 19వ తేదీన ఈ సమీక్షలు నిర్వహిస్తారు. వీటిలో భాగంగా 15న వ్యవసాయం, హార్టికల్చర్, వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్, వేర్ హౌసింగ్, పశు సంవర్ధకశాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్యశాఖ, సహకారశాఖ, పౌర సరఫరాలు, పరిశ్రమలు, కామర్స్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్, సెర్ప్, మహిళా శిశు సంక్షేమంతో పాటు ఇతర అన్ని సంక్షేమ శాఖలు, రవాణా, చేనేత, కార్మిక శాఖలపై ఆయా శాఖల మంత్రులతో భేటీ అవుతారు. 16వ తేదీన నీటిపారుదల, పట్టణాభివృద్ధి, అర్బన్ హౌసింగ్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటి, గ్రామీణ గృహనిర్మాణం, సమాచార శాఖలపైనా, రోడ్లు భవనాలు, రెవెన్యూ, స్టాంప్స్ రిజిస్ట్రేషన్లు, పర్యాటకం, తెలుగుభాష, సాంస్కృతికశాఖ, గనులశాఖలపై సమీక్షిస్తారు. 19వ తేదీన హోంశాఖ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మానవ వనరులు, విద్య, వైద్య ఆరోగ్యం, అటవీశాఖ, విద్యుత్, దేవాదాయశాఖ, ఎక్సయిజ్, యువజన సంక్షేమశాఖ, క్రీడలపై మంత్రులతో భేటీ అవుతారు. కేంద్రం నుంచి నిధుల రాక తగ్గిపోవడంతో రాష్ట్ర బడ్జెట్‌ను కూడా అనుకున్న స్థాయిలో ప్రతిపాదించే అవకాశాలు కనిపించడం లేదు. అందుకే వీలయినంతగా శాఖల వారీగా ప్రతిపాదనలు తగ్గించే అంశంపైనా చర్చించనున్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచి టెట్ హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అభ్యర్థుల హాల్ టిక్కెట్లు శనివారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులకు నమూనా పరీక్ష (మాక్ టెస్ట్) శుక్రవారం ప్రారంభమైంది. ఈనెల 21 నుంచి మార్చి 3 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. అభ్యర్థుల పరీక్షల తేదీలు, పరీక్షా కేంద్రాల వివరాలను హాల్ టిక్కెట్‌లో పొందుపరుస్తారు.ప్రతి రోజు రెండు విడతలుగా ఈ పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థులకు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌ల్లోనూ పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. హాల్ టిక్కెట్‌లో తప్పిదాలు, సందేహాల నివృత్తి కోసం తమను సంప్రదించవచ్చని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు తెలిపారు.



| నిరసనలు

వెలగపూడి సచివాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబట్టి న్యాయం చేయాలంటూ నినదించారు.

సచివాలయ ఉద్యోగుల సంఘీభావ ర్యాలీ

- కేంద్రంలో నియంతృత్వ పాలన
- సంఘ అధ్యక్షులు మురళీకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన హామీలను అమలు చేయకుండా, బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన కేంద్ర వైఖరికి నిరసనగా ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వెలగపూడి సచివాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు చేతబట్టి న్యాయం చేయాలంటూ నినదించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో నియంతృత్వ పాలన సాగుతుందని దుయ్య బట్టారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే నిధులు కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. విభజన జరిగిన సమయంలో కాంగ్రెస్ చెప్పిన దానికంటే ఎక్కువ ఇస్తామని చెప్పారని, కానీ పార్లమెంట్‌లో చట్టం చేసిన దాన్ని కూడా బిజెపి నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు సాయం చేసే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వానికి లేదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 29 సార్లు ఢిల్లీ వెళ్లి మంత్రుల్ని కలిసినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఏం చేసినా చెల్లుబాటవు తుందనే ధోరణిలో కేంద్ర పెద్దలు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు జాతీయ సంస్థలు, ఇతర పథకాలను కేంద్రం మంజూరు మాత్రమే చేసిందని, వాటికి కావలిసిన నిధులకు మాత్రం మొండి చెయ్యి చూపిస్తుందని వాపోయారు. రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ అన్ని రాజకీయ పార్టీలు చేసిన బంద్ విజయవంతమైందని దానికి సంఘీభావంగానే ర్యాలీ చేపట్టినట్లు వివరిం చారు. అన్ని ఉద్యోగ సంఘాలతో చర్చించి భవిష్య త్తు కార్యచరణ నిర్ణయిస్తామని మురళీకృష్ణ తెలిపారు.

పొడి వాతావరణం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో మరో నాలుగురోజుల పాటు పొడి వాతావరణం కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుక్రవారం ప్రకటించింది. పగలు, ఎండలు ప్రభావం చూపిస్తాయని తెలిపింది. రాత్రి పూట చలి ఉంటుందని వివరిం చింది. పగటి పూట ఉష్ణోగ్ర తలు క్రమంగా పెరుగుతున్నాయి. రాత్రి వేళల్లో నూ ఒకట్రెండు డిగ్రీల వేడి పెరగడంతో ఉక్క పోత ఉన్నప్పటికీ వేకువజామున చలిగా ఉం టోంది. నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరా నికి ఆనుకుని అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది.

బిజెపిలో అయోమయం
టిడిపిలో అంతర్మథనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాజా రాజకీయ పరిణామాలపై టిడిపి ప్రజా ప్రతినిధుల్లో అంతర్మథనం మొదలైంది. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలులో కేంద్రం అనుసరిస్తున్న వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బిజెపితో కలసి పనిచేస్తే వచ్చే లాభం, విడిపోతే ఎదురయ్యే ఇబ్బందులపై ఆ పార్టీ నేతల్లో అంతర్గతంగా తర్జన భర్జనలు సాగుతున్నాయి. నోట్ల రద్దు, జిఎస్‌టి, బ్యాంకింగ్ రంగంలో అమలవుతున్న ఆంక్షలతో కేంద్ర ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో బిజెపితో తెగదెంపులు చేసుకోవాలని చాలా కాలంగా టిడిపి నేతలు అంతర్గతంగా అభిప్రాయ పడుతున్నారు. ఇందుకు కేంద్ర బడ్జెట్‌ను ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలనే వాదనా ఉంది. బిజెపితో తెగదెంపులు చేసుకుంటే వచ్చే లాభనష్టాలపై టిడిపి ఇప్పటికే అంతర్గతంగా అభిప్రాయాలను సేకరిస్తోంది. ఆకస్మికంగా విడిపోతే ఇబ్బంది పడతామని, కేంద్ర బడ్జెట్‌లో నిధులివ్వకపోవడం, విభజన హామీల అమలులో తాత్సారంపై ప్రజల్లో పెద్ద చర్చకు దారితీసేలా చేసి విడిపోతే తాము రాష్ట్ర ప్రయోజనాల కోసమే విడిపోయామన్న భావన కలిగించేలా టిడిపి అధిష్టానం వ్యూహరచన చేసిందని వివిధ స్థాయిలోని నాయకులు భావిస్తున్నారు. బిజెపితో విడిపోతే వచ్చే సమస్యలు? బిజెపి వైసిపి కలసి పనిచేస్తే తమకు నష్టమా? లాభమా అనే అంశాలపై క్షేత్ర స్థాయిలో కార్యకర్తల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. కలిసున్నా, విడిపోయినా నష్టమేననే అభిప్రాయం కొంత మంది ప్రజా ప్రతినిధుల్లో వ్యక్తం అవుతోంది. ఇప్పటి వరకూ పలు నియోజకవర్గాల్లో తమకు ఢోకా లేదని భావించే సిట్టింగ్ ఎమ్మెల్యేలు సైతం తాజా పరిణామాలపై ఆందోళన చెందు తున్నారు. గత ఎన్నికల్లో బిజెపితో కలసి ఇచ్చిన హామీలు అమలు కాక ప్రత్యేక హోదా ఉద్యమాన్ని అణగదొక్కి ప్రత్యేక ప్యాకేజి ద్వారా నిధులు తెస్తామని తేలేకపోవడం వల్ల టిడిపిపైనా ప్రజల్లో వ్యతిరేకత లేకపోలేదు. మరో వైపు టిడిపి నుంచి విడిపోయి స్వతంత్రంగా ఎదగాలని ఉవ్విళ్లూరుతున్న కొంత మంది బిజెపి నాయకులకు తాజా అంశాలు కొంత మేరకు సంతోషాన్ని కలిగిస్తున్నాయి. టిడిపితో కలిసుంటే తాము ఎప్పటికీ ఏపిలో ఎదగలేమని, ఇతర పార్టీల నుంచి బిజెపిలోకి వచ్చిన నాయకులు అభిప్రాయపడుతున్నారు. అయితే పాతతరం బిజెపి నాయకులు మాత్రం ఏదో పార్టీతో పొత్తులేకుండా రాష్ట్రంలో బిజెపి ఉనికి కాపాడుకోవడం కష్టమేనని చెబుతున్నారు. కేంద్రం చేపట్టిన పథకాలకు రాష్ట్రంలో ప్రచారంలోకి రావడం లేదని, అంతా టిడిపి ప్రభుత్వం చేస్తున్నట్టుగా ప్రజల్లో ప్రచారం ఉందని, స్వతంత్రంగా ఎదగాలనే భావన ఎక్కువ మంది నాయకుల్లో ఉంది. కానీ ఇది సాధ్యమా? అనే ప్రశ్న ఎక్కువ మందిలో వ్యక్తమవుతున్న దృష్ట్యా బిజెపి నాయకులూ ఏమీ తేల్చలేకపోతున్నారు. ప్రజాభీష్టం మేరకే బిజెపితో కొనసాగాలా? తెగదెంపులు చేసుకోవాలా? అనే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రకటించారు. కేంద్రం తీరుపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నమాట వాస్తవమేనని అనడం గమనార్హం.

వర్సిటీలతో ఎపిపిఎస్‌సి ఎంఒయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూనివర్సిటీ పోస్టుల భర్తీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) పలు యూనివర్సిటీలతో అవగాహన ఒప్పందం (ఎంఒయు) చేసుకుంది. శుక్రవారం విజయవాడలోని ఎపిపిఎస్‌సి కార్యాలయంలో 14 యూనివర్సిటీల రిజిస్ట్రార్లు, ఇతర అధికారులతో ఎపిపిఎస్‌సి అధికారులు సమావేశమై ఈ ఒప్పందాలు చేసుకున్నారు. దీంతో అధ్యాపకపోస్టుల భర్తీకి సంబంధించి ఆయా యూనివర్సిటీలన్నింటికి కలిపి ఎపిపిఎస్‌సి ఉమ్మడిగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనుంది. ఆయా యూనివర్సిటీల్లో 1110 అధ్యాపక పోస్టుల భర్తీ కానున్నాయి. యూనివర్సిటీలకు స్వయంప్రతిపత్తి ఉన్నందున ఎపిపిఎస్‌సి నేరుగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించే అవకాశం లేదు. దీంతో యూనివర్సిటీల చట్టాన్ని సవరిస్తూ గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం సవరణ బిల్లును ప్రతిపాదించింది. ఎపిపిఎస్‌సి ద్వారా యూనివర్సిటీలకు సేవలు అందించేలా కొన్ని సవరణలతో ఈ బిల్లును సభ ఆమోదించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 6న జీవో నెం 20ని విడుదల చేయడంతో అడ్డంకులు తొలగిపోయాయి.

ఎంపిలు రాజీనామా చేసి..రండి

కాంగ్రెస్ ధర్నాలో పిసిపి అధ్యక్షుడు రఘువీరా రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపిలు తమ పదవులకు రాజీనామాలు చేసి ముందుకు రావాలని, అందరం కలిసి పోరాడుదామని ఎపిసిసి అధ్యక్షుడు ఎన్. రఘువీరారెడ్డి పిలుపు నిచ్చారు. ఏపి ప్రజల ఐక్య పోరాటంతో బిజెపిని రాష్ట్రం నుంచి తరిమికొడదామని అన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నాడిక్కడ స్థానిక ఏపి భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని ఏపికి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు బిజెపి యత్నిస్తుంటే..ఆ పార్టీకి టిడిపి, వైసిపి పార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు తెలుపుతున్నాయని మండిపడ్డారు. ఏపి ప్రజల హక్కులను ఈ రెండు పార్టీలు నాశనం చేస్తున్నాయని విమర్శించారు. వెంకటేశ్వరస్వామి పాదాల చెంత ఇచ్చిన హామీలను ప్రధాని మోడీ తుంగలో తొక్కారని, ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు ఏకమై, కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందరం ఏకమై, బిజెపిని సంఘ బహిష్కరణ చేసి, రాష్ట్రం నుంచి తరిమికొడదామని రఘువీరా రెడ్డి అన్నారు.

బోదకాలు వ్యాధిగ్రస్తులకు తెలంగాణలో పింఛన్లు

సిఎం కెసిఆర్ నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో బోదకాల వ్యాధిగ్రస్తు లకు ప్రతీ నెలా వెయ్యి రూపాయల పింఛన్ చెల్లించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి శాంతకుమారి, కుటుంబ సంక్షేమం కమిషనర్ వాకాటి కరుణ, ఉన్నతాధికారులతో సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు.రాష్ట్రంలోని సుమారు 47 వేల మంది బాధితులకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పింఛన్ అందించేందుకు వీలుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నట్టు వెల్లడించారు. గ్రామం యూనిట్‌గా ప్రజలంద రికీ ప్రభుత్వ ఖర్చుతోనే రోగ నిర్ధారణ పరీక్షలు చేయించనున్నట్లు సిఎం వెల్లడించారు. గ్రామస్థా యిలో పనిచేసే వైద్య అధికారులు, సిబ్బంది సేవలను మరింత ప్రభావవంతంగా వినియో గించుకునేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందిం చాలని అధికారులను ఆదేశించారు. ఆశ వర్కర్ల కు మరోసారి జీతాలు పెంచాలని నిర్ణయించిన సిఎం, రెండో ఎఎన్‌ఎంలకు కూడా జీతాలు పెంచనున్నట్టు ప్రకటించారు. ఆశా వర్కర్లను విలేజ్ హెల్తు అసిస్టెంట్లుగా మార్చనున్నట్లు చెప్పారు. ప్రైయివేటు ఆస్పత్రులకు కూడా కేసీఆర్ కిట్స్ పథకం వర్తింపచేయాలనే వినతులు వస్తున్నాయని, అయితే అందుకు ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు.

రాష్ట్రానికి అదనపు కేటాయింపులుండవు

నీతి ఆయోగ్ సభ్యులు రమేష్‌చంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతు ఆత్మహత్యల పరిస్థితులున్నాయని, పంటల బీమా, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వంటి వాటితో రైతుకు ఆదాయాన్ని కల్పించడంతోనే ఈ ఆత్మహత్యలను నివారించవచ్చని నీతీ ఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ రమేష్‌చంద్ పేర్కొన్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచిస్తున్నామని తెలిపారు. నీతీ ఆయోగ్ లోని వ్యవసాయ విభాగానికి చెందిన కమిటీ సభ్యులు రమేష్‌చంద్ రెండు రోజులు రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల్లో పరిశీలించారు. అనంత రం వెలగపూడి సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రాష్ట్రానికి అదనపు కేటాయింపులుండవన్నారు. నిబంధనల ప్రకారం అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

పాఠశాల విద్యా శాఖ టీచర్ల సమస్యల పరిష్కార కమిటీలో మార్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యా శాఖలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నియమించిన కమిటీలో మార్పులు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్య నాథ్‌దాస్ శుక్రవారం తాజాగా ఉత్తర్వులను విడుదల చేశారు. డిఎస్సీ 1998, 2008, 2012 క్వాలిఫైడ్ టీచర్ల నియామకాల సమస్య, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్ టీచర్ల జీతాలు 010 పద్దు ద్వారా చెల్లింపు, అప్‌గ్రేడ్ పండిట్లు, పిఇటి పోస్టుల పదోన్నతుల అంశం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సంబంధించి ఖాళీగా ఉన్న ఆర్ఐఒ, డివైఇవో, ప్రిన్సిపాల్స్ పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ చేయడం తదితర సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ సూచనలు, ప్రతిపాదనలు ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొంది. కొన్ని సమస్యలు పరిష్కారానికి కమిటీ 15 రోజుల్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది. వాస్తవానికి జనవరిలోనే ఈ అంశాలతో పాటు ఉన్నత విద్యకు సంబంధించిన కొన్ని అంశాలతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిటీలో ఉన్నత విద్యా శాఖ అంశాలపై అభ్యంతరాలు వ్యక్తమ య్యాయి. కొంతమంది కోర్టును ఆశ్రయించారు. దీంతో ఉన్నత విద్యాంశాలను మినహాయించి కమిటీ తాజాగా కమిటీ ఏర్పాటు చేసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈ కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. శాసన మండలి సభ్యులు వి బాలసుబ్రహ్మణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, కత్తి నరసింహరెడ్డి, ఎఎస్ రామ కృష్ణ, గాదె శ్రీనివాసులు నాయుడు, టిడి జనార్ధన్, పివిఎన్ మాధవ్, ఇంటర్మీడియేట్ విద్య కమిషనర్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

పెట్టుబడుల ఉపసంహరణ జాబితాలో
వైజాగ్ స్టీల్‌ప్లాంట్

సిఎమ్‌డి మధుసూదన్ వెల్లడి

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

2017-18 ఆర్థిక సంవత్సరంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రోత్సాహకరమైన ఫలితాలతో ప్రగతి దిశలో ఉందని, పెట్టుబడుల ఉపసంహరణ జాబితాలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఉందని ఆ సంస్థ సిఎమ్‌డి మధుసూదన్ తెలిపారు. పెట్టుబడుల ఉపసంహరణ జరిగితే సంస్థ ప్రగతిపై స్టేక్ హోల్డర్లు సమీక్ష చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం విశాఖలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మట్లాడుతూ, రెండేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని నిర్ణయించిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ వాస్తవ విలువ రూ.4,890 కోట్లుగా ఉందని, దీంట్లో 10 శాతం అంటే రూ. 489 కోట్లు ప్రయివేటు స్టేక్ హోల్డర్ల చేతుల్లోకి వెళ్తుందన్నారు. ప్లాంట్‌లో పెద్దఎత్తున ఆధునికీకరణ పనులు పూర్తి చేశామని, సాంకేతిక పరిజ్ఞానంతోనే పలు విభాగాల్లో మంచి ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. స్టీల్ ఉత్పత్తుల అమ్మకాల్లో 25 శాతానికి పైగా వృద్ధిని ఈ ఏడాది సాధించామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ప్రతినెలా 3 వేల టన్నుల ఐరన్‌ను పంపుతున్నా మన్నారు. గతేడాది డిసెంబర్‌లో రూ.2 వేల కోట్ల టర్నోవర్‌ను ప్లాంట్ సాధించిందని, 5.65 లక్షల టన్నుల స్టీల్‌ను విక్రయించామని వివరించారు. రెండేళ్ల క్రితం దారుణమైన ఆర్థిక స్థితి నుంచి బయటపడ్డామన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనుల సమస్య తీవ్రంగా ఉందని, వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు పి.మహపాత్రో (ప్రాజెక్టు), ప్రణయ్‌రాయ్ చౌదరి (కమర్షియల్) పాల్గొన్నారు.



రొయ్యల సాగుకు నిబంధనల మేరకు అనుమతులిస్తాం

మంత్రి ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రొయ్యల సాగు అనుమతులకు ఎదురవుతున్న అడ్డంకుల్ని పరిశీలిస్తామని, నిబంధనలకు లోబడి అనుమతులు ఇస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో రొయ్యల సాగుదార్లు సచివాలయంలో శుక్రవారం మంత్రిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రొయ్యల చెరువులకు నిబంధనలకు లోబడి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.సాగుదారులు మంత్రికి తమ సమస్యలు తెలుపుతూ తూర్పుగోదావరిలో 30 వేల ఎకరాల్లో రొయ్యల సాగు ఉన్నా, తొమ్మిది వేల ఎకరాల సాగుకే అనుమతులు ఉన్నాయన్నారు. మిగిలిన వాటి రెగ్యులరైజేషన్‌కు నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసినా అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కోర్టు కేసులు, ఫిర్యాదులున్నాయంటూ జిల్లాస్థాయి కమిటీ తమ దరఖాస్తులన్నిటినీ పెండింగ్‌లో పెట్టిందన్నారు. జీవో 7 ప్రకారం మంచినీటి చేపల చెరువులకు అనుమతులు తీసుకుని రొయ్యలసాగు చేయాలనుకుంటే జీవో 15ను అనుసరించి దరఖాస్తులు చేయాలని మంత్రి సూచించారు.

త్వరలో రాష్ట్రానికి డెస్క్ ఎరా కంపెనీ : లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డెస్క్ ఎరా కంపెనీ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు ఐటి శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. ఉండవల్లిలో సిఎం నివాసంలో కంపెనీ సీఈఓ శశాంక్ దీక్షిత్, కో ఫౌండర్ సోమేష్ మిశ్రా శుక్రవారం మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎపిలో అవలంబిస్తున్న విధానాలు, పాలసీలు, కల్పిస్తున్న రాయితీల గురించి మంత్రి వారికి వివరించారు. డిటిపి పాలసీ ద్వారా రెంటల్ సబ్సిడీ ఇస్తున్నామన్నారు. ఆఫీస్ స్పేస్ ఇబ్బందుల్ని అధిగమించేందుకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో కంపెనీలకు ఆఫీస్ స్పేస్ కల్పిస్తున్నామన్నారు. క్లౌడ్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు ఎక్కడా లేని విధంగా క్లౌడ్ హబ్ పాలసీ రూపొందించామన్నారు. అనంతరం శశాంక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో కంపెనీ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

విశాఖలో ఈ నెలలో జరిగే సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ 2018 లో ఎపి ప్రభుత్వం తో ఒప్పందం చేసుకుంటామన్నారు. విశాఖపట్నం లో 500 మంది ఉద్యోగులతో త్వరలోనే కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు.

ఆంధ్రుల మనోభావాలు దెబ్బతీస్తే ఎంతటి త్యాగాలకైనా సిద్ధం

ఎక్సైజ్ మంత్రి జవహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రుల మనోభావాలను దెబ్బతీస్తే ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని ఎక్సైజ్ మంత్రి జవహర్ తెలిపారు. పార్లమెంట్‌లో ఆంధ్ర ఎంపిలు చేస్తున్న నిరసనకు సంఘీభావం తెలియజేస్తూ శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రం మొండి వైఖరి వీడి ఐదు కోట్ల ఆంధ్రులకు సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించక పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం పంపిన నివేదికకు కేంద్రం ప్రకటించిన నిధులకు ఏమాత్రం పొంతనలేదని పేర్కొన్నారు. మెట్రో రైలు, రైల్వేజోన్, పెట్రో కారిడార్, రాజధాని రహదారుల అనుసంధానానికి నిధులు కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. మిత్రధర్మం పాటిస్తూ ఇంతకాలం ఓపికగా ఉన్నామని వివరించారు.

జెఎఒ, జెఎ పోస్టుల భర్తీకి 11న రాత పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి జెన్కోలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జెఎఒ), జూనియర్ అసిస్టెంట్ (జెఎ) పోస్టుల నియామకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 11వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట ఆధార్‌కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఒక దానికి గుర్తింపు కోసం వెంట తెచ్చుకోవాలని సంస్థ సంయుక్త కార్యదర్శి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలోని ఎంపిక చేసిన పరీక్షా కేంద్రంలో 11వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ జెఎఒ పోస్టులకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ జెఎ పోస్టులకు రాత పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రంలోని సెల్ ఫోన్‌లు, క్యాల్కులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించనున్నట్లు వెల్లడించారు. హాల్ టిక్కెట్‌లు అందని అభ్యర్థులు http://apgenco.cgg.gov.in లింక్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

అవకాశవాదానికి అర్థం చంద్రబాబే : బుగ్గన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవకాశవాదానికి నిజమైన అర్థం చంద్రబాబు నాయుడేనని వైసిపి ఎమ్మెల్యే, పిఎసి చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. ఆయన తన స్వార్థం కోసం ఏకంగా రాష్ట్ర ప్రయోజనాలనే తాకట్టు పెట్టిన ఘనుడని వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుగ్గన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రియల్ఎస్టేట్ వ్యాపారిలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర జిడిపిపై అబద్దాలు చెప్పడం వల్లే రావాల్సిన నిధులు కూడా రాకుండా వెనక్కి వెళ్లిపోయాయని విమర్శించారు. . దేశ వ్యాప్తంగా 6 నుంచి 7 శాతం జిడిపి వచ్చిందని కేంద్రం చెప్పుకుంటుంటే, చంద్రబాబు మాత్రం ఎపిలో 12 శాతం సాధించామని గొప్పలు చెప్పారన్నారు.

ప్రత్యేకం

కళ్లెం లేని కల్తీలు

- ఫుడ్ సేఫ్టీ బ్యాడ్
- 642 మంది ఇన్స్‌పెక్టర్లకు రాష్ట్రంలో ఉన్నది 29 మందే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తినే ఆహారం నుంచి తాగే నీటి వరకు అన్నీ కల్తీలే. కాసులకు కక్కుర్తి పడి కొందరు పలు తినుబండారాలు, నూనె, నెయ్యి తదితరాలను ఎలాంటి ప్రమాణాలూ లేకుండా పాటించకుండా నకిలీ బ్రాండ్‌తో మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. వినియోగదారులకు ఆకర్షణీయంగా కనిపించేలా చేసి వాటి విక్రయాలతో సొమ్ము చేసుకుంటున్నారు. కల్తీ ఆహార నియంత్రణ, పర్యవేక్షణకు ఉన్న ఫుడ్ సేఫ్టీ విభాగం నామమాత్రంగానే ఉంది.

ప్రస్తుతం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనరేట్‌లో భాగంగా ఇది ఆహార భద్రతా, తనిఖీ విభాగం (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఏపి) గా పనిచేస్తోంది. దీన్ని ఔషధ నియంత్రణ విభాగంలో కలిపేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఫుడ్ సేఫ్టీ విభాగానికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించడంలేదు. రాష్ట్రంలో ఆహార తనిఖీలకు సరిపడా ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు లేరు. మొత్తం 642 మంజూరైన ఫుడ్ ఇన్స్‌పెక్టర్ల పోస్టులుండగా వాటిలో ప్రస్తుతం 29 మంది మాత్రమే పనిచేస్తున్నారు. కనీసం ఐదు శాతం సిబ్బంది కూడా అందుబాటులో లేరు. దీంతో విచ్చలవిడిగా కల్తీ ఆహార వ్యాపారం సాగిపోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఒ), ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ) నిబంధనల ప్రకారం ప్రతి లక్ష మంది పట్టణ జనాభా, యాభై వేల మంది గ్రామీణ జనాభాకు ఒక ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ఉండాలి. కానీ ఎపిలో అతితక్కువ మంది ఫుడ్ ఇన్స్‌పెక్టర్లే ఉన్నారు. ఉన్నవారైనా తనిఖీలకు వెళ్లేందుకు వాహనాలు కూడా లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో అద్దె వాహనాల్లోనే తనిఖీలకు వెళ్తున్నామని ఫుడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. ఆహార కల్తీ గుర్తింపుపై ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యతా వారిదే. కానీ నిధులు కేటాయింపులేక ఆ కార్యక్రమం సరిగా నిర్వహించడంలేదు.



ఎపిలోనే సిబ్బంది తక్కువ

దక్షిణాదిన మిగతా రాష్ట్రాల కంటే ఎపిలోనే అతి తక్కువ మంది ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఉన్నారు. తమిళనాడులో 542 మంది, కర్ణాటకలో 275, కేరళలో 175 మంది ఫుడ్ ఇన్స్‌పెక్టర్లుంటే మన రాష్ట్రంలో మాత్రం కేవలం 29 మంది పనిచేస్తున్నారు. గతంలో ప్రొటెక్షన్ ఫ్రమ్ ఫుడ్ అడల్ట్రేషన్ (పిఎఫ్ఎ) ఉన్నప్పుడే ఆహార కల్తీపై నియంత్రణ ఉండేదని చెబుతున్నారు. 2011లో ప్రభుత్వం దాని స్థానంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ)ను తీసుకువచ్చింది. పిఎఫ్ఎ ఉన్నప్పుడు స్థానిక సంస్థల్లో ఉండే పారిశుధ్య ఇన్స్‌పెక్టర్లు పార్ట్ టైమ్ ఆహార తనిఖీల విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం స్థానిక సంస్థల శానిటేషన్ పనులకే వారు పరిమితమవుతున్నారు. వారి విద్యార్హత ఆహార తనిఖీలకు సరిపోక ఆ విధులు నిర్వర్తించే అవకాశం లేదు. దీంతో ఆహార తనిఖీ వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులో లేకుండాపోయింది.

30 పోస్టుల భర్తీకి సన్నాహాలు

రాష్ట్రవ్యాప్తంగా వందలాది ఫుడ్ ఇన్స్‌పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రస్తుతం 30 పోస్టులను మాత్రమే భర్తీ చేసేందుకు కసరత్తు సాగుతోంది. వీటిని ఏపిపిఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇప్పటికే కమిషన్‌కు ప్రతిపాదనలు పంపారు. మరో రెండు మూడు నెలల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముందని వారు తెలిపారు.

సంక్షిప్తం

మెడికల్ రీయింబర్స్‌మెంటు ప్రతిపాదనలు ఆన్‌లైన్‌లోనే..

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిటైర్డ్ ఉపాధ్యాయులు మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రతిపాదనలను ఆన్‌లైన్ ద్వారా పంపాలని పాఠశాల విద్యాశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తపాలా ద్వారా పంపిన ప్రతిపాదనలు స్వీకరించబోమని పేర్కొంది. డ్రాయింగ్, డిస్ బర్సింగ్ ఆఫీసర్ వద్దనే అన్ని ఒరిజినల్ దరఖాస్తులు ఉంచాలని, డైరెక్టరేట్ కార్యాలయానికి పంపాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఇద్దరు ఐపిఎస్‌లకు అదనపు డిజిలుగా పదోన్నతి

రాష్ట్రంలోని ఇద్దరు ఐపిఎస్ అధికారులకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తు తం సిఐడి విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఐజిలు అమిత్ గార్గ్, సునీల్‌కుమార్‌లకు అదనపు డిజిలుగా పదోన్నతి లభించింది. వీరిని సిఐడిలోనే కొనసాగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

12 నుంచి జల సంరక్షణోత్సవం : మంత్రి ఉమా

ఈనెల 12 నుంచి జూన్ 7 వరకు 116 రోజుల పాటు చేపట్టే నీరు ప్రగతి- జల సంరక్షణ రెండో విడత ఉద్యమ కార్యక్రమం ఉత్సవం మాదిరిగా నిర్వహించాలని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆదేశిం చారు. నీరు- ప్రగతి ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని సచివాల యంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాల్సిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కడప జిల్లాలో చెక్ డ్యామ్‌ల నిర్మాణం బాగుందని ప్రశంసించారు. అక్కడ భూగర్భ జలాలు గణనీ యంగా పెరిగాయన్నారు.

నంది నాటకోత్సవాల్లో పౌరాణిక ప్రదర్శనలు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టివి, నాటరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేంద్రంలో నిర్వహిస్తున్న నందినాటకోత్సవాలు విజయవంతంగా ప్రదర్శితమవుతున్నాయి. శుక్రవారం నుండి పౌరాణిక పద్య నాటకాలు ప్రారంభమయ్యాయి. వేళంగణిమాత నాట్య మండలి నందిగామ వారు 'దావీదు విజయము' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. దీన్ని నేతల ప్రేమ చంద్రుడు రచించగా అంబటి శామ్యేలు దర్శకత్వం వహించారు. మిర్యాలగూడ సాంస్కృతిక కళాక్షేత్రం వారు 'కళ్యాణ మండోదరి'ని ప్రదర్శించారు. తడికమల్ల రామచంద్రరరావు రచన, దర్శకత్వం వహించారు. ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ 'విశ్వామిత్ర విజయం' నాటికను ప్రదర్శించింది.



గుంటూరు జిల్లా తెనాలిలో శుక్రవారం నంది నాటకోత్సవాల్లో ప్రదర్శిస్తున్న 'దావీదు విజయము' పద్య నాటికలో సన్నివేశం

ప్రహసనంగా మూడో విడత రుణ మాఫీ

'పశ్చిమ'లో 4 నెలలైనా పూర్తికాని దుస్థితి

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

మూడోవిడత రుణమాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయడం ఒక ప్రహసనంలా సాగుతోంది. నాలుగు నెలలైనా రైతుల ఖాతాల్లోకి సొమ్ము చేరలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో లక్షమందికిపైగా రైతులు మాఫీ సొమ్ము కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 3.35 లక్షల మంది రైతులకు రూ.315 కోట్లు మూడోవిడత రుణమాఫీ సొమ్ము కింద జమ కావాల్సి ఉంది. రైతు సంఘాలు, రైతుల ఆందోళనలతో ఎట్టకేలకు 2017 అక్టోబర్ 10న మూడో విడత రుణ మాఫీ సొమ్ము జమ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పట్టుమని 15 రోజులు కూడా మాఫీ సొమ్ము జమ ప్రక్రియ సాగలేదు. జిల్లాలో రూ.138 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసి చేతులెత్తేశారు. బ్యాంకులు రైతుల నుంచి రుణ ఉపశమన పత్రాలు (బాండ్లు) తీసుకుని ఆన్‌లైన్ చేసినా డబ్బుల జమ జరగలేదు. సర్వత్రా నిరసనలు వ్యక్తమవడంతో మళ్లీ జమ ప్రక్రియ ప్రారంభించారు. జిల్లాలోని రైతులకు రూ.315 కోట్లు జమ చేయాల్సి ఉండగా, నాలుగు నెలలైనా మాఫీ సొమ్ము జమ కాలేదు. జిల్లాలో ఇంకా లక్షా పది వేల మంది రైతులకు రూ.60 కోట్లు జమ కావాల్సి ఉంది. జిల్లాకు రూ.253 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో అంతవరకే జమ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన సొమ్ము ఇంకా విడుదల కాలేదని అధికారుల మాటలను బట్టి తెలుస్తోంది. అంటే మిగిలిన సొమ్ము ఎప్పటికి విడుదల చేస్తారో.. రైతుల ఖాతాల్లో ఎప్పటికి జమవుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తదితరులు

ప్రజాశక్తి కృషి అభినందనీయం

సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

మహాసభల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా సమస్యలపై సాగుతున్న పోరాటాలు, ఉద్యమాలకు బాసటగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి చేస్తున్న కృషి అభినందనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. భీమవరంలో సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను స్థానిక తొట్టింపూడి ప్రభావతి కళా వేదకపై శుక్రవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రజాశక్తి రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ టిఎస్.ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత విద్య, వైద్యం ఇతర ముఖ్యమైన సంస్థలన్నీ హైదరాబాద్‌లో ఉండిపోవడం, విభజన హామీలు అమలు కాక నెలకొన్న ఇబ్బందికర పరిణామాలను వెలుగులోకి తీసుకురావడంలో ప్రజాశక్తి ముందంజలో ఉందన్నారు. సంపదను సృష్టించే కార్మికులకు వేతనాల పెంపునకు, అదరికీ విద్య ఉపాధి కోసం కట్టుబడి వార్తలను నిరంతరాయంగా అందించడంలో ప్రజాశక్తి ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలో మెగా ఆక్వా ఫుడ్‌పార్కు, గరగపర్రులో దళితుల సాంఘిక బహిష్కరణ, యనమదుర్రు డ్రెయిన్ ప్రక్షాళన కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిరంతరం సమరశీలంగా సాగుతున్న పోరాటాలను సమీక్షిస్తూ ప్రజాశక్తి ప్రత్యేక సంచిక తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ విఎస్ఎస్‌వి ప్రసాద్ ఈ సభకు స్వాగతం పలుకగా కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, ప్రజాశక్తి ఎడిషన్ బోర్డు ఇన్‌ఛార్జి పి.త్రిమూర్తులు, ఎడిషన్ యాడ్స్ ఇన్‌ఛార్జి డి.శ్రీనివాస్, జిల్లా యాడ్స్ ఇన్‌చార్జి పి.నారాయణరాజు, స్టాఫర్ గంగరాజు, సిబ్బంది, విలేకరులు పాల్గొన్నారు.



కళలతోనే ఆరోగ్యకర సంస్కృతి

భీమవరం ఫెస్ట్‌లో ప్రముఖ సినీ నటులు జివి.నారాయణరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కళలతోనే ఆరోగ్యకర సంస్కృతి సాధ్యమని, ప్రజలను ఆలోచింపజేసే చిత్రాలను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని ప్రముఖ సినీనటులు జివి.నారాయణ అన్నారు. సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహిస్తున్న ప్రజా సాంస్కృతిక సంబరాలు భీమవరం ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం రాత్రి పిఎన్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ అధ్యక్షతన నిర్వహి ంచిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.



భీమవరం ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ప్రముఖ సినీ నటులు జివి.నారాయణరావు

అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శ్రీకాకుళంలో పుట్టిన తప్పెటగుళ్ల వంటి కనుమరుగవుతున్న జానపద కళ అక్కడ నుండే దేశవ్యాప్తంగా సిపిఎం వ్యాపింపజేస్తుందన్నారు. గతంలో తాను నటించిన 'యువతరం కదిలింది', నాడు ప్రజలను ఆలోంచింపజేసిన 'రోజులు మారాయి' వంటి చిత్రాలు నేడు రావడం లేదన్నారు. నేటి యవత అటువంటి చిత్రాలను యూట్యూబ్ వంటి మాధ్యమాల్లో తిలకించడానికి అందుబాటులో ఉన్నాయని, అటువంటి చిత్రాల ద్వారా యువత ప్రేరణ చెందాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కళ కళ కోసం కాదు ప్రజల కోసమే అని అన్నారు. అంతరించిపోతున్న జానపద కళను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. అంతరించిపోతున్న జానపద కళలను బతికించేందుకు ప్రజానాట్యమండలి కళాకారులు, కమ్యూనిస్టులు కృషి చేస్తున్నారన్నారు. నేడు సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మించే చిత్రాలు తీసేవారు లేరన్నారు. డబ్బు సంపాదించుకోవడానికి ఫాస్ట్‌ఫుడ్ వంటి చిత్రలు తీయడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. వెకిలి హాస్యం, ద్వందార్థాలు, హాస్యం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించి, మహిళలను అగౌరవపర్చే రియాల్టీషోలు ప్రదర్శించే సంస్కృతి కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాంస్కృతిక కళారూపాలతోనే ఉద్యమాలు పుట్టుకొస్తాయనడానికి సిపిఎం పోరాటాలే నిదర్శనమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల(ప్రకాశం)

లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్ని ఇద్దరు యువకుడు మృతి చెందారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా దోర్నాల మండలం రోళ్లపెంట, పెద్దమంతనాల మధ్యలో శుక్రవారం ఉదయం జరిగింది. మృతులిద్దరూ తెలంగాణా రాష్ట్రానికి చెందిన వారే. పోలీసుల కథనం ప్రకారం... తెలంగాణా రాష్ట్రం వికారాబాద్ జిల్లా దౌలతాబాద్‌కు మండలంలోని గుండెపల్లెకు చెందిన ఎదుశెట్టి చంద్రప్ప (22), అదే మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన సింగం మధు (18)లతోపాటు మరికొందరు శివమాలలు వేసుకుని శ్రీశైలం వెళుతున్నారు. అక్కడ దర్శనం పూర్తి చేసుకుని మహానందికి ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా అక్కడ ఒక వాహనంపై వస్తున్న మధు, చంద్రప్ప లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరూ అక్కడి కక్కడే మృతి చెందారు. దోర్నాల పోలీసులు మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించారు.

మున్సిపాల్టీల్లో అభివృద్ధి పనులు వేగవంతం కావాలి

మంత్రి నారాయణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మున్సిపాల్టీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం కావాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు జిల్లా పర్యటనకు మంత్రి విచ్చేశారు. నంద్యాల, కర్నూలులో మున్సిపాల్టీ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ అందరికీ ఇళ్ల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అమృత్ పథకం కింద రూ.68కోట్లతో పనులు చేశారన్నారు. 2016-17లో 10వేల ఇళ్లను మంజూరు చేశామన్నారు. 2017-18కి గాను 15వేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ముందస్తుగానే ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. రూ.167.50కోట్లతో నీటిశుద్ధి కేంద్రాలకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. 101 జీవో ప్రకారం కర్నూలు తాగునీటి సరఫరాకు రూ.50కోట్లు నిధులను కేటాయిస్తున్నామని తెలిపారు. రూ.19కోట్లతో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

గుణదల మాత మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన గుణదల మేరీమాత మహోత్సవాలు అంగరంగ వైభవంగా శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు బిషప్ గ్రాసి హైస్కూల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన విశాలమైన ఆధునిక ఆధ్యాత్మిక కళావేదికపై బిషప్ మల్లవరపు ప్రకాష్, వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదల మాత పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్ మాట్లాడారు. అనంతరం బిషప్ గ్రాసి హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన పవిత్ర ఆధ్యాత్మిక కళావేదికపై సిల్వర్ జూబిలేరియన్ గురువులు ఫాదర్ గొర్రైముచ్చు జ్వాన్నేషు, ఫాదర్ నక్కా డేవిడ్‌రాజు, ఫాదర్ ఇంజపాల్, ఫాదర్ అంతయ్యలతో కలిసి బిషప్‌జోసఫ్ రాజారావు పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితరులు ఉత్సవాల ప్రారంభోత్సవ సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. సాయంత్రం బిషప్ గ్రాసి హైస్కూల్ గ్రౌండ్‌లో పూజావేదికపై రాజారావు, ప్రసాద్‌తో నెల్లూరు కతోలికపీఠం బిషప్ మోజెస్ దొరబోయిన ప్రకాశం కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిషప్ గ్రాసి హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ ఇంటి ఆంతోని, ఎస్ఎస్‌సి డైరెక్టర్ పసత తోమస్, ఫాదర్ చాకో తోటకర్ర తదితర గురువులు పాల్గొన్నారు.



గుణదల మేరీమాత ఉత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు

మార్చి 1నుంచి పూర్తి స్థాయిలో ఈ-నామ్


గుంటూరు మిర్చియార్డు చైర్మన్ సుబ్బారావు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డు లావాదేవీల్లో పారదర్శకత కోసం వచ్చేనెల ఒకటో తేదీ నుండి ఈ-నామ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన యార్డు పాలకవర్గ సమావేశం అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఈ-నామ్ విధానంలో రైతులకు ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడదని, కొనుగోలుదారులే ఖర్చులన్నీ భరించాల్సి ఉంటుందన్నారు. ఈ-నామ్ లావాదేవీల కోసం యార్డులో ఒక ప్లాట్‌ఫామ్‌ను కేటాయిస్తామని, ఈ-నామ్‌తో భవిష్యత్తులో కమీషన్ ఏజెంట్లు ఉండరని చెప్పారు. ఈ క్రమంలోనే మార్చి 6, 7 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల రైతులతోనూ ఈ-నామ్‌పై అవగాహన కల్పిస్తామని, రానున్న సీజన్లలో వాహనాల పార్కింగ్, ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా విజయవాడ దుర్గగుడి పర్యవేక్షణ కోసం ఐఎఎస్‌ను నియమించినపుడు, ప్రతి ఏడాదీ రూ.ఆరు వేల కోట్ల లావాదేవీలు నడిచే గుంటూరు యార్డుకు కార్యదర్శిగా ట్రైనీ ఐఎఎస్‌ను నియమించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

నాట్యాచార్యుడు పసుమర్తి కన్నుమూత

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ



పసుమర్తి సీతారామయ్య

నాట్యాచార్యుడు పసుమర్తి సీతారామయ్య(95) గురువారం రాత్రి తుదిశ్వాస విడిశారు. కృష్ణా జిల్లా కూచిపూడిలో పుట్టి పెరిగిన సీతారామయ్య 1963లో విశాఖకు వచ్చి స్థిరపడ్డారు. విశాఖ నగరంలో కూచిపూడి నృత్యాన్ని పరిచయం చేసిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వందలాది మందిని నాట్య కళాకారులుగా, ఆచార్యులుగా తీర్చిదిద్దిన సీతారామయ్య చివరి శ్వాసవరకు తన శిక్షణా కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆయన శిష్యరికంలో నగరం నుంచి వందలాది మంది నృత్యకారులను దేశ విదేశాలలో పేరు గడించారు. పద్మభూషణ్ అవార్డు అందుకున్న ఢిల్లీకి చెందిన స్వప్నసుందరి ఆయన శిష్యురాలే.

నీట మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి

గుంటూరు జిల్లా గుండ్లకమ్మ నదిలో ప్రమాదం

ప్రజాశక్తి-వినుకొండ (గుంటూరు జిల్లా)



ఎ.నాగేశ్వరరావు కోటయ్య నాగూర్ వలి

గుంటూరు జిల్లాలోని గుండ్లకమ్మ నదిలో మునిగి ముగ్గురు ఇంటర్ విద్యార్థులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం ఉప్పలపాడులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తమ్మిశెట్టి కోటయ్య(16), ఎ.నాగేశ్వరరావు(16), సయ్యద్ నాగూర్ వలి(17) ఉప్పలపాడుకు చెందిన అన్వేష్‌రెడ్డితో కలసి గుండ్లకమ్మకు ఈత ఆడేందుకు వెళ్ళారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు సుడిగుండంలో పడ్డారు. అన్వేష్‌రెడ్డి నీటి ప్రవాహానికి కొట్టుకొస్తుండగా పక్కనే ఉన్న గేదెల కాపరి నక్కా నాగిరెడ్డి రక్షించాడు. మిగిలిన ముగ్గురు మృత్యువాతపడ్డారు. అన్వేష్‌రెడ్డి వినుకొండలోని ఓ ప్రయివేటు కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. చాత్రగడ్డపాడుకు చెందిన తమ్మిశెట్టి కోటయ్య, శావల్యాపురం మండలం కనమర్లపూడికి చెందిన కె.నాగేశ్వరరావు, వినుకొండ మండలం నాగులవరానికి చెందిన సయ్యద్ నాగూర్ వలి వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. వీరి మృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి : స్పీకర్ కోడెల

ప్రజాశక్తి - పెనమలూరు (విజయవాడ)

విద్యార్థుల్లో సజనాత్మకతను పెంచినప్పుడే వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దగలమనీ, చదువుతో పాటు ఆట, పాటలు కూడా పిల్లలకు అవసరమనీ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం కష్ణా జిల్లా పెనమలూరు మండలం పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 67వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భాషకు దూరమైన జాతికి మనుగడ లేదన్నారు. తెలుగు భాషను, సంస్కతిని కాపాడుకోవాలనీ మరో అతిథి విధాన పరిషత్ స్పీకర్ ఎండి ఫరూక్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ, ఎంఎల్‌సిలు బొడ్డు నాగేశ్వరరావు, ఎస్.రామకష్ణ, రాజేంద్రప్రసాద్, ఎంఎల్ఎ బోడెప్రసాద్ ప్రసంగించారు.

'తరతరాల విజయవాడ' అంశంపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి- మొగల్రాజపురం (విజయవాడ)

ఇంద్రకీలాద్రి, మొగల్రాజపురం, భవానీపురం, విద్యాధరపురం, కనకదుర్గ దేవాలయాల చరిత్రలతో పాటు విజయవాడకు చుట్టుపక్కల ఉన్న చారిత్రక ప్రదేశాలను కలిపి ఒక సమగ్రమైన చరిత్రను రాసినప్పుడే విజయవాడ తరతరాల చరిత్రను క్రోడీకరించిన వారమవుతామని శాసనసభ డిప్యూటీస్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం మధు మాలక్ష్మీ సెంటర్లోని కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి, ఇండియన్ కౌన్సిల్ ఫర్ హిస్టారికల్ రిసెర్చ్, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'తరతరాల విజయవాడ' అనే అంశంపై రెండురోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ నవ్యాంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత విజయవాడ ముఖ చిత్రం మునుపెన్నడు లేనంతగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో చారిత్రక మూలాల్ని పోగొట్టుకోకుండా కాపాడుకోవాలని తెలిపారు. అమరావతి హెరిటేజ్ సిటీ చీఫ్ క్యూరేటర్ అమరేశ్వర్ గల్లా మాట్లాడుతూ ఒకప్పటి విజయవాడ జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ నగర వారసత్వాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. విజయవాడ నగరం ఎంతో అందమైందనీ, ఆ అందాలకు కృష్ణవేణమ్మ మరింత శోభను చేకూర్చిందన్నారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ ఉప సంచాలకులు డి.విజయభాస్కర్, మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ మాజీ మేయర్ జంధ్యాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న మండలి బుద్ధప్రసాద్

పాత నోట్లు స్వాధీనం

ప్రజాశక్తి కడపఅర్బన్:

కలసపాడు మండలం ఇ.తంబలపల్లి గ్రామ పొలంలో కొప్పళ తిరుపతిరెడ్డి పొలంలో ప్రభుత్వం రద్దు చేసి రూ.500, 1000 నోట్లు రూ.39.50 లక్షలను స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎఎస్‌పి శ్రీనివాసులురెడ్డి చెప్పారు. పట్టుకున్న నోట్లుకు రూ.2 కోట్ల వరకు పెనాల్టీ పడే అవకాశం ఉందని చెప్పారు.

సంపాదకీయం

స్టాక్ మార్కెట్ సంక్షోభం

అమెరికాలోనూ ప్రపంచ వ్యాప్తంగానూ గత శుక్రవారం నుంచి స్టాక్ మార్కెట్లలో తీవ్ర స్థాయిలో షేర్ల ధరలు పతనమౌతున్నాయి. శుక్రవారంనాడు ఒక్కరోజే డౌ జోన్స్ పారిశ్రామిక సగటు 665 పాయింట్లు పతనమైంది. అంటే 2.54 శాతం. 2016 సంవత్సరం జూన్ తరువాత ఒకే రోజు ఇంతగా షేర్ల ధరలు ఎన్నడూ పతనం కాలేదు. అమెరికాలోని ఇతర స్టాక్ మార్కెట్ సూచికలు కూడా ఇదే స్థాయిలో పడిపోయాయి. ఐరోపాలో కూడా ఇదే ధోరణి కొనసాగింది. జర్మనీకి చెందిన డాక్స్ సూచిక 1.68 శాతం పడిపోయింది.

గత రెండేళ్ల కాలంలో ఒక వారం రోజుల్లో స్టాక్ మార్కెట్ అమెరికాలో ఇంతగా ఎన్నడూ పతనం చెందలేదు. అమెరికా ప్రభుత్వ బాండ్లపై వడ్డీ రేట్లు పెరుగుతుండటం, జనవరి నెలలో అంతకు ముందు ఏడాది కంటే 2009 సంవత్సరం తరువాత అత్యధికంగా 2.9 శాతం వేతనాలు పెరగటం వంటి కారణాల వల్ల స్టాక్ మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడిందని ఫైనాన్షియల్ ప్రెస్ పేర్కొంది. శుక్రవారంనాడు మొదలైన స్టాక్ మార్కెట్ల పతనం ఆస్తుల బుడగ విస్ఫోటనానికి సూచికగా ఉన్నదా అనే విషయం తేలవలసి ఉన్నది. అయితే ఈ పరిస్థితి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నది. అనేక కారణాలవల్ల స్టాక్ మార్కెట్ల పతనం జరుగుతున్నది. కార్మికవర్గ పోరాటాలు పెరుగుతుండటంతో స్టాక్ మార్కెట్ బుడగలు బద్దలవుతున్నాయి. గత నాలుగు దశాబ్దాలుగా తాము కోల్పోయిన వేతనాలను, ఉద్యోగాలను, జీవన ప్రమాణాలను తిరిగి సాధించుకోవటానికి కార్మికవర్గం సమరశీలం అవుతున్న విషయాన్ని యూరప్‌లో ప్రస్తుతం జరుగుతున్న కార్మికవర్గ పోరాటాలు తెలియజేస్తున్నాయి. పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు, మిత వ్యయ విధానాలకు వ్యతిరేకంగా జర్మన్ పారిశ్రామిక కార్మికులు గత 15ఏండ్లలో ఎన్నడూ లేనంతగా సమ్మెలు చేస్తున్నారు. అలానే గ్రీస్‌లో సిరిజా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. తూర్పు ఐరోపాలోని కార్ల కంపెనీలలోను, బ్రిటన్‌లోని రైల్వేలలోను కార్మికులు సమ్మెలు చేస్తున్నారు. ఇరాన్, ట్యునీషియాలలో కూడా కార్మిక వర్గం నిరసన ప్రదర్శనలు చేస్తున్నది.

అమెరికాలో అకస్మికంగా వడ్డీ రేట్లు ఎక్కువ కావడంతో స్టాక్ మార్కెట్ బూమ్‌కిగల పునాది ప్రమాదంలో పడింది. అంతేకాకుండా 2008లో సంభవించిన వాల్‌స్ట్రీట్ సంక్షోభం తరువాత కార్పొరేట్- ఫైనాన్షియల్ బూర్జువావర్గం చేతిలో కేంద్రీకృతమైన విపరీత సంపద కూడా ప్రమాదంలో పడింది. పదేండ్ల అమెరికా ట్రెజరీ బాండ్లపై వడ్డీ 2.85శాతానికి పెరిగింది. నాలుగేండ్లలో ఈ పెరుగుదల అత్యధికం. ఐరోపాలో కూడా ప్రభుత్వ బాండ్ రేట్లు పెరుగుతున్నాయి. 'ప్రభుత్వ బాండ్లపై వడ్డీ రేట్లు భారీగా పెరగటంతోపాటుగా ద్రవ్యోల్బణం ప్రవేశించటం స్టాక్ మార్కెట్లకు అత్యంత ప్రమాదకరం. నిజానికి ఈ ప్రమాదం ఇప్పటివరకూ నిగూఢంగా ఉన్నది. అయితే అది ప్రస్తుతం భయంకరంగా బయటకు వచ్చింది' అని ఫైనాన్షియల్ టైమ్స్ వ్యాఖ్యాత జాన్ ఆథర్స్ పేర్కొన్నారు.

2009నుంచి అమెరికా ప్రభుత్వం ఫెడరల్ రిజర్వ్ ద్వారా బ్యాంకులకు, హెడ్జ్ ఫండ్స్‌కు, బడా పెట్టుబడిదారులకు అపరిమితంగా డబ్బు పంపిణీ చేసింది. వడ్డీ రేట్లను అత్యంత నామమాత్రంగా ఉంచి ఫైనాన్షియల్ మార్కెట్లలోకి డబ్బును ముద్రించి ప్రవేశపెట్టింది. ఈ ప్రక్రియనే 'పరిమాణాత్మక సడలింపు (క్వాంటిటేటివ్ ఈజింగ్)' అని పిలుస్తున్నారు. ప్రధాన సామ్రాజ్యవాద దేశాలలోని ప్రభుత్వాలు, ఐరోపా, ఆసియా దేశాలలోని కేంద్ర బ్యాంకులు అమెరికా విధానాన్ని అనుసరిస్తూ లక్షల కోట్ల విలువగలవని తమ బ్యాలెన్స్ షీట్స్‌లో నమోదుచేయబడిన పనికిమాలిన ఆస్తులను ప్రభుత్వ లెడ్జెర్లలోకి బదిలీ చేశాయి.

ప్రపంచంలోని ద్రవ్య పెట్టుబడిదారీ వర్గాన్ని తన నేరపూరిత చర్యల పర్యవసానాలనుంచి రక్షించి మరింత ధనవంతులను చేసే మహాకార్యాన్ని పెట్టుబడిదారీ రాజ్యం కార్మికవర్గాన్ని కుంగదొక్కుతూ నిర్వహించింది. మిత వ్యయ చర్యలు, వేతనాల కోతవంటి విధానాలతో రాజ్యం ప్రజల జీవన ప్రమాణాలను, సామాజిక పరిస్థితులను దెబ్బతీసింది. అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక ప్రతీఘాత విప్లవం గత పదేళ్లలో తీవ్రతరమైంది. స్టాక్ మార్కెట్లలో షేర్ల ధరలు క్రమేణా పెరగటంలో పాలక వర్గం చేస్తున్న ఈ దాడి ప్రతిబింబించింది. అయితే ద్రవ్య పెట్టుబడి సృష్టించిన ఈ స్టాక్ మార్కెట్ బుడగ ఎంతో కాలం సాగబోదని ఫైనాన్స్ గురువుల నుండి హెచ్చరికలు అందుతూనే ఉన్నాయి. నేటి స్టాక్ మార్కెట్ పతనం.. 2008లో వచ్చిన పెట్టుబడిదారీ సంక్షోభం సమసి పోలేదని స్పష్టం చేస్తోంది. సంక్షోభం వల్ల 2018లో సామాజిక ఉద్రిక్తతలు తీవ్రమై కార్మికవర్గ పోరాటాలు పునఃరుత్తేజితమౌతున్నాయి. వర్గ పోరాటాలను కత్రిమంగా అణచిన సుదీర్ఘ చారిత్రక వలయం అంతిమదశకు చేరుకుంటున్నదని, తాము కోల్పోయిన దానికంటే ఎక్కువగా తిరిగి సాధించటానికి కార్మిక వర్గానికి మార్గం సుగమం అయ్యే తరుణం ఆసన్నమైందని జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి.

ఇది విషయం



చాయ్ మోడీ సారూ
ఇక పల్లీలమ్మిస్తారా...
'టోపీ' ఎలా పెట్టాలో
శిక్షణ ఇప్పిస్తారా!

సొత్తంతా దోచిపెట్టి
చిప్ప ఇస్తారట చేతికి..
ఓటేసే ముందు కాస్త
కనువిప్పే మరి జాతికి!

- కొల్లూరు వెంకట్

మరీ ఇంత దిగజారుడా!?

మీడియా వాచ్

ఎస్ వెంకట్రావు

పత్రికలు ప్రజలకు జరిగిన ఘటనలను రిపోర్టు చేయాలి. వాటిని విశ్లేషించి వాస్తవాలు తెలియజేయాలి. పాలకుల మాటలకూ, చేతలకూ మధ్య పెరుగుతున్న అగాధాన్ని బహిర్గతం చేయాలి. కానీ మన రాష్ట్రంలో ప్రధాన పత్రికలు ఆ విషయాన్ని ఏనాడో మరిచిపోయాయి. నిష్పక్షపాతం ముసుగులో అవి రాజకీయ పార్టీ నేతల ప్రచార బాకాలుగా మారిపోవడంతో ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం కన్నా తమ యజమానుల ఎజెండాలకు అనుగుణంగా వార్తలను మలిచే పనిలో పడ్డాయి. శుక్రవారం నాడు రాష్ట్ర బంద్ గురించి పత్రికలిచ్చిన వార్తలను పరిశీలిస్తే ఇవి రాజకీయ పార్టీ ఎజెండాలకు ఎంతగా ట్యూన్ అయిపోయాయో అర్థమవుతుంది.

రాష్ట్రం పట్ల కేంద్ర వివక్షకు నిరసనగా రాష్ట్ర బంద్ నూటికి నూరు శాతం సంపూర్ణంగా జరిగింది. శుక్రవారం పత్రికలు తిరగేస్తే అన్ని పత్రికలూ ఆ విషయాన్ని పాఠకులకు తెలియజేశాయి. కానీ బంద్‌కు ఎవరు పిలుపిచ్చారు? ఎవరు మద్దతిచ్చారు? బంద్‌ను ఎవరు వ్యతిరేకించారు?... ఈ అంశాలపై మాత్రం ఇవి తమ ఎజెండాలకు అనుగుణంగా ప్రజలను మభ్యపెట్టే రిపోర్టింగ్ చేశాయి.


ఈ నెల ఒకటిన పార్లమెంటులో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీలు ఒక్కదాని ప్రస్తావనా అందులో లేదు. నిధులు లేవు. రైల్వే జోన్ లేదు. కడప ఉక్కు ఫ్యాక్టరీ లేదు. దుగ్గరాజపట్నం లేదు. వెనుకబడిన ప్రాంతాల ప్రస్తావన లేదు. విశాఖ చెన్నయ్ పారిశ్రామిక కారిడార్ లేదు. రాజధాని నిర్మాణం లేదు. పోలవరానికి విదిల్చారు అంతే. నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న ఆంధ్ర ప్రజలకు ఈ బడ్జెట్ పుండు మీద కారంలా తగిలింది. ఆగ్రహంతో రగిలిపోయారు.

రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా స్పందించాయి. 'రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేసింది' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు నిరసన తెలిపితే, 'మోసపూరిత బడ్జెట్' అని సిపిఐ కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. 'బడ్జెట్ వల్ల ఎపికి ఒరిగిందేమీ లేద'ని వైసిపి నేత విజయసాయి రెడ్డి పెదవి విరవగా, 'రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింద'ని కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఇంకా అనేక పార్టీలు, ప్రజా సంఘాలు బడ్జెట్‌ను తీవ్రంగా నిరసించాయి.

కానీ తెలుగు దేశం పార్టీ స్పందన ఏమిటి? 'బడ్జెట్ కేటాయింపులపై ఆవేదనతో ఉన్నాం. మిత్ర పక్షంగా ఉన్నందున బహిరంగంగా వ్యాఖ్యలు చేయలేం. మన అసంతృప్తిని కేంద్రానికి తెలిసేలా వ్యవహరించండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీలో ఆగ్రహంతో ఉన్న మంత్రుల నుండి కింది స్థాయి కార్యకర్తల వరకు బుజ్జగించారు. తరువాత రోజు 'ప్రజల అసంతృప్తి కేంద్రానికి తెలిసింది, అయితే పార్టీ శ్రేణులు తొందరపడి నోరు జారొద్దని' వారించారు. మూడో తేదీన పది వామపక్ష పార్టీలు సమావేశమై 8న రాష్ట్ర బంద్‌కు పిలుపిచ్చాయి. వెనువెంటనే వివిధ ప్రజా సంఘాలతో పాటు కాంగ్రెస్ బంద్‌కు మద్దతు ప్రకటించింది. మరునాడు వైసిపి, జనసేనతోపాటు అనేక ప్రజాసంఘాలు, వ్యాపార సంస్థలు మద్దతు ప్రకటించడంతో తెలుగు దేశం పరిస్థితి ఇరకాటంలో పడింది. దాంతో పార్లమెంటులో ఎంపిలు పోరాటం సాగించాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇంతలోనే రాజ్‌నాథ్ సింగ్ దగ్గరి నుండి ఫోన్ వచ్చిందని చెప్పి ఎంపీలతో ఆందోళన చేయకుండానే విరమించాలని కోరారు. వామపక్షాల బంద్ పిలుపు, దానికి అన్ని పార్టీల మద్దతు గురించి తెలుగు దేశం మంత్రులు, నాయకులే ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావిస్తే, బంద్‌లు చేస్తే 'ప్రజలు ఇబ్బందులు పడ్డం మినహా ఢిల్లీకి ఏం తెలుస్తుంది?' అని బంద్‌ను వ్యతిరేకించారు. దీన్ని అందుకున్న తెలుగు దేశం పార్టీ నాయకులు, మంత్రులు బంద్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు జారీ చేశారు.

ఈలోగా బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు తెలుగు దేశం పార్టీపైన ముఖ్యంగా చంద్రబాబు అవినీతి వ్యవహారాలపైన ప్రకటన చేయడంతో తెలుగు దేశం శ్రేణులు ఆయన దిష్టిబొమ్మలు తగలేస్తూ మొత్తం వ్యవహారాన్ని వ్యక్తిగత విమర్శలకు దిగజార్చి సమస్యను పక్కదోవ పట్టించబోయారు. కానీ వామపక్షాల క్యాంపెయిన్, ప్రతిపక్షాల మద్దతు, ముఖ్యంగా ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహం బంద్‌కు అనుకూలంగా మారింది. దాంతో ముఖ్యమంత్రి రూటు మార్చారు. బంద్ రోజున ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం శెలవిచ్చింది. ఆర్టీసి బస్సులను నిలిపేసింది. ప్రజల నుండి బ్రహ్మాండమైన మద్దతు రావడం చూసి ఆరోజున 'ఢిల్లీలో ఎంపీలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా అన్ని కేంద్రాల్లో తెలుగు దేశం శ్రేణులు ధర్నాలు' చేయాలని చంద్రబాబు ఆదేశాలు ఇచ్చి దుబాయ్ వెళ్లిపోయారు.

ఈ మొత్తం ఘటనా క్రమం చూసినప్పుడు రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా వామపక్షాలు సరైన సమయంలో బంద్ పిలుపునిచ్చాయనీ, ఇతర ప్రతిపక్షాలన్నీ రాజకీయ విజ్ఞతతో బంద్‌కు మద్దతు తెలిపాయని అర్థమవుతుంది. ప్రతిపక్ష పార్టీల శ్రేణులన్నీ బంద్‌లో పాల్గొన్నాయి. బంద్‌ను వ్యతిరేకించిన తెలుగు దేశం పార్టీ ప్రజాగ్రహాన్ని గమనించి చివరికి ఢిల్లీలోని ఎంపిలకు మద్దతు పేరుతో ధర్నాలు చేసింది. అది బంద్‌లో ఎక్కడా పాల్గొన లేదు. ఢిల్లీ లోని ఎంపిలకు మద్దతు పేరుతో ధర్నాలు చేసింది అంతే. పైగా తెలుగు దేశం ప్రభుత్వం బంద్ సందర్భంగా ప్రదర్శనలు చేస్తున్న 700 మంది వరకు వామపక్ష, ఇతర పార్టీల కార్యకర్తలను రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసింది.



సమాజంలోని అన్ని రంగాల్లో విలువలు పతనమైనట్లు పత్రికా రంగంలో పతనమవుతున్నాయి. ప్రధాన పత్రికలు తిమ్మిని బమ్మిని చేసే వార్తలు ఇలా ఇచ్చుకుంటూ పోతే ప్రజలకు పత్రికా రంగం మీదనే విశ్వాసం పోతుంది. అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

కానీ శుక్రవారం నాటి ఈనాడు పత్రిక చూడండి! బంద్ మొత్తం తెలుగు దేశం పార్టీ చేసినట్లు ప్రొజెక్ట్ చేసింది. బంద్‌కు 'మద్దతుగా నిలిచిన తెదేపా శ్రేణులు, మంత్రులు' అని బ్యానర్ వార్తకు బుల్లెట్ ఇచ్చింది. లోపలి పేజీల్లో కూడా 'వెల్లువెత్తిన నిరసన', 'పూర్తి మద్దతు ప్రకటించిన తెదేపా శ్రేణులు' అని పేర్కొంది. కానీ వార్తలో చూస్తే 'కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెదేపా ఎంపీలు పార్లమెంటులో చేస్తోన్న నిరసనకు పార్టీ శ్రేణులు పూర్తి మద్దతు ప్రకటించాయి. అని రాసింది. ఇంతకీ ఈనాడు దృష్టిలో తెదేపా శ్రేణులు బంద్‌కు మద్దతు ప్రకటించాయా, ఎంపీల దీక్షకు మద్దతు ప్రకటించాయా? 13 జిల్లాల్లో అపూర్వమైన రీతిలో బంద్ జరిగితే ఈనాడు పత్రికకు దానికన్నా అంతకు ముందు రోజు పార్లమెంటులో తెలుగు దేశం పార్టీ ఎంపీ గల్లా జయదేవ్ చేసిన ఉపన్యాసం పెద్దదిగా కనిపించింది. నిజానికి ముందు రోజు వార్త ఈనాడులో కనిపించడం బహుశా ఇదే ప్రథమమేమో. ఒకవైపు జయదేవ్, సిఎం రమేష్, సుజనా చౌదరి...వీరంతా కేంద్రంతో పడుతున్న లాలూచీ కుస్తీ ఉపన్యాసాలను పేజీలకు పేజీలు నింపిన పత్రిక బంద్ వార్తలు వచ్చే సరికి తెదేపా శ్రేణులు పూర్తి మద్దతిస్తున్నారని పేర్కొనడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించడం ఎవరి ప్రయోజనాల కోసం. ఇవన్నీ ట్రోజన్ హార్స్ వార్తలు కావా?

ఆంధ్రజ్యోతి తన యజమాని ప్రయోజనాలు కాపాడ్డానికి ఈనాడు కన్నా ఇంకా ఎక్కువగానే ప్రయత్నించింది. అసలు దానికి రాష్ట్రంలో జరిగిన బంద్ మొదటి పేజీలో ఒక మూలకు తోసేయాల్సినంత చిన్నదిగా తోచింది. ఢిల్లీలో తెలుగు దేశం పార్టీ పడుతున్న లాలూచీ కుస్తీ దానికి ప్రథమ ప్రాధాన్యం. మూలన పడేసిన బంద్ వార్తలోనైనా హెడ్డింగుల్లో (పెద్దవి, చిన్నవి) ఎక్కడైనా బంద్‌కు పిలుపిచ్చిన వామపక్షాలుగానీ, మద్దతిచ్చిన ప్రతిపక్షాలుగానీ కనిపిస్తాయా అంటే అదీ లేదు. కానీ 'సంఘీభావంగా టీడీపీ నిరసన హోరు' అని బుల్లెట్‌లో తెలుగు దేశం పార్టీ పేరు మాత్రమే ఇచ్చారు. బంద్‌ను వ్యతిరేకించిన తెలుగు దేశం పార్టీ బంద్‌లో పాల్గొన్నట్లు, ఇంకో మాటలో చెప్పాలంటే అదే బంద్‌లో ప్రధాన పాత్ర పోషించినట్లు ఎంత నాటకమో చూడండి. పైగా మొదటి పేజీలో వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాల జెండాలు, బ్యానర్లు లేకుండా ఒక్క తెలుగు దేశం పార్టీ రంగు మాత్రమే కనిపించేట్లు చాలా జాగ్రత్త పడ్డారు.

సాక్షి పత్రికలో కూడా దాని రాజకీయ ఎజెండాకు అనుగుణంగానే వార్తలు ప్రచురించారు. బంద్‌లో ప్రజలు నిరసన తెలిపింది ఎవరికి వ్యతిరేకంగా? రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు బంద్ జరిపారు. ఇప్పటికైనా విభజన హామీలు నెరవేర్చకపోతే ఖబడ్దార్ అని హెచ్చరిక చేశారు. కానీ సాక్షి చదివితే మొత్తం నిరసన అంతా తెలుగు దేశం పార్టీ మీద, దాని విద్రోహం మీదనే అనే భావన కలుగుతుంది. అసలు దోషి బిజెపిని చాలా లౌక్యంగా వదిలేశారు.

ప్రజాశక్తి మాత్రం బంద్‌లో వ్యక్తమైన ప్రజాగ్రహాన్ని సరైన రీతిలో ప్రతిబింబించడంతోపాటు బంద్‌కు పిలుపునిచ్చిన వామపక్షాల కృషినేకాక మద్దతిచ్చిన వివిధ పార్టీలు, సంస్థల కృషికి తగు ప్రాధాన్యతనిచ్చి ప్రచురించింది.

సమాజంలోని అన్ని రంగాల్లో విలువలు పతనమైనట్లు పత్రికా రంగంలో పతనమవుతున్నాయి. ప్రధాన పత్రికలు తిమ్మిని బమ్మిని చేసే వార్తలు ఇలా ఇచ్చుకుంటూ పోతే ప్రజలకు పత్రికా రంగం మీదనే విశ్వాసం పోతుంది. అది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ✦

చర్చ

చిన్నారులకు నిధులేవి?



ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతూ సరికొత్త ఇండియా కోసం అంటూ వ్యాఖ్యానించారు. అయితే ఈ సరికొత్త భారత్‌లో బాలల సంగతిని విస్మరించారు. ఇంకా ఆయన తన ప్రసంగ ప్రారంభంలో ఈ ఏడాది బడ్జెట్లో వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, ఉపాధి, చిన్న మధ్యతరగతి పరిశ్రమల మౌలిక సౌకర్యాల రంగాలను బలోపేతం చేసేందుకు మార్గనిర్దేశితులమయ్యామన్నారు. ఇందులో నిజమెంతో త్వరలోనే తెలిసిపోతుంది. రంగాల వారీగా కేటాయింపులు చూస్తే ఏ రంగం సంతృప్తికరంగా లేదు. ఎప్పటిలాగే, పిల్లల కోసం కేటాయింపులు వ్యయ బడ్జెట్లో 12వ ప్రకటనలో సమర్పించారు. 2016-17 వరకు 22వ ప్రకటనలో కేటాయింపులు ఇచ్చేవారు. సంఖ్య ముందుకు జరగడం వల్ల కేటాయింపులేమీ పెరిగింది లేదు. వివిధ మంత్రివర్గాలు చేర్చినవి, ఎలాంటి పథకాలు అందుబాటులోకి వచ్చాయో వివరించారు. దీని ప్రకారం గత కేటాయింపులకు అదనంగా ఈ సంవత్సరం సాంస్కృతిక శాఖ బౌద్ధ అధ్యయనాల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టిబెటన్ స్టడీస్, హిమాలయన్ సంస్కృతి అధ్యయనాల సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్, ఆర్ట్స్ అండ్ కల్చరర్ ప్రమోషన్, జోనల్ కల్చరల్ సెంటర్స్‌ని చేర్చారు. ఇవన్నీ పిల్లల బడ్జెట్లోకి వెళ్లడంలో ఉన్న మర్మమేంటో తెలియదు! వీటికి తోడు అదనంగా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఇన్‌స్పైర్ అవార్డును చేర్చింది. ప్రకటన 12లో కొత్త పథకాలు ఉన్నప్పటికీ వాస్తవంగా పిల్లలకు బడ్జెట్లో కేటాయింపులు 2008 (4.45 శాతం) నుంచి 2018-19కి 3.24 శాతానికి పడిపోయాయి. దశాబ్ద కాలంగా ఎప్పుడూ ఇంత తక్కువ లేదు. కొత్త పథకాలను చేర్చినప్పటికీ, 2018-19 బడ్జెట్లో పిల్లల అన్ని విభాగాల్లో తగ్గుదల ఉంది. దీనికి కారణం ముఖ్యంగా పిల్లల పథకాలకు బడ్జెట్లు కేటాయించే బాధ్యతను కేంద్రం రాష్ట్రాలకు వదిలి పెట్టడమే. 2012 (4.76) నుంచే బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోతూ వున్నాయి. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ తగ్గుదల చాలా ఎక్కువగా వుంది. 2014-15లో మొత్తం బడ్జెట్‌లో 4.5 శాతం పిల్లలకి కేటాయించారు, 2015-16లో ఇది 3.26కి, 2016-17, 2017-18లో ఇది 3.32 శాతం వుంటే ఇప్పుడు 3.24 శాతానికి తగ్గిపోయింది. ఎప్పటిలాగే, బాలల రక్షణకు అత్యంత తక్కువ, గత సంవత్సరం లాగే (0.05 శాతం) కేటాయించారు. ఆరోగ్యానికి 0.13 శాతం, అభివృద్ధికి 0.82 శాతం, మొత్తం 3.24 శాతం. కేంద్ర బడ్జెట్లో పిల్లల కోసం కేటాయించిన భాగం వివిధ రంగాల వారీగా చూసినా అన్నీ తగ్గుతూ వచ్చాయి. పిల్లల ఆరోగ్యం వాటా ఏడాదికేడాది పడిపోతూ వస్తోంది. కానీ ఆర్థికమంత్రి మాట్లాడుతూ కేవలం స్వాస్థ్య భారత్ (ఆరోగ్యవంతమైన భారతదేశం) మాత్రమే సమృద్ధ భారత్ (సంపన్న భారతదేశం) అన్నారు. అయితే బడ్జెట్‌లో బాలల ఆరోగ్యానికి చేసిన కేటాయింపుల్లో ఎక్కడా ఆయన వ్యాఖ్యలు ప్రతిబింబించలేదు. సర్వశిక్షా అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ కోసం కేటాయింపులు పెంచినప్పటికీ కేంద్ర బడ్జెట్లో బాలలకు విద్యారంగం వాటా తగ్గింది.

సర్వ శిక్షా అభియాన్ కోసం కేటాయింపుల్లో 11.2 శాతం పెరుగుదల ఉంది. ఇది ఎంత పెరిగినా సెస్ (ప్రస్తుతం 4 శాతం) నుండి వచ్చింది, ప్రభుత్వ ప్రస్తుత వనరుల నుండి ఎంతవరకూ వస్తుంది? అన్నది ప్రశ్నార్థకమే. మధ్యాహ్న భోజన పథకానికి కేవలం 5 శాతం మాత్రమే పెంచారు. పిల్లల సంరక్షణ పథకానికి 11.9 శాతం పెరుగుదలను స్వాగతించదగ్గది. ఎందుకంటే బాలల రక్షణకు హీనమైన కేటాయింపులు చేస్తున్నారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజనకి 11.1 శాతం తగ్గించారు. 18 సంవత్సరాల లోపు తల్లులుగా పెద్ద సంఖ్యలో ఉన్న కౌమార బాలికల కోసం కేటాయించిన ఈ పథకంలో కోత ఆందోళన కలిగించే అంశం. అందుకే 2018-19 బడ్జెట్ బాలలను శక్తి వంతులుగా చెయ్యడానికి ఏమాత్రం సరిపోదు.

కె రమాదేవి, విశాఖపట్నం.

జన వాక్యం

ఎంఆర్‌పి ధరలు మారవా!



ఏ చిన్న రోగం వచ్చినా డాక్టరును సంప్రదించినా, సంప్రదించక పోయినా మందులు మింగాల్సిందే. అయితే వాటిని కొనేటప్పుడు ధరలను ఎప్పుడైనా గమనించారా? అనేక మంది నిత్యం వాడుతున్న మందుల గరిష్ట అమ్మకపు విలువలు ఎక్కువ శాతం పైసలతో ముగుస్తాయి. ఎందుకు అలా పైసల్లో ఉంటుంది? మన దేశంలో పైసల వినియోగం పోయి చాలా రోజులు అవుతున్నా వాటిపై చిల్లర ధరల ముద్రణ మాత్రం ఆగలేదు. దీనివల్ల మందుల దుకాణాల్లో ఉన్న ధర కంటే ఎక్కువ చెల్లించి మరీ మందులు కొనుక్కోవాల్సి వస్తోంది. ఇలాంటి చిల్లర మోతలపై ఆర్థిక శాఖ దృష్టి పెట్టాలి. వాటిపై గల లాభ నష్టాలను ప్రజలకు అర్థం అయ్యేలా వివరించాలి.

శేషసాయి కుమార్, తిరుపతి.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

చర్చ

అక్రమ ఆస్తుల ఆరోపణలపై సిఎం స్పందించాలి

ఎ కోటిరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండెకరాల రైతని, ఆయనకు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని బిజెపి నాయకుడు, శాసనమండలి సభ్యుడు సోము వీర్రాజు ముఖ్యమంత్రిని బహిరంగంగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఆ ఆరోపణకు ఇప్పటి వరకు సమాధానం చెప్పకుండా 'తేలు కుట్టిన దొంగ'లా మౌనం వహించారు. ఈ మౌనానికి అర్థమేమిటి? ముఖ్యమంత్రి అక్రమంగా ఆస్తులు సంపాదించారా? లేక సోము వీర్రాజువి తప్పుడు ఆరోపణలా? వాస్తవం ఏమిటనేది రాష్ట్ర ప్రజలు తెలుసుకోవలసి ఉన్నది.

ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిపై తమకు మిత్రపక్షంగా ఉన్న పార్టీ ఎంఎల్‌సి అవినీతి ఆరోపణలు చేస్తే అవి తప్పుడు ఆరోపణలని, తాను అవినీతికి అతీతంగా, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్నానని ప్రజల ముందు నిరూపించుకోవాలి. తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయమని ఆరోపణలు చేసినవారిని నిలదీయాలి. అందుకు పూనుకోకుండా 'బెల్లం కొట్టిన రాయి' లా మౌనంగా ఉండటంలో అర్థం ఏంటి? తను ఆర్థిక నేరస్తుడినని, లక్షల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించానని ఆయన అంగీకరిస్తున్నాడా?


ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు లక్ష కోట్ల రూపాయలు అక్రమ ఆస్తులు సంపాదించాడని ఆరోపణలు చేస్తున్నారు. ఆయన ఆస్తులపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కేసులు నడుస్తున్నాయి కాబట్టి ఆయన నేరస్తుడు, తనపై కేసులు లేవు కాబట్టి తాను నేరస్తుడను కాదని చెప్పుకోవటానికి అవకాశం లేదు. వైఎస్ అధికారంలో ఉన్నంత వరకు ప్రతిపక్ష నాయకుడిపై కూడా కేసులు లేవు. ఆయన మరణించిన తర్వాత, నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుండి జగన్ బయటికి వచ్చిన తర్వాత ఆయన ఆస్తులపై విచారణ జరగటం, కేసులు నమోదు కావటం జరిగింది. ప్రస్తుతం చంద్రబాబు అధికారంలో ఉన్నారు కాబట్టి తాత్కాలికంగా ఆయనపై కేసులు నమోదు కాకపోవచ్చు. తనపై కేసులు లేవు కాబట్టి తాను అవినీతికి అతీతంగా ఉన్నామని చంద్రబాబు చెబితే చెల్లుబాటు కాదు. అక్రమ సంపాదనలో తెలుగుదేశం పార్టీ నాయకులు గత ప్రభుత్వాలను తలదన్నారని, వారి అక్రమాలపై కేంద్రం వద్ద ఆధారాలు ఉన్నాయని, ఆ భయంతోనే బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా 'కుక్కిన పేను'ల్లా ఉంటున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో వివిధ కుంభకోణాలలో అధికార పార్టీ నాయకుల పాత్రను చూసినా అది వాస్తవమని స్పష్టం అవుతున్నది. రాష్ట్రంలో కాల్‌మనీ వ్యాపారులు, ఇసుక కుంభకోణాలకు పాల్పడినవారు, భూకుంభకోణాలలో భాగస్వాములుగా ఉన్నవారు, రాజధాని ప్రాంతంలో తాజాగా బయటపడిన భూకుంభకోణం తదితర కుంభకోణాలకు పాల్పడుతున్న వారిలో అత్యధికులు తెలుగుదేశం నాయకులే ఉన్నారు. వివిధ కుంభకోణాలు బట్టబయలైనపుడు నేరస్తులను శిక్షించటం కాకుండా వారిని రక్షించటానికి ముఖ్యమంత్రి పూనుకున్నాడు. భోగాపురం ఎయిర్‌పోర్టు కాంట్రాక్టును బహిరంగ టెండర్ల ప్రక్రియలో ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా స్వంతం చేసుకుంటే ప్రభుత్వ రంగ సంస్థ అయితే తమకు కమీషన్లు రావని టెండర్లను అక్రమంగా రద్దుచేశారు. తమకు కమీషన్లిచ్చే ఒక ప్రయివేటు సంస్థకు ఆ కాంట్రాక్టును కట్టబెట్టటానికి ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. రాజధానిలో రైతుల నుండి సేకరించిన భూములను ప్రభుత్వ సంస్థలకు ఎకరం రూ. 4 కోట్ల చొప్పున కేటాయిస్తూ, ప్రయివేటు సంస్థలకు ఎకరం రూ. 50 లక్షల పాయల చొప్పున కట్టబెడుతున్న తీరు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నది. ఈ విధంగా రాష్ట్రంలో అక్రమ సంపాదనకు అలవాటు పడిన తెలుగుదేశం నాయకులు రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని ప్రశ్నించటానికి భయపడుతున్నారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వం లోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఐటి, సిబిఐ, ఇడి తదితర సంస్థలను తన చెప్పుచేతుల్లో పెట్టుకొని, తనను వ్యతిరేకించిన వారిపై దాడులు చేయిస్తున్నది. గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో కాంగ్రెస్ ఎంఎల్ఎలకు ఆశ్రయం కల్పించిన కర్నాటక మంత్రి ఆస్తులపైనా, తమిళనాడులో తమ కుట్రలను వ్యతిరేకించిన శశికళ, ఆమె బంధువులపై ఐటి శాఖ చేత దాడులు చేయించారు. బిజెపి మతోన్మాద రాజకీయాలకు బద్ధ వ్యతిరేకిగా ఉన్న లాలూ ప్రసాద్ యాదవ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులపై కేసులు పెట్టి వేధిస్తున్నారు. పావు శతాబ్దం క్రితం నాటి బోఫోర్స్ కేసును తవ్వి తీస్తున్నారు. నిన్నమొన్న తమ నేతృత్వంలో జరిగిన రాఫెల్ విమానాల కొనుగోలులో జరిగిన వేల కోట్ల రూపాయల కుంభకోణం గురించి ప్రశ్నిస్తే దేశరక్షణ పేరుతో తప్పుకుంటున్నారు. ఐటి, సిబిఐ దాడులు చేస్తున్నవారిలో అవినీతిపరులు లేరా అంటే ఉన్నారు. కాని బిజెపి తనకైతే ఒక న్యాయం, ఎదుటివారికొక న్యాయం అన్న తీరులో వ్యవహరిస్తున్నది. బిజెపి కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, కర్నాటకలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించిన ఎడ్యూరప్ప, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మహారాష్ట్రలో అర డజను ముందికి పైగా మంత్రులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా నకిలీ ఎన్‌కౌంటర్ల ఆరోపణల్లో జైలు శిక్ష అనుభవించారు. జైన్, సహారా డైరీలలో ముడుపులు స్వీకరించిన వారిలో ప్రధాని పేరు కూడా ఉంది. ఐటి, సిబిఐలు అవినీతిపరులందరిపై దాడులు చేస్తుంటే బిజెపి నాయకులు, మంత్రులు, ప్రధానిపై కూడా దాడులు చేయాలి కదా! కాని తమ ప్రత్యర్థులను వేధించటానికి బిజెపి ప్రభుత్వం ఈ సంస్థలను వినియోగించుకొంటున్నది.



ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తిపై తమకు మిత్రపక్షంగా ఉన్న పార్టీ ఎంఎల్‌సి అవినీతి ఆరోపణలు చేస్తే అవి తప్పుడు ఆరోపణలని, తాను అవినీతికి అతీతంగా, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్నానని ప్రజల ముందు నిరూపించుకోవాలి. తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయమని ఆరోపణలు చేసినవారిని నిలదీయాలి. అందుకు పూనుకోకుండా 'బెల్లం కొట్టిన రాయి' లా మౌనంగా ఉండటంలో అర్థం ఏంటి?

ఈ ఉదాహరణలు చూసిన తర్వాత బిజెపిని వ్యతిరేకిస్తే తమకు ఎదురయ్యే పరిస్థితి ఏమిటో టిడిపి నాయకులకు అర్థమైంది. తమ అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను బలి పెట్టటానికి పూనుకున్నారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు బిజెపితో లాలూచీ కుస్తీ నడుపుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో పోరాటం! చేస్తున్నామని చెబుతున్న వీరు ప్రధాని ప్రసంగించేటపుడు మాత్రం మౌనం వహించారు. 'నక్క పోయిన తర్వాత బొక్కలు వెతికితే' ప్రయోజనం ఏంటి? అవినీతిలో కూరుకుపోయి, బిజెపికి లొంగిపోయిన టిడిపి రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు చేయగలిగిందేమీ లేదని స్పష్టం అవుతున్నది. ఇటువంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు పూనుకున్న వామపక్షాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలి. తాము ఎన్నుకొని ప్రంపిన అధికార, ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుంటే ప్రజలు నిలదీయాలి. ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న సిపిఎం, ఇతర వామపక్షాలను గురించి ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ✦

వాళ్లిద్దరికీ.. పెద్దలు పెళ్లి చేయాలనుకున్నారు. ఆమె పెళ్లి చేసుకోనని ఏడ్చింది. చేసుకోకపోతే చచ్చిపోతానన్నాడు ఆమె తండ్రి. తండ్రి కోసం తలవంచింది. పెళ్లయ్యిన దగ్గర నుంచి ప్రతిరోజూ ఆమె భయం భయంగానే గడిపింది. ఎప్పుడు తెల్లవారుతుందా? అని ఎదురుచూసేది. ఇద్దరు పిల్లలు పుట్టారు. కొన్నాళ్లకి తండ్రి చనిపోయాడు. తనకు తోడుగా ఉంటుందని తల్లిని తెచ్చుకుంది. అయితే.. తల్లి వాళ్లింట్లో రెండురోజులు ఉండలేకపోయింది. 'రెండు రోజులైనా ఉండలేకపోయావే.. మరి నేను జీవితాంతం ఈ నరకం ఎలా అనుభవిస్తాననుకున్నారు?' అని ఆమె తల్లిని నిలదీసింది. ఆమె ఎందుకలా ప్రశ్నించింది? ఆమె ఎందుకు భయపడుతోంది? అది తెలుసుకోవాలంటే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ' చదవండి.



భార్య మాట వింటే తప్పేంటి?!

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ఐద్వా అదాలత్

ఆమె పేరు స్వరూప. అతని పేరు సురేష్.

స్వరూప స్కూలుకు వెళ్లి బాగా చదువుకుంటోంది. బాగా చదువుకుని, ఉద్యోగం చేయాలని స్వరూప కోరిక. కానీ మంచి సంబంధం వచ్చిందంటూ సురేష్‌ను తీసుకొచ్చి, పెళ్లి చేస్తామన్నారు తల్లిదండ్రులు. స్వరూప పెళ్లి చేసుకోనంటూ ఏడ్చింది. తిండి తినకుండా అలిగింది. "నువ్వు పెళ్లి చేసుకోకపోతే నా చావును చూస్తావు" అన్నాడు తండ్రి. స్వరూప మరోమాట మాట్లాడకుండా తలవంచి, తాళి కట్టించుకుంది.

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220

సురేష్ మున్సిపాల్టీలో పనిచేస్తాడు. మొదటిరోజు నుంచి అతని ప్రవర్తన ఆమెకు ఇబ్బందికరంగా కన్నా.. రాత్రి అవుతుందంటే భయంగా ఉండేది. అయినా తప్పని పరిస్థితి. ధైర్యం చేసి అతనికి ఎన్నో రకాలుగా చెప్పి చూసింది. అతను బజారులోకి వెళ్లి ఆమెను అల్లరిచేసేవాడు. ఈ పరిస్థితుల్లోనే ఇద్దరు పిల్లలు పుట్టారు. అయినా అతనిలో మార్పులేదు. పిల్లలు పెద్దవాళ్లవుతున్నా, వాళ్ల చదువుసంగతి పట్టించుకోడు. అన్నీ ఆమె తిప్పలుపడాల్సిందే. ఇక లాభం లేదని పెద్దలతో చెప్పించింది. అయినా అతనిలో మార్పులేదు. పైగా ఆ పెద్దలూ ఆమెనే సర్దుకుపొమ్మన్నారు. ఇప్పుడు పిల్లలు పెద్దయ్యారు. వారికన్నీ తెలుస్తున్నాయి. ఇప్పుడామెకు రాత్రి అంటే మరింత భయంకరం. ఆరునెలల కిందే ఆమె తండ్రి చనిపోయాడు. దాంతో ఒంటిరిగా ఉన్న తల్లిని తమ దగ్గరకు తెచ్చుకుంది. మొదటిరోజు అల్లుడు ప్రవర్తన చూసి ఆమె బెంబేలెత్తి పోయింది. రెండోరోజు చూశాక.. "అమ్మా స్వరూపా! నేను ఈ నరకంలో ఉండలేనే. ఎక్కడన్నా పని చేసుకుని, వాళ్ల పంచనే ఉంటాను" అంది. "ఏమ్మా! రెండు రోజులు ఉండలేనంటున్నావే.. మరి నేను ఇన్నేళ్లు ఎలా ఉన్నాననుకున్నావు? జీవితాంతం ఎలా ఉంటాననుకున్నారు?" అంటూ కన్నీరుమున్నీరైంది. తల్లిని తోడు తీసుకుని పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. వాళ్లు సురేష్‌ని అరెస్టు చేసి, రెండు దెబ్బలేసి, హెచ్చరించి పంపేశారు. వారం రోజులు బాగున్నాడేమో.. మళ్లీ మామూలే.. ఈ పరిస్థితుల్లో స్వరూప 'ఐద్వా అదాలత్'కు వచ్చింది.

స్వరూప: అమ్మా! ఎలా చెప్పాలో అర్థంకావడం లేదు. అతను చేసే పనిని నేను అగౌరవపరచడం లేదు. చేసేది నేనైనా, తనైనా మురికిపనే. తను చేసేది మరీ చెత్త ఎత్తేపని. రాగానే స్నానం చేయమంటే చేయడు. అలా పదేసి రోజులు స్నానం చేయకుండా ఉంటాడు. పైగా పిల్లలు ఓ పక్క చదువుకుంటున్నా సంసారం చేయమంటాడు. రాకపోతే ఫ్యాన్‌కు ఉరేసుకుంటానంటాడు. గోల గోల చేస్తాడు. ఆ క్షణం నాకు చచ్చిపోవాలనిపిస్తుంది. "పిల్లల ముందు ఈ గోలేంటి?" అంటే వినిపించుకోడు. పైగా.. నన్ను జుట్టుపట్టి కొట్టుకుంటూ రోడ్డు మీదకు తీసికెళ్లి... "నా భార్య నాతో సంసారం చేయనంటోంది.. దీనికి ఎవడో ఉన్నాడు" అంటూ రచ్చ రచ్చ చేస్తాడు. అతన్ని లోపలికి తీసుకురావడం నావల్ల కాదమ్మా! చుట్టూ ఇళ్లల్లో వాళ్లు.. "ఏమైందే నీకు.. వాడితో సంసారం చేయకపోతే ఎవరితో చేస్తావు? నీకు బాగా ఎక్కువైంది.. చెత్త పనిచేస్తే సంసారం చేయవా?" అని వాళ్లడుగుతుంటే నేనేమి సమాధానం చెప్పాలి? నాకు జ్వరంతో ఒళ్లు కాలిపోతున్నా అతని దగ్గరకు వెళ్లాల్సిందే. లేకపోతే పెద్ద గొడవ. అందుకే నోరు మూసుకుని అతనితో సంసారం చేస్తున్నా. ఈ పరిస్థితుల్లో పిల్లలేమైపోతారో అని నా దిగులు. ఈ పిల్లల కోసమే బతుకుతున్నాను. మీరు ఎలా చెబితే అలా చేస్తా.

బాధ్యులు లెటరుకు రాకపోతే, రెండువారాల్లో రావాలని సురేష్‌కు కబురు చేశారు. మూడోవారం సురేష్ వచ్చాడు.

సురేష్: ఆమెకు నేనంటే లెక్కలేదు. కొన్నాళ్లు అన్నం తినిపించేది. ఇప్పుడసలు నా తిండి గురించే కాదు, నాకు బాగోకపోయినా టాబ్లెట్ కూడా తెచ్చివ్వదు. పనికాడే ఉంటుంది. నా జీతం మొత్తం ఆమెకే ఇస్తా. నా ఖర్చులు మాత్రమే తీసుకుంటాను. ఎవరైనా పనికి పిలిస్తే వెంటనే వెళ్లడానికి వీలవుతుందని, నాలుగు డబ్బులు వస్తాయని స్నానం చేయను. అయినా అది నా స్నానానికి వేడినీళ్లు పెట్టాలిగా? ఈ మధ్య అది నన్ను తిరిగి కొడుతుంది. పోలీసులతో కొట్టిచ్చింది. నాకు బాగా కోపం.. అది ఎలా తగ్గాలో కాస్త చెప్పండి.

ఆమె ఎంతగా తపిస్తుందో అర్థంచేసుకో. ఆమెలాంటి భార్య దొరకడం నీ అదృష్టం. నిన్నెలా మార్చుకోవాలనేదే ఆమె ఆలోచన... ఆమె తపన..

బాధ్యులు ఏమన్నారంటే..

సురేష్! ఆ అమ్మాయి ఇళ్లల్లో పనిచేస్తున్నా శుభ్రంగా ఉంటుంది. అలా ఉంటేనే ఆమెను పనిలోకి రానిస్తారు. ఆమె పసిపిల్లని చూసే పనికి కుదిరింది. అది నువ్వు దృష్టిలో పెట్టుకోవాలి. అలాగే భార్యాభర్తల బంధం అంటే ప్రేమానురాగాలతో ఉండాలి. కానీ, నీవు స్విచ్ వేస్తే ఫ్యాను తిరిగినట్లు.. పిలవగానే వచ్చేయాలని అనుకోవడానికి నీ భార్యేమీ వస్తువు కాదు. మనిషి. ఆమె ఆరోగ్యం గురించి, ఎదిగిన పిల్లలు ఉన్నప్పుడు ఎలా ఉండాలో కూడా నీకు తెలియకపోతే ఎలా? నీకు తెలియకపోయినా, ఆమె చెప్పేదన్నా వినిపించుకోవాలిగా? ఆమె నీతోపాటు పనికెళ్లి వస్తుంది. ఆమెకు వేడినీళ్లు పెట్టినా నీవు చేయకపోతే, కాసిన నీళ్లు వృధానేగా? అయినా నువ్వే రాగానే నీళ్లు పెట్టుకుని, స్నానం చేయడం తప్పా? ఆమె ఇంటెడు పనీ చేసి, పొద్దున్నే పనికి వెళ్లాలి. ఆమెకు నువ్వు సాయం చేయకపోయినా, నీ పనులు నువ్వు చేసుకోకపోతే ఎలా? నీకు అన్నం తినిపించడం ఏమిటి? పిల్లలే వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటున్నారు. ఆమె మనిషా? మిషనా? నీకు బాగుందీ లేనిదీ ఆమె పనిచేసే చోట నుంచి చూడగలదా? నీకు బాగోనప్పుడు టాబ్లెట్ తెచ్చుకొని వేసుకోవాలి. ఇవన్నీ చూస్తుంటే నీలో చాలా మార్పు రావాల్సి ఉంది. నువ్వు ప్రతివారం ఇక్కడికి రావాలి. మేము చెప్పే వరకూ అలా కొన్ని వారాలు వస్తే, నీలో క్రమక్రమంగా మార్పు రావడానికి వీలవుతుంది. నువ్వు అడిగినట్లు కోపం తగ్గేందుకు కొన్ని ఎక్సర్‌సైజులు చెప్తాం. అవి పాటించు. ప్రస్తుతం నీకు కోపం వచ్చినప్పుడు తగ్గే వరకూ అంకెలు లెక్క పెట్టు. అక్కడ నుంచి కాసేపు బయటకు అంకెలు లెక్కపెట్టుకుంటూనే వెళ్లిపో. కోపం తగ్గాక ఇంటికి రా. నువ్వు ఆమె పట్ల ప్రేమ చూపకపోతే నీ పట్ల



ఆమెకు అనురాగం ఎలా ఉంటుంది? ఆమె ఇప్పటికీ నీ నుంచి వెళ్లిపోవాలని అనుకోవడం లేదు. పిల్లల కోసం ఆమె ఎంతగా తపిస్తుందో అర్థంచేసుకో. ఆమెలాంటి భార్య దొరకడం నీ అదృష్టం. నిన్నెలా మార్చుకోవాలనేదే ఆమె ఆలోచన.. ఆమె తపన.. ఈ సమస్యల్ని ఎలా పరిష్కరించుకోవాలో తెలియకే మా దగ్గరకు వచ్చింది. అలాంటి ఆమెను వేరెవరితోనో సంబంధాలున్నాయంటూ అనుమానించడం, అల్లరి చేయడం సరికాదు. అది ఇది అంటూ పిలవకు చక్కగా ఆమెను పేరు పెట్టి పిలువు. ఈ రోజు నుంచి ఆమెను కొట్టినా, తిట్టినా మేం ఊరుకోం. ఆమె నుంచి నీకేమైనా ఇబ్బంది వస్తే, నువ్వూ మాతో చెప్పొచ్చు, ఆమెకు మేం చెబుతాం.

స్వరూపా! నీవూ అతని పట్ల కొంచెం ప్రేమ చూపించు. అతన్ని అలాగే మార్చుకోవాలి. ఎదురు తిరిగితే మరింత రెచ్చిపోతాడు తప్ప, దారిలోకి రాడు. అతని ఆరోగ్యం సరిగా లేదు. వెంటనే డాక్టర్ దగ్గర చూపించండి. మొగల్రాజపురంలో డాక్టర్ విజయకుమార్‌గారు ఉన్నారు. ఆయన ఉచితంగా చూసి, మందులిస్తారు. నీ భర్తకు సరైన వైద్యం అక్కడ లభిస్తుంది.

బాధ్యులు చెప్పిన దానికి ఇద్దరూ అంగీకరిస్తూ రిజిష్టర్‌లో సంతకాలు చేసి వెళ్లారు. ప్రస్తుతం ఇద్దరూ బాగానే ఉన్నారు. డాక్టర్ దగ్గరకు కూడా వెళ్లి చూపించుకున్నారు.

- శాంతిశ్రీ

చిత్ర సౌజన్యం : ఇళయరాజా

ఈ మధ్య మా ఎదురింట్లోకి మా ఆయన మరదలు వచ్చి చేరింది. మొదట్లో తాను నాతో చాలా స్నేహంగా ఉండేది. రానురాను ఆమెకు, మా ఆయనకు మధ్య చాలా చనువు పెరిగింది. ఏది మాట్లాడినా 'నీవుగానీ లేకపోతే మా బావ నన్నే పెళ్లాడేవాడు. అప్పుడు నేను చాలా సంతోషంగా ఉండేదానిని' అని పదేపదే అంటుంది. ఇదే విషయం మా ఆయనతో చెబితే ఆమె అమాయకురాలు. తన మాటలు నీవు పట్టించుకోకు అంటూ నాకే నచ్చజెపుతున్నాడు. ఈ మధ్య ఆమెను మా ఇంటికి రావద్దని కూడా చెప్పా. కానీ ఆమె పదేపదే రావడమే కాక, ఇరుగుపొరుగు వారికి మా బావను నేను పెళ్లి చేసుకోవాల్సింది.. మిస్సయ్యాను అంటూ చెబుతోంది. భర్తకు తనకు మధ్య సరైన బంధం ఏర్పడలేదు. అందుకే ఇలా మాట్లాడుతోందా? తననెలా మార్చాలి?

- ఓ సోదరి

ఆమె అమాయకత్వాన్ని అర్థం చేసుకోండి!

సైకాలజి

ఆమెలో ఉన్న అమాయకత్వమే ఆమెనలా మాట్లాడిస్తూంటే కనుక మీరు ఆమెని అర్థంచేసుకునే ప్రయత్నం చేయండి. ఆమె చనువుగా మాట్లాడినంత మాత్రాన మీ భర్తవైపు నుంచి ఏ స్పందనా లేకపోతే.. ఆయన తన పరిణిత ధోరణిని ప్రదర్శిస్తుంటే ఎంతమందికి చెప్పినా తనను తాను తక్కువ చేసుకుంటుందనే అర్థంచేసుకోండి. మీకు దానివల్ల కలిగే నష్టమేమీ ఉండదు. ఆమె మీద మీరు కోపం పెంచుకోవటం కంటే ఆమె అలా చెప్పడం వల్ల తనకు కలిగే నష్టాలు మీరు అర్థంచేసుకుంటే మంచిది. జరిగిపోయిందేదో జరిగిపోయింది అంటూ ఆమెలో మీరు ఏమైనా పరిపక్వత తీసుకురాగలరేమో



ఆలోచించండి. ఆమె అమాయకత్వాన్ని చూసి మీరూ అమాయకంగా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం ఎంత వరకు సబబో ఆలోచించండి. మీ భర్తతో మీకున్నటువంటి అనుబంధాన్ని సాధ్యమైనంత ధృడంగా మార్చుకోండి. మీ సంతోషకరం. మీ భర్తమీద మీకు పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే మీరు ఆమె మాటలను పట్టించుకోవాల్సిన అవసరమూ లేదు. మొదట్లో వినడానికి బాగానే ఉన్నా, రోజులు గడిచే కొద్దీ ఆమె మాటలు అలవాటై ఎవరూ వాటికి విలువనివ్వరు. అలాంటప్పుడు ఆమె పదేపదే ఇద్దరి మధ్యలో ఉన్నటువంటి ప్రేమలో ఏ విఘాతాలు రాకుండా కాపాడుకోండి. ★



డా. పద్మజ, సైకాలజిస్టు

మీ కోసం



ఉడికించిన బంగాళదుంపలను ఎగ్ స్లైసర్స్‌తో కోస్తే ముక్కలు చక్కగా వస్తాయి.

జీవన సౌరభం

ఏరోజు మన ప్రమేయం లేకుండా సాగిపోతుందో.. ఆ రోజుని మనం వృథా చేసినట్లే.

పోషకాల గని పచ్చిమిరప



సూప్... అల్పాహారం... కర్రీ, చారు, మిక్చర్, భజ్జీ... ప్రతిదానిలోనూ పచ్చిమిరప ఉండాల్సిందే. వంటకమేదైనా స్పైసీ కోరుకునేవారు పచ్చిమిరపను బాగా అభిమానిస్తారు. ఇందులో కూడా ఎన్నో పోషకాలు, ఔషధగుణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

✧ పచ్చి మిరపకాయల్లో కేలరీలు లేవు కానీ. ఇందులో ఉండే రసాయనాలు జీవక్రియలను 50 శాతం వేగవంతం చేస్తాయి. పచ్చిమిరపకాయలను తిన్న మూడు గంటల పాటు ఈ ప్రభావం ఉంటుంది.

✧ వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను ఎప్పటికప్పుడు బయటకు పంపించేస్తాయి. దీంతో రక్షణ లభిస్తుంది. ప్రొస్టేట్ గ్రంథి సమస్యలకు పచ్చిమిరపకాయలు మంచి పరిష్కారం.

✧ గుండెకు పచ్చిమిరప రక్షణ కవచం. రక్తంలో కొలెస్టరాల్, ధమనుల లోపల కొవ్వు ఏర్పడకుండా పచ్చిమిరపలోని రసాయనాలు అడ్డుకుంటాయి. రక్తం గడ్డకట్టకుండా నివారిస్తుంది. దీనివల్ల హార్ట్ ఎటాక్, స్ట్రోక్ వంటి ప్రాణాంతక సమస్యలు రాకుండా జాగ్రత్తపడవచ్చు.

✧ మిరపకాయలలో మంట ఎత్తించే రసాయనమే క్యాప్సేసియన్. ఇది బ్రెయిన్‌లోని హైపోథాలమస్ అనే చల్లబరిచే కేంద్రాన్ని ప్రేరేపించడం ద్వారా శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది.

✧ జలుబు, సైనస్ ఉన్న వారికి పచ్చిమిరప మంచి సహజ ఔషధం. మెంబ్రేన్లకు రక్త సరఫరా బాగా జరిగేలా చూస్తుంది. మెంబ్రేన్ అనేది ఒక టిష్యూ. ఇందులో శ్లేష్మం (మ్యూకస్) ఏర్పడడాన్నే సైనస్. క్యాప్సేసియన్ వల్ల రక్త సరఫరా జరిగి మెంబ్రేన్లలో శ్లేష్మం పలచబడుతుంది. దీంతో ఉపశమనం లభిస్తుంది.

✧ రక్తంలో షుగర్ స్థాయుల్ని పచ్చిమిరప నియంత్రిస్తుంది. అందుకే మధుమేహులు ప్రతిరోజూ తమ ఆహారంలో వీటిని తప్పకుండా తీసుకోవాలి.

✧ వీటిలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. అందుకే ఐరన్ లోపం ఉన్న వారికి మిరప మంచి ఔషధం.

✧ పచ్చిమిరపలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు బాగానే ఉన్నాయి. అందుకే చర్మ వ్యాధుల నివారణలో ఉపయోగపడతాయి. ★



విందు ఇచ్చే విమానం

ఓ ఐడియా జీవితాన్నే మార్చేస్తుందన్నట్లు వ్యాపారవృద్ధికి పలువురు కొత్త కొత్త ఆలోచనలు చేస్తుంటారు. చైనాకు చెందిన ఓ వ్యాపారవేత్త చేసిన ప్రయోగం అలాంటిదే. ఇంతకూ ఆయన ఏం చేశాడంటే.. బోయింగ్ 737 విమానాన్ని రెస్టారెంట్‌గా మార్చేశాడు. దీంతో ఇప్పుడదో ఆకర్షణగా మారి, వ్యాపారాన్ని వృద్ధి చేస్తోంది. లిల్లీ ఎయిర్వేస్ పేరున మొట్టమొదటిసారి భిన్నంగా ఆవిష్కరించిన ఈ బోయింగ్ విమానం.. ఇప్పుడు ఓ రెస్టారెంట్!

ఈ విమాన రెస్టారెంట్‌లో భోజనం చేయాలంటే చైనా వెళ్లాల్సిందే. చైనాకు చెందిన ఒక వ్యాపారవేత్త మొట్టమొదట ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ విమాన రెస్టారెంట్ నిజంగా ప్రత్యేకాకర్షణే. వ్యాపారవేత్త లీ లియాంగ్ మే 2015లో ఇండోనేషియా ఎయిర్‌లైన్స్ బటావియాకు చెందిన బోయింగ్ 737 విమానాన్ని కొనుగోలు చేశాడు. అది.. డీ మౌంటింగ్, పోర్ట్, షిప్పింగ్, బిజినెస్ లైసెన్స్, ట్రేడ్ డిక్లరేషన్ వంటి విధి విధానాలు, కస్టమ్స్ ప్రొసీజర్లు పూర్తిచేసుకొని, చైనా చేరేసరికి ఆర్నెల్లు పట్టింది. తాను ఒక్కొక్కటిగా పనులు చేయించుకోవడంతో ఆ బోయింగ్ 737 విమానాన్ని ఎనిమిదిసార్లు డిస్ అసెంబుల్ చేశారనీ, ఇండోనేషియా నుంచి అది చైనాలోని ఊహాన్ చేరేసరికి మరో నాలుగు నెలలు పట్టిందన్నాడు లీ. విడి భాగాలను సుమారు 70 కంటెయినర్లలో షిప్పింగ్ చేశారని, అవి.. దఫ దఫాలుగా అతనికి చేరేసరికి రవాణాఖర్చుతో కలిపి ఇంచుమించుగా 452,325 డాలర్ల నుంచీ 5.28 మిలియన్ డాలర్లకు చేరిందట! ఇప్పుడు అతను స్థాపించిన విమాన రెస్టారెంట్ ప్రపంచంలోనే ఖరీదైన రెస్టారెంట్లలో ఒకటి.

ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని చివరికి చైనా చేరిన పాత బోయింగ్ 737 విమానాన్ని.. లీ ఆప్టిక్స్ వ్యాలీ పెడెస్ట్రియన్ వీధిలో రెస్టారెంట్‌గా మార్చేశాడు. ఊహాన్‌లోనే అత్యంత రద్దీగా ఉండే షాపింగ్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ఈ కొత్త హోటల్ ఇప్పుడు భోజనప్రియులతో పాటు.. విమానప్రియులకూ ఆహ్వానం పలుకుతోంది. విమానంలోని క్యాబిన్ ప్రాంతాన్ని రెస్టారెంట్‌గా ఏర్పాటుచేసిన లీ.. జెట్ ఫ్లైట్‌ను నడుపుతున్న అనుభూతి కలిగేలా కాక్ పిట్ ఏరియాను ఫ్లయింగ్ సిమ్యులేటర్‌గా మార్చాడు. తాను విభిన్నంగా రూపొందించిన లిల్లీ ఎయిర్వేస్ (రెస్టారెంట్)లో డిన్నర్ ఖరీదు ఒక్కొక్కరికీ 30 నుంచి 40 డాలర్లు. అలాగే కాక్‌పిట్ సిమ్యులేటర్ వినియోగించాలనుకునే ఔత్సాహికులు 45 నుంచి 60 డాలర్లు చెల్లించాల్సి ఉంటుందట!

ఈ విమానాన్ని రెస్టారెంట్‌గా మార్చడానికి లీ చాలా ఖర్చు చేశాడు. చెఫ్‌నూ విదేశాల నుంచి తీసుకురావడంతో కిచెన్ ఏర్పాటుకూ పెద్ద మొత్తాన్నే ఖర్చుచేశాడు. ఈ విమానంలో 128 మంది ప్రయాణీకులు ప్రయాణించడానికి వీలుండేది. ప్రస్తుతం ఇందులో 70 మంది అతిథులు ఒకేసారి భోజనం చేయడానికి వీలుగా వసతులు కల్పించారు. కొద్దికాలం క్రితం లీ స్వీడన్‌లో రెస్టారెంట్‌గా మారిన విమానాన్ని చూసి.. చైనాలోనూ అలాంటి ప్రయోగం చేశాడట! రెస్టారెంట్ థీమ్ విమాన నేపథ్యం కనుక అందులో పనిచేసే వెయిటర్స్‌నూ ఎయిర్‌లైన్స్ ప్రమాణాల ప్రకారమే ఎంపిక చేశారట! ఇందులో పనిచేసే వెయిటర్స్ పురుషులైతే 5 అడుగుల ఏడంగుళాలు, ఆడవాళ్లు ఐదడగుల నాలుగంగుళాల పొడవు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వీరందరినీ ప్రత్యేక శిక్షణ ద్వారా ఎంపిక చేశారు. వెయిటర్లు, వెయిట్రిసెస్ అనుభవాన్ని నిర్ధారించడానికి వీలుగా వారికి ప్రత్యేక డ్రెస్‌కోడ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేస్తున్న చెఫ్‌లలో ప్రపంచవ్యాప్త ఆహారపదార్థాల తయారీలో అనుభవం ఉన్నవారేనని లీ చెబుతారు.



ఈ విమాన రెస్టారెంట్‌కి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో కస్టమర్లు వస్తున్నారట! ఫ్యామిలీ, సింగిల్ వేర్వేరుగా భోజనం చేయడానికి వీలుగా విమానం లోపలి భాగాన్ని విభజించారు. మొత్తం ఈయన ప్రయోగం ఫలించి, రెస్టారెంట్ బ్రహ్మాండంగా నడుస్తున్నప్పటికీ.. విమానం కొన్న ఖరీదు మాత్రం ఇంకా తిరిగి రాలేదట పాపం..! ★

సెన్సెక్స్ ↓ 407
34,005

నిఫ్టీ ↓ 122
10,454

రూపాయి ↓ 13 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.39



యమహా కొత్త 'వైజడ్‌ఎఫ్‌-ఆర్‌3'..

ఇండియా యమహా మోటార్ స్పోర్ట్స్ బైకు సెగ్మెంట్‌లో కొత్త వైజడ్‌ఎఫ్‌-ఆర్‌3ని ఆవిష్కరించింది. ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద దీని ధర రూ.3.48 లక్షలుగా నిర్ణయించింది. శుక్రవారం ఆటో ఎక్స్‌పోలో ఆ కంపెనీ ప్రచారకర్త జాన్ అబ్రహం దీన్ని విడుదల చేశారు.

విస్తృతావకాశాలు..

అహారోత్పత్తుల ప్రాసెసింగ్ రంగంలో విస్తృతావకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేష్ ప్రభు అన్నారు. ఫిక్కీ నిర్వహించిన 'ఫుడ్ వాల్డ్ ఇండియా గ్లోబల్ కన్వెన్షన్'లో మంత్రి మాట్లాడుతూ ఈ రంగం ఎగుమతులు, ఉపాధి కల్పనకు దోహదం చేయనుందన్నారు.



ఇ-ప్రగతికి 'పెగా' సాఫ్ట్‌వేర్

మార్చి కల్లా ప్రభుత్వ పోర్టల్ రెడీ



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తేనున్న ఇ-ప్రగతి పోర్టల్ రూపకల్పనను పెగా సిస్టమ్స్ దక్కించుకుంది. ఇది ప్రభుత్వ నూతన కేంద్రీకృత సేవల పోర్టల్. ఇందులో 33 శాఖలను ఒక వేదికపైకి తీసుకురానున్నారు. దీని ద్వారా దాదాపుగా అన్ని రకాల ప్రభుత్వ సేవలను అన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని పెగా సిస్టమ్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుమన్ రెడ్డి తెలిపారు. 315 ఎజెన్సీలు, 745 పౌర సేవలకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సన్‌రైజ్ ఎపి 2022 మిషనలో భాగంగా పౌరుల జీవన ప్రమాణాలను వృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఇ-ప్రగతి ప్రాజెక్టును ఎంచుకుందన్నారు. తాము ఈ ప్రాజెక్టును వచ్చే మార్చి 31 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. కాగా జూన్ నుంచి పూర్తిగా నిర్వహణలోకి రావొచ్చన్నారు. అమెరికా కేంద్రంగా పని చేస్తోన్న పెగా సిస్టమ్స్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం ద్వారా తొలిసారి భారత్‌లో అమ్మకాలు ప్రారంభించినట్లయ్యింది. అదే విధంగా దేశంలో మరింత విస్తరించడానికి ముంబయిలో సేల్స్ సపోర్ట్ ఆఫీసును ప్రారంభించామని సుమన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్, బెంగళూరులోని 1500 మంది పైగా ఉద్యోగులు కేవలం ఇంజనీరింగ్, ఉత్పత్తి అభివృద్ధి కార్యకలాపాలపైనే పని చేస్తున్నారన్నారు. ఇంతక్రితం ఏడాది 1067 మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. అవకాశాలను బట్టి భవిష్యత్తులో మానవ వనరుల సంఖ్యను పెంచుకుంటామని తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ 'కూల్' ఆఫర్



న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కోలకు ధీటుగా ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్ మరో ఆకర్షణీయ ఆఫర్‌ను ప్రకటించింది. బిఎస్ఎన్ఎల్ కూల్ పేరుతో రూ.1,099 ప్లాన్‌లో 84 రోజుల పాటు అపరిమిత డేటా, అపరిమిత వాయిస్ కాలింగ్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. నెట్ వేగంపై ఎలాంటి పరిమితి లేకుండా తమ ప్రీపెయిడ్ ఖాతాదారుల కోసం ప్రత్యేకంగా దీన్ని ఆవిష్కరించామని పేర్కొంది. రోమింగ్‌లోనూ ఈ కాల్స్ సదుపాయం ఉంది. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను ఉచితంగా అందిస్తుంది. బిఎస్ఎన్ఎల్ ఉచితంగా ఆఫర్ చేసే ఈ స్పెషల్ సర్వీసు ద్వారా డిఫాల్ట్ రింగ్‌నే కాకుండా యూజర్లు తమకు ఇష్టమైన ట్యూన్‌ను ఎంచుకోవచ్చు. ఈ ఆఫర్‌తో జియో లాంటి ప్రయివేటు టెల్కోలకు భారీ పోటీని ఇవ్వొచ్చని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రపంచ మార్కెట్లలో సంక్షోభం

- కుప్పకూలిన వాల్‌స్ట్రీట్ సూచీలు
- మళ్లీ 'బేర్'మన్న సెన్సెక్స్
- 407 పాయింట్లు ఫట్
- మదుపరి విలవిల
- బ్యాంకింగ్ షేర్ల బెంబేలు

ముంబయి : ప్రపంచ స్టాక్ మార్కెట్లలో సంక్షోభ చాయలు కొట్టాస్తున్నాయి. అమెరికాలో వర్షం పడితే ప్రపంచ దేశాలకు జలుబు చేసినట్లు పరిస్థితి తయారయ్యింది. వాల్‌స్ట్రీట్ మార్కెట్లు మరోమారు కుప్పకూలడంతో శుక్రవారం ఇతర దేశాల సూచీలపై తీవ్ర ప్రభావం పడింది. ఇదే క్రమంలో భారత మార్కెట్లు మళ్లీ ఢమాల్ అన్నాయి. మదుపర్ల అమ్మకాల ఒత్తిడితో వారాంతంలో బిఎస్ఇ సెన్సెక్స్ ఏకంగా 407 పాయింట్లు పతనమై 34,005కు దిగజారింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 550 పాయింట్ల మేర కోల్పోయింది. ఈ దశలో కొన్ని సెకన్లలోనే మదుపరి సంపద మరో రూ.2.24 లక్షల కోట్లు గాల్లో కలిసిపోయింది. సెన్సెక్స్ ఇంట్రా ట్రేడింగ్‌లో 34,070-33,849 మధ్య కదలాడింది. నిఫ్టీ సూచీ 121 పాయింట్లు పడిపోయి 10,454 వద్ద ముగిసింది. వరుసగా ఏడు రోజుల నష్టాల తర్వాత గురువారం నాడు స్వల్ప ఉపశమనం లభించిందని భావించిన మదుపర్లు తిరిగి వారాంతంలో మళ్లీ షాక్‌ను ఎదుర్కొన్నారు.



డోజోన్స్‌లో ముసలం..

అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగనుందన్న అంచనాలు, ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు నేపథ్యంలో మదుపర్లు అక్కడి మార్కెట్ల నుంచి ఈక్విటీలను భారీగా ఉపసంహరించుకున్నారు. దీంతో గురువారం డోజోన్స్ ఏకంగా 4.15 శాతం లేదా 1033 పాయింట్లు కుప్పకూలింది. ఎస్అండ్‌పి 101 పాయింట్లు లేదా 3.75 శాతం, అదే విధంగా నాస్‌డాక్ 275 పాయింట్లు లేదా 4 శాతం చొప్పున పతనమైమయ్యాయి. గ్లోబల్ మార్కెట్ల పతనం ఇన్వెస్టర్లను దడదడలాడిస్తోంది. చిన్న చితకా ఇన్వెస్టర్ల నుంచి బడా ఇన్వెస్టర్ల వరకూ అందరూ ఈ తాటిని తట్టుకోలేక, భారీ మొత్తంలో సొమ్మును పోగొట్టుకుంటున్నారు. యూరప్ మార్కెట్లు 2 శాతం మేర నష్టపోయాయి. ఈ దెబ్బతో ఆసియన్ మార్కెట్లు రెండు నెలల కనిష్టాన్ని చవి చూశాయి. షాంఘై సూచీ 6 శాతం విలువ కోల్పోయింది. జపాన్ నిక్కీ 2.3 శాతం పడిపోయింది.

రంగాల వారిగా..

మదుపర్ల అమ్మకాల ఒత్తిడితో బిఎస్ఇలోని దాదాపుగా అన్ని సూచీలు నష్టాలు చవి చూశాయి. బ్యాంకింగ్ సూచీ 1.75 శాతం, టెలికం 1.15 శాతం, ఆటో 0.95 శాతం, టెక్ 0.90 శాతం, ఐటి 0.77 శాతం చొప్పున పతనమయ్యాయి. కాగా లోహ, రియాల్టీ సూచీలు మాత్రం 1.25 శాతం, 0.56 శాతం చొప్పున పెరిగాయి.

బ్యాంకింగ్ షేర్ల కుదేలు..

ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకుల సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. యస్ బ్యాంకు 9.90 శాతం, ఎస్‌బిఐ 6 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 6.35 శాతం, యాక్సిస్ బ్యాంకు 10.40 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 28.95 శాతం, కొటాక్ బ్యాంకు 15.75 శాతం, ఇండుస్ఇండ్ బ్యాంకు 19.85 శాతం, పిఎన్‌బి 2.45 శాతం చొప్పున నష్టపోయాయి. ఇతర సూచీల్లో అధికంగా విప్రో 1.76 శాతం, హీరో మోటో కార్ప్ 1.46 శాతం, టాటా మోటార్స్ 1.24 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.21 శాతం, ఎల్అండ్‌టి 1.17 శాతం చొప్పున నష్టాలు చవి చూశాయి.

ఎస్‌బిఐకి మొండి బాకీల గండి

- క్యూ3 నష్టాలు రూ.2,416 కోట్లు
- స్థూల ఎన్‌పిఎలు రూ.2 లక్షల కోట్లు

ముంబయి : ప్రభుత్వ విధానాల వల్ల మొండి బాకీలు పెరిగి బ్యాంకింగ్ రంగం బలహీనమవుతోంది. దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) 2017-18 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఏకంగా రూ.2,416.37 కోట్ల నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2,610 కోట్ల నికర లాభాలు సాధించింది. కాగా గత త్రైమాసికంలో ఎస్‌బిఐ మొండి బాకీల కేటాయింపులు 111 శాతం పెరిగి రూ.18,876.21 కోట్లకు చేరాయి. ఇంతక్రితం క్యూ3లో ఈ కేటాయింపులు రూ.8,942.83 కోట్లుగా ఉన్నాయి. గత సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ2) ముగింపు నాటికి రూ.1.86 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంకు స్థూల మొండి బాకీలు క్యూ3 ముగింపు నాటికి 1.99 లక్షల కోట్లకు ఎగిశాయి. ఇదే సమయంలో బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు 10.35 శాతానికి, నికర నిరర్ధక ఆస్తులు 5.61 శాతానికి చేరాయి. 2017 సెప్టెంబర్ ముగింపు నాటికి జిఎన్‌పిఎ 9.83 శాతం, నికర ఎన్‌పిఎ 5.43 శాతంగా ఉంది. బాండ్ల వల్ల తమకు నష్టాలు వచ్చాయని ఎస్‌బిఐ ఛైర్మెన్ రజ్నిష్ కుమార్ అన్నారు. గత త్రైమాసికంలో బ్యాంకు నికర వడ్డీపై ఆదాయం 26.88 శాతం పెరిగి రూ.18,687.57 కోట్లకు చేరిందన్నారు.

రూ.500 కోట్లు కాజేసిన సింగ్ బ్రదర్స్..!

న్యూఢిల్లీ : రాన్‌బ్యాక్సీ మాజీ ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివేందర్ సింగ్ ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో దాదాపు రూ.500 కోట్లు (78 మిలియన్ డాలర్లు) కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దైచీ శాంక్యో పీటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పు నేపథ్యంలో తమ ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివేందర్ సింగ్ డైరెక్టర్ల బోర్డును వీడారని ఫోర్టిస్ హెల్త్‌కేర్ తాజాగా వెల్లడించింది. ఈ అంశంపై చర్చించేందుకు ఈ నెల 13న బోర్డు సమావేశం కానున్నట్లు ఫోర్టిస్ పేర్కొంది. మల్వీందర్ సింగ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవికి, శివేందర్ సింగ్ వైస్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారని వెల్లడించింది. ఒక సంవత్సరం క్రితం బోర్డు ఆమోదం లేకుండా వీరు ఇరువురు రూ .500 కోట్లు తీసుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

పడిపోయిన రూపాయి..



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌కు డిమాండ్ పెరగడంతో రూపాయి విలువ రెండు మాసాల కనిష్ట స్థాయికి దిగజారింది. బ్యాంకర్లు, దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడం, దేశీయ మార్కెట్ల వరుస పతనం నేపథ్యంలో శుక్రవారం రూపాయి విలువ 14 పైసలు పతనమై 64.39కు దిగజారింది. ఉదయం 64.42 వద్ద మొదలైన సూచీ 64.26 వద్ద గతేడాది డిసెంబర్ 13న రూపాయి విలువ ఈ స్థాయిలో చోటు చేసుకుంది. వరుసగా రెండో వారంలోనూ రూపాయి విలువ కోల్పోయినట్లయ్యింది. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు నేపథ్యంలో డాలర్‌కు విలువ పెరగడం కూడా రూపాయిపై ఒత్తిడిని పెంచింది.

టెట్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఆర్థిక వ్యవస్థలో ప్రధానంగా ఎన్ని రంగాలున్నాయి?

విజేత



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

1. మొట్టమొదటి పారిశ్రామిక విప్లవం ఏ దేశంలో సంభవించింది ?
ఎ. ఫ్రాన్స్ బి. బ్రిటన్
సి. రష్యా డి. అమెరికా

2. కుడంకుళం అణువిద్యుత్ కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం ఏ రాష్ట్రానికి సంబంధించింది ?
ఎ. కేరళ బి. కర్నాటక
సి. మహారాష్ట్ర డి. తమిళనాడు

3. ఒక దేశ మొత్తం ఆదాయాన్ని ఆదేశ జనాభాతో భాగిస్తే వచ్చేది ?
ఎ. జాతీయ ఆదాయం బి. సగటు ఉత్పత్తి
సి. తలసరి ఆదాయం డి. పైవేవీ కావు

4. అక్షరాస్యత దేనిని తెలియజేస్తుంది ?
ఎ. ఏడు సంవత్సరాలు నిండిన వారిలో అక్షరాస్యతను
బి. ఏడు సంవత్సరాలలోపు పిల్లల అక్షరాస్యతను
సి. ప్రజలు చదవగలిగే స్థాయిని
డి. ప్రజల రాయగలిగే స్థాయిని

5. హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో శిశు మరణాలు తక్కువగా ఉండడానికి గల కారణం ?
ఎ. మౌలిక ఆరోగ్య సదుపాయాలు, విద్యా సౌకర్యాలు లేకపోవడం
బి. ఆదాయ వనరులు చాలా అందుబాటులో ఉండడం
సి. ప్రభుత్వ సహకారంలో శిశువులను బతికించడం
డి. మౌలిక ఆరోగ్య సదుపాయాలు, విద్యా సౌకర్యాలు తగినంతగా ఉండడం

6. హెచ్‌డిఐ (మానవాభివృద్ధి సూచి)ని ప్రచురించే సంస్థ ?
ఎ. ఐఎంఎఫ్ బి. ఐబిఆర్‌డి
సి. యుఎన్‌డిపి డి. యునిసెఫ్

7. 2013 ప్రకారం మానవాభివృద్ధి సూచీలో భారతదేశ స్థానం?
ఎ. 96 బి. 136 సి. 146 డి. 112

8. ఆర్థిక వ్యవస్థలో ప్రధానంగా ఎన్నిరంగాలున్నాయి ?
ఎ. మూడు బి. నాలుగు
సి. చాలా రంగాలున్నాయి డి. రెండు

9. మతబోధకులు/ పూజారులు ఏ ప్రధాన రంగంలో భాగంగా ఉన్నారు?
ఎ. వ్యవసాయ బి. పారిశ్రామిక
సి. సేవా రంగం డి. ప్రాథమిక రంగం

10. ఒక నోట్ పుస్తకం తయారు చేయడానికి మధ్యదశ ఉత్పాదకాలు ఏవి ?
ఎ. పేపరుగుజ్జు బి. కలప
సి. రసాయనాలు డి. పైవన్నీ

11. 1972-73 నుంచి 2009-10 మధ్య కాలంలో స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం యొక్క వాటా ఎంత శాతం నుంచి ఎంత శాతానికి తగ్గింది?
ఎ. 13 శాతం నుంచి 12 శాతం
బి. 17 శాతం నుంచి 15 శాతం
సి. 27 శాతం నుంచి 22 శాతం
డి. 43 శాతం నుంచి 17 శాతం

12. 2010 నాటికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలతో మొత్తం కార్మికుల శాతం వరుసగా
ఎ. 53, 20, 22 శాతం
బి. 53, 22, 25 శాతం
సి. 53, 22, 30 శాతం
డి. 53, 27, 20 శాతం

13. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల వాటా శాతంలో ?
ఎ. 50 : 50 బి. 40 : 60
సి. 60 : 40 డి. 20 : 80

14. రక్షణతో కూడిన ఉపాధి సౌకర్యాలుగల కార్మికుడు ఏ రంగంలో భాగం?
ఎ. వ్యవస్థీకృత బి. అవ్యవస్థీకృత
సి. వ్యవసాయ డి. పారిశ్రామిక

15. ఎక్కువగా సహజ ప్రక్రియలను ఉపయోగించుకుని ఏ రంగంలో వస్తువులు ఉత్పత్తి చేస్తారు ?
ఎ. ద్వితీయ బి. తృతీయ
సి. ప్రాథమిక డి. అన్ని రంగాలలో

16. అవ్యవస్థీకృత రంగ కార్మికులకు ఉదాహరణ కాని వారు ఎవరు?
ఎ. వ్యవసాయకూలి బి. ఆటో డ్రైవర్
సి. ట్యూషన్ మాస్టర్ డి. ప్రభుత్వ వైద్యుడు

17. పనిచేసే వయస్సు గలవారు అనగా ఏ వయసువారు?
ఎ. 6-14 సంవత్సరాలు
బి. 15-20 సంవత్సరాలు
సి. 15-18 సంవత్సరాలు
డి. 15-59 సంవత్సరాలు

18. జనాభా అంశాలు మారుతూ ఉండడానికి గల కారణం, ఏవి మారడం?
ఎ. జననాలు బి. మరణాలు
సి. వలసలు డి. పైవన్నీ

19. మానవులు సుమారు ఎన్ని సంవత్సరాల పాటు సేకరణ-వేటగాళ్లుగా గుంపులలో జీవించారు?
ఎ. ఒక లక్ష సంవత్సరాలు
బి. రెండు లక్షల సంవత్సరాలు
సి. 50 వేల సంవత్సరాలు
డి. ఏవీకావు

20. మధ్యప్రదేశ్‌లోని ఏ ప్రాంతపు రాతి గుహలలో ఆదిమానవుని ఆనవాళ్లు కనిపిస్తాయి ?
ఎ. భీంబేడ్కాలో బి. బొర్రా
సి. ముదురేరు డి. బేలూరు

21. జుగ్గి జోప్డి ప్రాంతాలు అనగా ఏవి ?
ఎ. చట్టబద్ధమైన ప్రాంతాలు
బి. భవనాలు, జనాభా అధికంగావున్న ప్రాంతాలు
సి. చట్టబద్ధమైన నివాసాలుగా గుర్తించబడని గుడిసెలు
డి. చిన్న నగరాలు

22. నివాస ప్రాంతాలు మారిన ప్రదేశాల గురించి తెలుసుకోడానికి ఏఏ విషయాలు పరిశీలన అవసరం ?
ఎ. ప్రదేశం
బి. పరిస్థితి
సి. ప్రదేశం యొక్క చరిత్ర
డి. పైవన్నీ

23. మహానగరాలు అనగా?
ఎ. పదిలక్షలు - కోటి మధ్య జనాభా
బి. కోటి జనాభాకి మించి
సి. నిర్థిష్ట సరిహద్దు గలవి
డి. ఒక కిక్కిరిసిన పట్టణం

24. పెద్ద పెద్ద నివాస ప్రాంతాలు విమానాశ్రయాల చుట్టూ ఏర్పడతూ ఉంటే అవి?
ఎ. ఎయిర్ పోర్ట్స్ బి. ఎరోనాటిక్స్
సి. ఏరోట్రోపాలిస్ డి. ఎయిర్ క్రాఫ్ట్

25. మహారాష్ట్రలోని చేపల ప్రాసెసింగ్ కర్మాగారాలలో పనిచేయడానికి ఏటా కేరళ నుంచి ఎంత మంది మహిళలు వలస వెళ్తున్నారు?
ఎ. ఐదు లక్షల మంది బి. 50,000 మంది
సి. ఒక లక్ష మంది డి. పది లక్షల మంది

26. మొత్తం జనాభాలో ఎంత శాతం ఎస్టీలు వలస (కాలానుగుణ) కార్మికులుగా ఉన్నారు?
ఎ. 23 శాతం బి. 19 శాతం
సి. 40 శాతం డి. 18 శాతం

27. భారత దేశం నుంచి పశ్చిమాసియాకు వెళ్తున్న 30 లక్షల వలస వ్యక్తులలో ఎక్కువ మంది ఏ దేశానికి వెళ్తున్నారు?
ఎ. సౌదీ అరేబియాకి బి. ఆస్ట్రేలియాకి
సి. రష్యాకి డి. అమెరికాకు



28. పశ్చిమాసియాకి వలస వెళ్తున్న కార్మికులలో అత్యధిక శాతం మంది ఎవరు?
ఎ. తమిళులు బి. కేరళా వాసులు
సి. ఆంధ్రప్రదేశ్ వాసులు డి. ఏదీకాదు

29. ఒకే విస్తీర్ణంలో సంవత్సరంలో ఒకటికంటే ఎక్కువ పంటలను సాగుచేయడాన్ని ఏమంటారు?
ఎ. బహుళ పంటలసాగు
బి. సాంద్రవ్యవసాయం
సి. పోడు వ్యవసాయం
డి. స్థిర వ్యవసాయం

30. రెండు హెక్టార్లకన్నా తక్కువ భూమి కలిగిన చిన్నరైతులు ఎంత శాతం భూమిని సాగుచేస్తున్నారు?
ఎ. 87 శాతం బి. 13 శాతం
సి. 48 శాతం డి. 52 శాతం

31. రెండు హెక్టార్లు కన్నా ఎక్కువ భూమి కలిగిన మధ్యతరగతి, పెద్ద రైతులు ఎంత శాతం మంది ఉన్నారు?
ఎ. 13 శాతం బి. 52 శాతం
సి. 90 శాతం డి. 20 శాతం

32. ఫోర్డ్ మోటార్స్ అనే కార్ల కంపెనీ ఏ దేశానికి చెందినది?
ఎ. అమెరికా బి. జపాన్
సి. రష్యా డి. జర్మనీ

33. చాలా తక్కువ పరిమితులతో అనుసరించే ప్రభుత్వ విధానం ?
ఎ. ప్రపంచీకరణ విధానం
బి. సరళీకృత విధానం
సి. ప్రయివేటు విధానం
డి. జాతియీకరణ విధానం

34. వినియోగదారులు, పట్టణ సంపన్నులపై ప్రపంచీకరణ?
ఎ. చెడు ప్రభావం చూపింది
బి. అనుకూల ప్రభావం చూపింది
సి. ఎటువంటి ప్రభావం చూపలేదు
డి. పైవేవీకావు

35. డబ్ల్యూటిఓ అనేది ?
ఎ. ఒక అంతర్జాతీయ వ్యాపార సంస్థ
బి. జాతీయ వ్యాపార సంస్థ
సి. ఒక అంతర్జాతీయ రవాణ సంస్థ
డి. అంతర్జాతీయ విద్యుత్ సంస్థ

36. టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, రాన్‌బాక్సీ, ఏషియాన్ పెయింట్స్ అనేవి ?
ఎ. ఎంఎన్‌సిలు బి. విదేశీ కంపెనీలు
సి. ఏకజాతి కంపెనీలు డి. సాఫ్ట్‌వేర్ సంస్థలు

సమాధానాలు : 1.బి, 2.డి, 3.సి, 4.ఎ, 5.డి, 6.సి, 7.బి, 8.ఎ, 9.సి, 10.డి, 11.డి, 12.బి, 13.ఎ, 14.సి, 15.సి, 16.డి, 17.డి, 18.డి, 19.బి, 20.ఎ, 21.సి, 22.డి, 23.బి, 24.సి, 25.బి, 26.ఎ, 27.ఎ, 28.బి, 29.ఎ, 30.సి, 31.ఎ, 32.ఎ, 33.బి, 34.బి, 35.ఎ, 36.ఎ. ★

ఉద్యోగాలు

ఏఎస్ఆర్‌బీ'అగ్రికల్చర్ సైంటిస్ట్' పోస్టులకు నోటిఫికేషన్

అగ్రికల్చర్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఏఎస్ఆర్‌బీ). 195 అగ్రికల్చర్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్) ఎగ్జామినేషన్-2017 (ప్రిలిమినరీ), వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో లెక్చరర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)(1)-2018 నోటిఫికేషన్లను సంయుక్త ప్రకటన విడుదల చేసింది.
అర్హతలు : సంబంధిత అగ్రికల్చర్ విభాగంలో మాస్టర్ డిగ్రీ/తత్సమాన విద్యలో ఉత్తీర్ణులు వీటికి అర్హులు.
వయసు : 2018, జనవరి 1 నాటికి ఏఆర్ఎస్-2017 (ప్రిలిమినరీ)కి 21-32 ఏళ్ల లోపు ఉండాలి. నెట్(1)-2018కు కనీస వయసు 21 ఏళ్లు ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో
దరఖాస్తు చివరి తేదీ : మార్చి 2, 2018.
వెబ్‌సైట్ : www.asrb.org.in

నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 256 ఖాళీలు

హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) లిమిటెడ్. పలు విభాగాల్లోని 256 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ వేర్వేరు ప్రకటనలు చేసింది.
పోస్టు-ఖాళీలు : జూనియర్ మేనేజర్ (జేఎం)-32 (మైనింగ్-8 + సర్వే-3+జీ అండ్ క్యూసీ-13+సీ అండ్ ఐటీ-7 +ఇన్‌స్ట్రుమెంటేషన్-1), డిప్యూటీ జూనియర్ మేనేజర్ (డీవైజేఎం)-1 (జియో ఫిజిసిస్ట్), జూనియర్ ఆఫీసర్ ట్రైనీ (జేఓటీ)-54 (మెకానికల్-13+ ఎలక్ట్రికల్-8+మైనింగ్-29 +జీ అండ్ క్యూసీ-4, మెయింటెనెన్స్ అసిస్టెంట్ ట్రైనీ (ఎంఏటీ)-154 (మెకానికల్-114+ఎలక్ట్రికల్-40), హెచ్ఈఎం (మెకానికల్) గ్రేడ్ (3) ట్రైనీ-4, ఎలక్ట్రీషియన్ గ్రేడ్ (3) ట్రైనీ-4, హెచ్ఈఎం ఆపరేటర్ గ్రేడ్ (3) ట్రైనీ-2, క్యూసీఏ గ్రేడ్ (3) ట్రైనీ-5.
అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఐటీఐ/డిప్లొమా/బీఈ/బీటెక్/ఎంఎస్సీ/ఎంఎస్సీ(టెక్)/ఎంటెక్/ఎంసీఏ/బీఎస్సీ. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం, సంబంధిత రంగంలోని ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
వయసు : డీవైజేఎం, జేఎం పోస్టులకు 45 ఏళ్లు, జేఓటీకి 35 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : పోస్టులను బట్టి రాతపరీక్ష + గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ/ ట్రేడ్ టెస్ట్/ జాబ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్.
దరఖాస్తు ఫీజు : జేఎం, డీవైజేఎం పోస్టులకు రూ.500, జేఓటీకి రూ.300, మిగిలిన పోస్టులకు రూ.150. రిజర్వేషన్ కేటగిరీలకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : డీవైజేఎం, జేఎం, జేఓటీ పోస్టులకు ఆన్‌లైన్, మిగిలిన పోస్టులకు ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. ఆన్‌లైన్ **దరఖాస్తుకు చివరి తేదీ:** జేఎం, డీవైజేఎం, జేఓటీ పోస్టులకు ఫిబ్రవరి 12, 2018, మిగిలిన పోస్టులకు ఫిబ్రవరి 17, 2018.
ఆఫ్‌లైన్ దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 19, 2018.
వెబ్‌సైట్ : www.nmdc.co.in

పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- భీమునిపట్నం, విశాఖ

విశాఖ జిల్లా భీమునిపట్నంలోని ఎర్రమట్టి దిబ్బల వద్ద పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ. 2 కోట్లతో చేపట్టనున్న బీచ్ పార్కు నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సహజ సిద్ధమైన అందాలను సంతరించు కున్న భీమిలిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. పర్యాటకులకు, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా రెస్టారెంట్లు, బెంచీలు, గొడుగులు తదితరాలు నిర్మించనున్నట్లు తెలిపారు.



శంకుస్థాపన విశాఖ జిల్లా భీమునిపట్నంలో శుక్రవారం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించరా?

సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిజిహెచ్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి డిమాండ్ చేశారు. కాకినాడ జిజిహెచ్‌లోని మాతా శిశువిభాగం వద్ద కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలను అమలు చేయించాల్సిన అధికారులు కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పక్కదోవ పట్టించేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. 2017 జులై 31తో పాత కాంట్రాక్టు ముగిసిందన్నారు. ఈ విషయాన్ని సిఐటియు ముందుగానే సంబంధింత అధికారుల దృష్టికి తీసుకెళ్లింద న్నారు. జిజిహెచ్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులు అందరికంటే మెరుగైన ఆహారం తీసుకోవాల్సి ఉందన్నారు. అందుకు తగ్గట్టుగా వారికి వేతనాలు పెంచాలన్నారు. జిజిహెచ్‌లో కాంట్రాక్టు మారినప్పుడల్లా వేతనాల సాధన కోసం పోరాడాల్సి వస్తోందన్నారు. ప్రతినెలా 5వ తేదీలోపు జీతం చెల్లించాలనే ఒప్పందం ఏనాడూ అమలు కాలేదన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నూతన వేతనాలు, బకాయి జీతాలపై ఎ1 కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సిఎస్ఆర్ఎం డాక్టర్ జిఎస్ఎన్.మూర్తి చర్చలు నిర్వహించారు. ప్రస్తుతం కార్మికులకు రూ.7,300 వేతనం ఇస్తున్నారని, రూ.8,500 చెల్లించాలని సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ అజయ్‌కుమార్, నాయకులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, ఏసూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీనికి కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు ఒప్పుకోకపోవడంతో చర్చలు శనివారం నాటికి వాయిదా పడ్డాయి. కార్మికుల సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

రూ.2.75కి అమ్మడమేంటి?.. 3.83కు కొనడమేంటి?

- ప్రజల సంపద లూటీ అవుతున్నా ఎపిఇఆర్‌సికి పట్టదా?
- విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమమే
- దళిత, గిరిజనుల నుంచి బలవంతపు వసూళ్లొద్దు
- ప్రజాభిప్రాయ సేకరణలో ఎపిఇఆర్‌సిని నిలదీత

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

రాష్ట్రంలో ఉన్న మిగులు విద్యుత్‌ను ఒక్కో యూనిట్ రూ.2.75కు విక్రయిస్తూ, హిందూజా సంస్థ నుంచి రూ.3.83 చొప్పున కొనుగోలు చేయడమేంటి?. ఇఆర్‌సి అనుమతి లేకపోయినా గ్రిడ్ వైఫల్య నివారణ అంటూ అధిక ధరలకు కొనడం వల్ల వందల కోట్లు నష్టం వస్తోంది. ప్రజల సంపద ఇలా లూటీ అవుతున్నా మీరు పట్టించుకోరా?' అంటూ ఎపి విద్యుత్ నియంత్రణా మండలి ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కందారపు మురళి నిలదీశారు. తిరుపతిలోని డిస్కం సమావేశ మందిరంలో విద్యుత్ నియంత్రణా మండలి(ఎపిఇఆర్‌సి) ఛైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్, సభ్యులు రఘు, రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణను శుక్రవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కందారపు మురళి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రెండు డిస్కంల (ఇపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్) రెవెన్యూ లోటు 7,982 కోట్లను ఎలా భర్తీ చేస్తారన్న విషయమై ప్రభుత్వం వెల్లడించడం లేదని, బహుశా 2019 ఎన్నికల తర్వాత ప్రజలపై ఈ భారాలను మోపేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందనే సందేహాన్ని వెలిబుచ్చారు. అలాంటి రాజకీయ ఎత్తుగడలు ఏవైనా ఉంటే తీవ్ర స్థాయిలో ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఓవైపు విద్యుత్‌కు అవసరమైన వనరులన్నీ అంతర్జాతీయ మార్కెట్లో రోజురోజుకూ తగ్గుతుంటే సామాన్యులకు మాత్రం చార్జీల మోత తగ్గడం లేదన్నారు. పిపిఎల ముసుగులో పెద్దపెద్ద కంపెనీలకు లాభాలు వచ్చేలా, సామాన్య ప్రజలపై భారాలు పడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను విస్తృత పరుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 25 ఏళ్ల దీర్ఘకాలిక ఒప్పందాలు వద్దంటూ, 5 నుంచి 12 ఏళ్ల స్వల్పకాలిక ఒప్పందాలు చేయడం ఎందుకంటూ ప్రశ్నించారు. మార్కెట్లో విద్యుత్ ధరలు పడిపోతుంటే ఇలాంటి ఒప్పందాలు ఎవరి ప్రయోజనాల కోసమంటూ నిలదీశారు. పిపిఎలపై పున్ణసమీక్షించాలని కోరారు. ఎపి వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ.. ఎస్‌సి, ఎస్‌టిలకు అపరిమిత యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఒకేఒక్క గిరిజన రైతు నుంచి 16వేలు బిల్లు కట్టించిన ఘటనను ఉదహరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఆదికేశవులురెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వానికి, విద్యుత్ అధికారులకు రైతుల గోడు పట్టడం లేదన్నారు. విద్యుత్ కనెక్షన్ల కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదన్నారు. నీరు పడక బోర్లను మార్పు చేయాలంటే అదనపు ఛార్జీలను వసూలు చేయడాన్ని ఆపాలన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం, నాయకులు జయచంద్ర, నారాయణబాబు, గంగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.



తిరుపతిలో జరిగిన విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్రకమిటి సభ్యులు కందారపు మురళి

ఆర్టీసిలో కండక్టర్లకు ట్రే బాక్సుల విధానం రద్దు : ఇయు హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసిలో కండక్టర్లకు అందించే టికెట్ ట్రే బాక్సుల విధానాన్ని రద్దు చేస్తూ ఆర్టీసి ఇడి జయరావు శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. ఆర్టీసిలో టికెట్ ఇష్యూయింగ్ మెషిన్ (టిమ్)లు వినియోగిస్తున్నప్పటీ మార్గమధ్యంలో టిమ్‌లు చెడిపోతే టికెట్లు ఇచ్చేందుకు వీలుగా పాత పద్ధతిలోనే ట్రే బాక్సులను అందిస్తున్నారు. కొత్త పద్ధతిలో టిమ్‌లు చెడిపోతే ప్రయాణికులకు టికెట్లకు బదులు రసీదులను అందించనున్నారు. ఈ నిర్ణయంపై ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) రాష్ట్ర నాయకులు కెవి రావు, కె పద్మాకర్, పలిశెట్టి దామోదరరావు, పి సుబ్రమణ్యంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ట్రే బాక్సుల్లోని టికెట్లలో ఒక్క టికెట్ పోయినా తనిఖీ అధికారులు కేసు రాసేవారని, ఇకపై కండక్టర్లకు ఆ బాధ తప్పనుందని తెలిపారు. ఒక్కో డిపోకి 20 టిమ్‌లను అదనంగా ఇస్తున్నారని, ఈ విధానం ఈ నెల 5 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. రైల్వేలో మాదిరి టికెట్ తీసుకునే పూర్తి బాధ్యత ప్రయాణికునిపైనే ఉంచాలని, తనిఖీ అధికారులు తప్పుడు కేసులు రాసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. తనిఖీ వ్యవస్థలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందని, ఈ సారి ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఈ డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, వేదికపై పశ్చిమ రాయలసీమ జిల్లాల ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తదితరులు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీల నేత వి.బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు క్షేత్రస్థాయిలో కృషి జరగాలని శాసనమండలిలో పిడిఎఫ్ పక్ష నేత వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. విజయవాడ గాంధీనగర్ ఐలాపురం హోటల్లో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంఈఓలతో శుక్రవారం సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు తగిన వాతావరణాన్ని ఉపాధ్యాయులు కలిగించాలని సూచించారు. విద్యతోపాటు ఆట పాటలపై ఆసక్తి కలిగేలా వారిని అన్నివిధాలుగా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. తరగతులు జరిగే సమయంలో కొంత మంది పిల్లలు బయట తిరుగుతూ కనిపించే పరిస్థితులపై ఎంఈఓలు దృష్టి సారించాలని సూచించారు. పశ్చిమ రాయలసీమ జిల్లాల ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. 2019 ఏడాది లక్ష్యం 1.56 లక్షల మంది విద్యార్థులను బడిలో చేర్పించాలని ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ను అధిగమించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందుగా గ్రామాల్లో విస్తృత ప్రచారం జరగాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ.. ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను తగ్గించే విధంగా సమిష్టి కృషి చేయాలన్నారు. ఉన్నత ప్రమాణాల వైపు అడుగులు వేసినప్పుడే అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేయగలరని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్, 13 జిల్లాల ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

నిధులివ్వకుండానే ఇచ్చినట్లు ప్రచారం : డొక్కా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులను ఇవ్వకుండానే ఇచ్చినట్లు బిజెపి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ విమర్శించారు. గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని నిర్మాణానికి రూ.42 వేల కోట్లు అవసరం కాగా ఇప్పటివరకూ రూ.1500 కోట్లు ఇచ్చారని, కొందరు నాయకులు రూ.3,500 కోట్లు ఇచ్చినట్లు చెప్పడం సరికాదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.7,300 కోట్లు ఖర్చు చేయగా కేంద్రం ఇచ్చింది రూ.4 వేల కోట్లేనని చెప్పారు. 11 జాతీయ విద్యా సంస్థలకు రూ.11 వేల కోట్లు అవసరం కాగా ఇప్పటివరకూ కేవలం రూ.450 కోట్లు ఇచ్చారని తెలిపారు. టిడిపి ఎంపిల పోరాటంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. పార్లమెంటులో వైసిపి ఎంపిల తీరును ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. కేంద్రమంత్రిగా ఉన్నా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సుజనాచౌదరి రాజ్యసభలో నిలదీస్తే ఆయనను వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి అడ్డుకోవడం దారుణమన్నారు.

13న దేశ వ్యాప్తంగా రైల్‌రోకోలు : డివైఎఫ్ఐ



విజయవాడలో వాల్‌పోస్టర్లను విడుదల చేసిన డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు, అధ్యక్షులు రామన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రవీణ్ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైల్వేలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల్లో 65 సంవత్సరాల లోపు ఉన్న వారిని రోజు వారీ వేతనానికి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 13న దేశవ్యాప్తంగా రైల్‌రోకోలు చేపట్టనున్నట్లు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు, అధ్యక్షులు జి రామన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు టి ప్రవీణ్ వెల్లడించారు. విజయవాడలోని ఎంబి విజ్ఞానకేంద్రంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి రైల్వే జోన్ ప్రకటించాలన్న డిమాండ్‌తో కూడా అన్ని రైల్వే స్టేషన్ల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. 2016 నాటికి రైల్వేలో 7.21 లక్షల పోస్టులు ఖాళీ అయ్యాయని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న మోడీ వాటిని భర్తీ చేయలేదని తెలిపారు. రైల్వేలో విశ్రాంతి ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కేంద్రం ఉత్తర్వులిచ్చిందని, మోడీ గద్దె దిగే వరకూ రైల్వేలో ఉద్యోగాలు రావన్నారు.

ఉద్యోగాలు ఇవ్వలేని స్థితిలోనే నిరుద్యోగులు పకోడీలు అమ్ముకోవాలని మోడీ, అమిత్ షా సెలవిచ్చారని, కొంత మందికైనా ఉద్యోగాలివ్వాలనే స్పృహ ప్రభుత్వానికి లేదని తెలిపారు. అధికారమిస్తే, ఉద్యోగాలి స్తానని, మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, యంగ్ ఇండియా వంటి అందమైన నినాదాలు ఇచ్చిన మోడీ యువతను భ్రమల్లో ముంచెత్తారని, అధికారం చేపట్టిన నాలుగేళ్లలో ఎనిమిది కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, అరకోటి ఉద్యోగాలను ప్రభుత్వం ఊడగొట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరిగి దిక్కుతోచని స్థితిలో యువత నలిగిపోతోందని, ఉద్యోగం రాదని, బతకలేమని నిరాశకు గురై యువత ఆత్మహత్యలకు పాల్పడుతోందని తెలిపారు. మోడీ ప్రభుత్వం చేసిన మోసంపై యువత ఐక్యంగా పోరాడి ఉద్యోగాలు సాధించాలని, రైల్వేను రక్షించుకోవడంతో పాటు రైల్వే జోన్ సాధించుకోవాలని అన్నారు. 13న చేపట్టనున్న నిరసనలో యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డివైఎఫ్ఐ పశ్చిమ కృష్ణా కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావు, నాయకులు ఎస్‌కె నిజాం, రాజశేఖర్ పాల్గొన్నారు.

మంగళగిరిలో చెప్పులషాపు ప్రారంభించిన మంత్రి

ప్రజాశక్తి-మంగళగిరి(గుంటూరు)

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన ప్రాఫిట్ షూ కంపెనీ బ్రాంచ్‌ను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతమైన మంగళగిరిలో చెప్పులు, బూట్ల విక్రయానికి అతిపెద్ద బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. దీన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి పుల్లారావును కంపెనీ ప్రతినిధులు సత్కరించారు. షూ కంపెనీలో మెన్స్ విభాగాన్ని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అన్ని కంపెనీల బ్రాండెడ్ ఫుట్‌వేర్‌లు, సరసమైన ధరలకు అందించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పోతినేని శ్రీనివారావు, జెవి.రాఘవులు, వి.సాయిప్రసాద్, గంజి. చిరంజీవి, జి.ధనుంజయరావు, ఎం.వెంకటమారుతీరావు, మన్నెం శ్రీనివాసరావు, కంపెనీ ప్రతినిధులు వి.పేరయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలవరం కార్మికుడిపై కాంట్రాక్టర్ దాడి

- ఆసుపత్రిలో చేరిన కార్మికుడు
- దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వేతన బకాయిలు చెల్లించాలని కోరిన కార్మికునిపై పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గాయపడిన బాధితుడిని ఇతర కార్మికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. దాడి చేసిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా బేలా గ్రామానికి చెందిన మనోజ్‌మారే కిషోర్‌కుమార్ నాలుగు నెలలుగా పోలవరం ప్రాజెక్టులో సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. కిషోర్‌తో పాటు మరో రెండు వేలమంది కార్మికులు పనిచేస్తున్నారు. సెంట్రింగ్ పనులు చేయించే కాంట్రాక్టర్ అరవింద్ వేతనాలు చెల్లించడం లేదు. సుమారు రూ.70 కోట్లపైనే కార్మికులకు జీతాలు బకాయిపడ్డాడు. ఈ నేపథ్యంలో కార్మికులు పని నిలిపేసి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కిషోర్‌కుమార్ ఒక మీడియాకు కాంట్రాక్టర్లు జీతాలు ఇవ్వకుండా వారిని పెట్టే ఇబ్బందుల గురించి వివరాలు తెలియజేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన కాంట్రాక్టర్ అరవింద్ మరో 10 మందితో కలిసి కిషోర్‌కుమార్‌పై కర్రలతో, బెల్ట్‌లతో విచక్షణరహితంగా దాడి చేశారు. ఈ దాడిలో కిషోర్‌కుమార్ స్పృహ కోల్పోయాడు. ఒక అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం తీసుకొచ్చి అక్కడ 108కు ఫోన్ చేశారు. ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నాడని తప్పుడు సమాచారంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.మూర్తి, సిఐటియు పట్టణ కార్యదర్శి కె.ఎస్.వి.రామచంద్రరావు ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులతో మాట్లాడారు. బాధితుడు స్పృహ వచ్చిన అనంతరం జరిగిన కాంట్రాక్టర్ దాష్టీకాన్ని నాయకులకు వివరించాడు. ప్రస్తుతం అతడు ఐసియు విభాగంలో చికిత్స పొందుతున్నాడు.

పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్న 200 మంది కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలివ్వకుండా ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ కార్మికులను వేధిస్తోందని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వాలని కోరిన వారిపై దాడి చేయడం అమానుషమన్నారు. సంస్థ ఉద్యోగులు కార్మికుడు కిషోర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడాన్ని ఆయన తప్పుబట్టారు. తక్షణం కిషోర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నాలుగు నెలల వేతనాలు తక్షణమే విడుదల చేయాలని, గాయపడిన కిషోర్‌కు మెరుగైన వైద్యసేవలందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం సంస్థను అదుపులో పెట్టాలన్నారు.

జీతాలు ఇవ్వకుండా అడిగిని వారిపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.మూర్తి అన్నారు.



రాజమహేంద్రవరం ఆసుపత్రిలో కార్మికుడితో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



మహిళా కౌలు రైతులకు చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు, కౌలు రైతుసంఘం నాయకులు

రైతులకు రుణాలు పంపిణీ

కౌలు రైతు సంఘం కృషే కారణమన్న నాగబోయిన

ప్రజాశక్తి-గంపలగూడెం (కృష్ణా)

కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను కౌలు రైతులకు రుణ పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. బుధ, గురువారాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు 50 మంది రైతుల్లో 10 మందికి రూ.4,50,000 చెక్కును అందజేశారు. మిగిలిన రైతులకూ త్వరలో రుణాలను మంజూరు చేస్తామని ఆంధ్రా బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ రుణాలను సాధించడంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం విజయవంతమైందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగబోయిన రంగారావు అన్నారు. మిగిలిన రైతులందరికీ రుణాలిచ్చేంత వరకూ తమ సంఘం అండగా నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుసంఘం అధ్యక్షులు గువ్వల సీతారామిరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చెరుకు వీరారెడ్డి, గుంటుపల్లి వీరభద్రం, నాయకులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, మల్లవరపు కుటుంబరావు, నాళ్లా చినసత్యంబాబు పాల్గొన్నారు.

దీక్షలు

దళితుల గురించి మాట్లాడలేని దళిత ప్రజాప్రతినిధులు

- మహిళల దీక్షల్లో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు)

దళిత ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నా దళితుల గురించి వారు మాట్లాడే స్థితిలో లేరని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. న్యాయ వ్యవస్థ, అధికారుల వ్యవస్థ దళితులకు న్యాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. దాడి ఘటనలో తమకు న్యాయం చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో దళిత మహిళలు చేపట్టిన దీక్షలను రమాదేవి శుక్రవారం సందర్శించారు.

దాడి జరిగి 40 రోజులవుతున్నా ప్రధాన నిందితులను అరెస్టు చేయలేదని, 307 సెక్షన్ కేసు కింద అరెస్టులకు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ఆదేశించినా చర్యలేమీ లేవని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ దళితుడే అయినా పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గి దళితులకు న్యాయం చేయలేదన్నారు. బాధితులకు న్యాయం చేకూరే వరకూ సిపిఎం పోరాడుతుందని ఉద్ఘాటించారు. గొట్టిపాడు దళితులతోపాటు రాష్ట్రంలోని దళితుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 23న నిర్వహించే చలో గుంటూరును దళిత, ప్రజా సంఘాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు యేసు, రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు యు.నాగేశ్వరరావు, సిపిఎం ప్రత్తిపాడు ప్రాతీయ కమిటీ కన్వీనర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ఒకే గొంతు వినిపించాలి : రామకృష్ణ

18న విజయవాడలో ప్రత్యేక హోదా సాధన సమితి సమావేశం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విభజన సమస్యలు పరిష్కారం కావాలంటే ఢిల్లీలోనూ, రాష్ట్రంలోనూ అన్ని రాజకీయ పార్టీలు ఒకే గొంతు వినిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఈనెల 8న బిజెపి తప్ప అన్ని పార్టీలూ బంద్‌లో పాల్గొన్నాయన్నారు. బిజెపి రాష్ట్ర నేతలు బంద్‌లు, ధర్నాలు కాకపోయినా ప్రధాని, అమిత్‌షాలపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. బిజెపి అధ్యక్షుడిగా కాకపోతే ఎంపిగానైనా హరిబాబు ఉద్యమంలోకి రావాలని కోరారు. అప్పుడే ప్రత్యేకహోదా, విభజన హామీలకు కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు. ఇప్పుడు వదిలేస్తే తర్వాత ఏమీ చేయలేమన్నారు. శుక్రవారం ఉదయం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 18న విజయవాడలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యాన రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. జనసేన తలపెట్టిన జెఎసిని కలుపుకుని పోరాడతామన్నారు. ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీ ఇస్తామన్న కేంద్రం మాటలను ఇంతకాలం నమ్మిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికి జ్ఞానోదయం కలిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అఖిలపక్ష భేటీని నిర్వహించాలన్నారు. పార్లమెంటులో ప్రధాని మోడీ చెత్త ప్రసంగం చేశారని విమర్శించారు. విభజన గాయాలను రేపడం, కాంగ్రెస్‌ను తిట్టిపోయడానికే పరిమితమయ్యారన్నారు. అరుణ్‌జైట్లీ సైతం స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి చెందిన అన్ని రాజకీయ పార్టీలూ వేర్వేరుగా పోరాడుతున్నాయన్నారు. అలా కాకుండా రాష్ట్రానికి చెందిన 25 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభసభ్యులు ప్రధానమంత్రి మోడీ ముందు నిరసన తెలపాలన్నారు. గాంధీబొమ్మ వద్ద ప్లకార్డులు పట్టుకుంటే సమస్యలకు పరిష్కారం దొరకదన్నారు. కేంద్రమంత్రి పదవుల నుంచి టిడిపి తప్పుకుంటే మంచిదేనన్నారు. ఒకరినొకరు విమర్శించుకోవడం మానేసి అందరూ కలిసి పోరాడితే ఫలితముంటుందన్నారు.

నాథూలా మార్గంలో మానససరోవర్ యాత్రకు చైనా అనుమతి

వెల్లడించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ : సిక్కింలోని నాథులా నుంచి కైలాస మానససరోవర్ యాత్రను పునః ప్రారంభించేందుకు చైనా అంగీకరించిందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లోక్‌సభలో వెల్లడించింది. భారత్‌-చైనాల మధ్య డోక్లామ్ వద్ద ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో 2017లో నాథులా మార్గం నుంచి మానససరోవర్ చేరుకునేందుకు పర్యాటకులను చైనా అనుమతించలేదు. లోక్‌సభలో సంబంధిత ప్రశ్నకు విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి వి.కె. సింగ్ లిఖిత పూర్వక సమాధానమిస్తూ నాథూలా మార్గంలో వాతావరణం అనుకూలంగా లేదని చైనా ప్రభుత్వం తెలిపిన తరువాత 2017లో ఆ మార్గంలో యాత్రికులను అనుమతించలేదన్నారు.



అనుమతి ।
నాథులా పాస్ ద్వారా మానస సరోవర్ యాత్రీకులను చైనా అనుమతించటంతో ఈ మార్గం ద్వారా యాత్ర తిరిగి పారంభం అవుతుంది.

సైనికాధికారుల 'మానవ హక్కుల ఉల్లంఘన'

నివేదిక కోరిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

న్యూఢిల్లీ: జమ్మూ కాశ్మీర్‌లో సైన్యం, సైనికాధికారులు మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరిపి నివేదిక అందచేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ రక్షణ మంత్రిత్వశాఖను కోరింది. సైనికాధికారుల పిల్లలు ముగ్గురు దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి ఈ మేరకు రక్షణశాఖకు లేఖ రాసింది. గత నెల 27న షోపియాన్‌లో జరిగిన ఘటనను ఈ ఫిర్యాదులో ప్రస్తావించారు. ఆ సమయంలో సైనిక వాహనాల కాన్వాయ్‌పై కొంతమంది వ్యక్తులు రాళ్ల రువ్వటంతో సైన్యం ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిగిందని, ఈ ఘటనలు ముగ్గురు పౌరులు మరణించారని వార్తలు వెలువడ్డాయి. ఈ ఘర్షణలో తమ సిబ్బంది ఏడుగురు గాయపడ్డారని, 11 వాహనాలు ధ్వంసమయ్యాయని సైన్యం ఒక ప్రకటనలో వివరించింది. ఈ ఘటనలో జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదీలు కోరినందున తాము దీనిపై నివేదిక కోరుతున్నామని ఎన్‌హెచ్‌ఆర్‌సి ఒక ప్రకటనలో వివరించింది. ఈ దాడులు, ప్రతిదాడులతో చిన్నారులు తీవ్ర కలవరపాటుకు గురయ్యారని ఎన్‌హెచ్‌ఆర్‌సి పేర్కొంది. దీనిపై నాలుగు వారాల్లో తమకు నివేదిక అందించాలని రక్షణశాఖ కార్యదర్శిని కమిషన్ కోరింది.

జోర్డాన్‌లో ప్రధాని

న్యూఢిల్లీ : పశ్యిమాసియాలోని మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రధాని ఈ రోజు జోర్డాన్ చేరుకున్నారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా తో ఆయన సమావేశమౌతారు. రేపు ఆయన సాలస్తీనాలో పర్యటిస్తారు. 2015 తర్వాత తాను పశ్చిమాసియాలో పర్యటించటం ఇది ఐదవసారని ఆయన గుర్తుచేశారు. పశ్చిమాసియా దేశాలలో 90 లక్షల మంది భారతీయులు పనిచేస్తున్నారని, ఒక్క యుఎఇలోనే 30 లక్షల మంది ఉన్నారని ఉయన చెప్పారు.

నెల రోజుల పాటు లోక్‌సభ వాయిదా

మార్చి 5న బడ్జెట్ సమావేశాలు పునఃప్రారంభం

న్యూఢిల్లీ : దాదాపు నెల రోజుల పాటు మార్చి 5 వరకు లోక్‌సభ వాయిదా పడింది. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రపప్రదేశ్ రాష్ట్రానికి మరింత సహాయం అందచేయాలని డిమాండ్‌చేస్తూ నిరంతరంఆందోళనకలు పాల్పడుతున్న నేపథ్యంలో లోక్ సభ వాయిదా పడింది. కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న ఎన్‌డిఎ భాగస్వామి అయిన టిడిపి, వైఎస్సార్ కాంగ్రెస్‌లు జీరో అవర్‌లో ఆందోళనలకు దిగారు. తొలుత కొద్ది సేపు మాత్రమే వాయిదా పడిన లోక్‌సభ వెంటనే ప్రశ్నోత్తరాల సమయంలో సమావేశమైంది. శుక్రవారం నాటి పత్రాలను లిస్టు చేసిన తరువాత స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను నెల రోజుల పాటు అంటే మార్చి 5 వరకు వాయిదా వేశారు. అంతేకాక బడ్జెట్ సమావేశాలలో తొలి అర్ధభాగ సమావేశాలు పూర్తయ్యాయి. టిడిపి, కాంగ్రెస్‌లకు చెందిన దాదాపు 15 మంది సభ్యులు వెల్‌లో ప్ల కార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. ఇక కాంగ్రెస్ తన డిమాండ్ల కోసం నిరసన వ్యక్తం చేసింది. రఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై ప్రభుత్వ స్పందనను డిమాండ్ చేసింది. ప్ల కార్డులను ప్రదర్శించింది. టిడిపి సభ్యుడు ఎన్. శివ ప్రసాద్ తనదైన శైలిలో వినూత్నంగా నిరసన తెలిపారు. పొడవైన జుట్టు గల నలుపు,,బ్రౌన్ రంగులలో ఉన్న విగ్గు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సభ వాయిదా పడిన వెంటనే కొంతమంది టిడిపి సభ్యులు బిజెపి సీనియర్ నాయకుడు ఎల్‌కె అద్వానితో సంభాషించారు.

రాజ్యసభలో సభా హక్కుల తీర్మానాన్ని ప్రవేశపెట్టిన రేణుకా చౌదరి



న్యూఢిల్లీ : రాజ్యసభలో తనను ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు, కిరణ్ రిజిజు వీడియోలపై కాంగ్రెస్ ఎంపి రేణుకా చౌదరి రాజ్యసభలో శుక్రవారం సభాహక్కుల తీర్మానం ప్రవేశపెట్టారు. కిరణ్ రిజిజు ట్విటర్లో స్పందిస్తూ రేణుకా చౌదరి వికటాట్టహాసానికి ప్రధాని నరేంద్ర మోడీ చిరాకు పడలేదు ' అని పేర్కొన్నారు. ఈ పోస్టుకు ప్రధాని మోడీ వ్యాఖ్యలు, అది విని నవ్వుతున్న బిజెపి ఎంపిల వీడియోను జత చేశారు. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో అనం తరం ట్విటర్ నుండి దాన్ని తొలగించారు. కాగా రిజిజు వ్యవహారంపై ఇవాళ రేణుకా చౌదరి స్పందిస్తూ 'ఇది ఓ మహిళను అవమానించడమే కాదు, తీవ్ర అభ్యంతరకరం. దీనిపై నేను హక్కుల తీర్మానం ప్రవేశపెట్టబోతున్నాను.' అని పేర్కొన్నారు.

ఆరోగ్య సూచికలో కేరళ ఫస్ట్

న్యూఢిల్లీ : నీతి అయోగ్ రూపొందించిన ఆరోగ్య సూచికలో కేరళ అగ్ర స్థానంలో వుంది. ఇటీవలి కాలంలో కాస్తంత మెరుగుదల ప్రదర్శించినప్పటికీ పెద్ద రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్ అట్టడుగున వుంది. కేరళ తర్వాతి స్థానాల్లో పంజాబ్, తమిళనాడు, గుజరాత్‌లు వున్నాయి. ఆరోగ్య రంగంలో పేలవమైన పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో యుపి తర్వాత రాజస్థాన్, బీహార్, ఒడిషాలు వున్నాయి. ఏటికేడు పనితీరు మెరుగుపరుచుకుంటూ వస్తున్న రాష్ట్రాల్లో జార్ఖండ్, జమ్మూ కాశ్మీర్, యుపిలు వున్నాయి. చిన్న రాష్ట్రాల్లో మిజోరాం మొదటి స్థానంలో వుండగా మణిపూర్, గోవాలు తర్వాత రెండు స్థానాల్లో వున్నాయి. నీతి అయోగ్ సిఇఓ అమితాబ్ కాంత్ నివేదికను విడుదల చేస్తూ, సహకారం, పోటీ తత్వంతో కూడిన ఫెడరలిజానికి ఒక సాధనంగా ఆరోగ్య సూచీ వ్యవహరిస్తుందని నీతి అయోగ్ భావిస్తోందని చెప్పారు.

మార్చి 31 లోగా ఆదాయం పన్ను రిటర్న్లు దాఖలుచేయండి : ఐటి శాఖ


న్యూఢిల్లీ : దేశంలో పెద్ద నోట్ల రద్దు తరువాత పెద్ద మొత్తాలలో నగదు డిపాజిట్ చేసిన వారు, అన్ని కంపెనీలు తమతమ ఆదాయం పన్ను రిటర్న్లను మార్చి 31 నాటికి దాఖలు చేయాలని ఆదాయం పన్ను శాఖ శుక్రవారం పేర్కొంది. ఆదాయం పన్ను రిటర్న్లను మార్చి 31లోగా దాఖలు చేయనివారు జరిమానాను, శిక్షను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించింది. ఆదాయం పన్ను రిటర్న్లకు అర్హులైన ట్రస్టులు, రాజకీయ పార్టీలు, అసోసియేషన్‌లు కూడా మార్చి 31లోగానే దాఖలు చేయాలని పేర్కొంది. 2016-2017, 2017-2018 సంవత్సరాలకు ఆదాయం పన్ను రిటర్న్లు దాఖలు చేయడంలో ఆలస్యం చేసిన వారికి ఇది చివరి అవకాశమని కూడా పేర్కొంది.

గూఢచర్య ఆరోపణలపై వైమానిక దళ కెప్టెన్‌అరెస్టు

ప్రశ్నిస్తున్న నిఘా అధికారులు

న్యూఢిల్లీ : భారత వైమానిక దళానికి చెందిన కెప్టెన్ అరుణ్ మర్వాను గూఢచర్య ఆరోపణలపైఅరెస్టుచేశారు. ఢిల్లీ పోలీసులకు చెందిన స్పెషల్ సెల్ అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. వైమానిక దళానికి చెందిన నిఘా వర్గాలు దాదాపు 10 రోజుల పాటు ఆయనను ప్రశ్నించిన తరువాత బుధవారం స్పెషల్‌సెల్ విభాగానికి అప్పగించారని ఆ వర్గాలు తెలిపాయి. అధికారిక రహస్యాల చట్టం (ఓఎస్ఎ)లోని నిబంధనల క్రింద మర్వాను అరెస్టు చేశారు. మర్వాను ప్రశ్నించేందకు కోర్టు ఐదు రోజులు పోలీసు కస్టడీ విధించిందిని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. వైమానిక దళానికి చెందిన కొన్ని రహస్య పత్రాలను వాట్సప్ ద్వారా ఒక మహిళకు పంపుతూ లీక్ చేస్తున్నాడన్న ఆరోపణలను మార్వా ఎదుర్కొంటున్నాడు.

బాలనేరస్తుల చట్టం మరింత కట్టుదిట్టం : సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ : బాల నేరస్తుల చట్టాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు సుప్రీం కోర్టు శుక్రవారం కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. బాలల హక్కుల కోసం ఏర్పడిన జాతీయ, రాష్ట్ర కమిషన్‌లు అన్నిటిలోనూ ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆదేశించింది. న్యాయమూర్తులు మదన్ బి లోకూర్, డీపక్ గుప్తాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా బాల నేరస్తుల బోర్డులు, శిశు సంక్షేమ కమిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొంది.

సర్జికల్ దాడుల తరువాత పెరిగిన 'ఉల్లంఘన'లు

దుర్భర స్థితిలో సరిహద్దు గ్రామాల ప్రజలు

శ్రీనగర్: గత ఏడాది భారత్ సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ దాడులు నిర్వహించిన తరువాత సరిహద్దుల్లో 'ఉల్లంఘన'లు పెరిగిపోయాయని జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరీ గ్రామస్తులు చెబుతున్నారు. పీర్‌పంజాల్ పర్వతశ్రేణి దిగువన వున్న రాజౌరీ, నౌషేరా తదితర గ్రామాలు సాధారణంగా ప్రశాంత వాతావరణంతో వుంటాయి. చుట్టు పర్వత శ్రేణుల మధ్య ఒకవైపు దట్టమైన అటవీ ప్రాంతం, మరోవైపు పంట పొలాలతో ప్రశాంతంగా వుండే ఈ గ్రామాలకు పర్వతాల అవతలి నుండి వినిపించేపేలుళ్లు, కాల్పుల శబ్దాలు దడ పుట్టిస్తున్నాయి. ఆకస్మికంగా వినిపించే ఈ కాల్పులు, పేలుళ్ల శబ్దాలు తమ ప్రశాంతతను భగ్నం చేస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పర్వతశ్రేణికి ఆవలివైపు వున్న వాస్తవాధీన రేఖ వెంట భారత్, పాకిస్తాన్ సైనిక పోస్టులు ఎదురెదురుగానే వుంటాయి. రాజౌరీ జిల్లా గుండా పోయే వాస్తవాధీన రేఖ వెంట ఇటీవలి కాలంలో కాల్పుల విరమణ ఉల్లంఘనలు నానాటికీ పెరిగిపోతూ స్థానికులకు ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు వారాల క్రితం వాస్తవాధీన రేఖకు కొద్ది దూరంలోవుండే గనాయా గ్రామంలోకి మోర్టార్ షెల్స్ దూసుకు వచ్చాయి. ఈ గ్రామం పాక్ సైనిక తుపాకుల రేంజ్‌లోనే వుంటోంది. ఈ గ్రామంలోని ఇళ్లలో అధికశాతం గోడలు బీటలు వారి, తుపాకీగుండ్ల గుర్తులతో మనకు కన్పిస్తుంటాయి. తాజాగా వాస్తవాధీన రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘనలు పెరిగిపోతుండటంతో గ్రామస్తుల కోసం జిల్లా యంత్రాంగం కొత్తగా బాంబు షెల్టర్లను నిర్మిస్తోంది. ఈ ఏడాది జనవరి 29 వరకూ సరిహద్దుల వెంట మొత్తం 192 ఉల్లంఘనలు చోటుచేసుకోగా ఇందులో ఎనిమిది మంది పౌరులు మరణించారని, మరో 58 మందికి పైగా గాయపడ్డారని అధికారిక లెక్కలుచెబుతున్నాయి. సరిహద్దుల్లో యుద్ధరంగాలుగా మారుతున్న ఈ గ్రామాలలో మోర్టార్ షెల్లింగ్ నిత్యజీవితంలో భాగంగా మారింది. ఈ నెల నాల్గవ తేదీన పాక్ సైన్యం జరిపిన కాల్పులలో నలుగురు భారత సైనికులు మరణించినపుడు ఈ ప్రాంతం అంతా తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. సరిహద్దులకు ఐదు కి.మీ పరిధిలోని గ్రామాలలో



షాపులు, స్కూళ్లు అన్నీ మూతపడ్డాయి. ఈ సమయంలో తమ ఉపాధికి కూడా గండిపడిందని స్థానికులు చెబుతున్నారు. తమ సంపాదనకు గండిపడితే పిల్లలను ఏ విధంగా పెంచాలి? వారికి విద్యాబుద్ధులు ఏ విధంగా చెప్పించాలో అర్ధం కాని పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదనగా చెప్పారు. సరిహద్దుల నుండి మోర్టార్ షెల్స్ వర్షం ప్రారంభమైన వెంటనే తమ ఇళ్లకు దూరంగా సురక్షిత ప్రాంతాలను వెదుక్కుంటూ పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. స్థానికులు 1965, 1971, 1999 నాటి యుద్ధ పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. అయితే 1999 నాటి కార్గిల్ యుద్ధానంతరం నాలుగేళ్ల పాటు విపరీతమైన షెల్లింగ్ జరిగిందని, ఇప్పుడు తాజాగా సర్జికల్ దాడుల అనంతరం అంతకు రెట్టింపు స్థాయిలో షెల్లింగ్ జరుగుతోందని వారు చెబుతున్నారు.

రాఫెల్ విమాన ఒప్పందంపై జైట్లీ వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్

న్యూఢిల్లీ : రాఫెల్ విమాన ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వ్యాఖ్యలను తిప్పి కొట్టారు. ఆయుధాల కొనుగోలుకు సంబంధించి గత యుపిఎ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్‌లో మూడు సార్లు ఇచ్చిన సమాధానాలను శుక్రవారం ఆయన బహిర్గతం చేశారు. ఆయుధాల కొనుగోలుకు సంబంధించి వివరాలు పంచుకునేందుకు గత యుపిఎ ప్రభుత్వం హయాంలోని రక్షణ మంత్రుల తిరస్కరించారని అరుణ్‌జైట్లీ వ్యాఖ్యానించిన ఒక రోజు తరువాత రాహుల్ గాంధీ స్పందించారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో మూడు సార్లు పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానాలను ట్వీట్ చేశారు. ఆయుధా ల కొనుగోలు ధరలపై యుపిఎ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించిందని చెప్పారు. ఒక్కొక్క రాఫెల్ జెట్ ధర ఎంతనేది మన రక్షణ మంత్రి నిర్మలా సీతారామ్‌ను ఇప్పుడు మీరు అడుగుతారా? అని ప్రశ్నించారు. రష్యా నుంచి సేకరించిన అడ్మిరల్ గోర్షకోవ్ యుద్ధ విమాన ఒప్పందంపై గత యుపిఎ ప్రభుత్వపు స్పందనను రాహుల్ తన ట్వీట్‌తోషేర్ చేశారు. జైట్లీ గురువారం పార్లమెంట్‌లో మాట్లాడుతూ రఫెల్ విమాన ఒప్పందాల వివరాలను వెల్లడించాలని కోరడాన్ని తప్పు పట్టారు.

జెఎన్‌యు కేసులో రెండేళ్ళయినా చార్జిషీటు దాఖలు చేయని పోలీసులు



న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో చోటుచేసుకున్న ఘటనలపై పెట్టిన దేశద్రోహం కేసులో రెండేళ్ళ క్రితమే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఇంకా చార్జిషీటు దాఖలు చేయలేదని ప్రముఖ ఆంగ్ల పత్రిక తన కథనంలో పేర్కొంది. పార్లమెంట్‌పై దాడులకు పాల్పడిన అఫ్జల్ గురును ఉరితీయడాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 9, 2016న యూనివర్సిటీలో నిరసన ఆందోళనలు జరిగాయి. జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు కన్నయ్య కుమార్, మరో ఇద్దరు విద్యార్థులను . దేశ వ్యతిరేక నినాదాలు చేశారన్న ఆరోపణలపై అరెస్టు చేశారు. ఈ ముగ్గురిని తరువాత బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసుపై వ్యాఖ్యానించేందుకు స్పెషల్ సెల్ డిసిపి ప్రమోద్ కుష్వా నిరాకరించారు. దీనిపై దర్యాప్తు దాదాపు పూర్తయ్యిందని, ఫోరెన్సిక్ నివేదిక కోసం పోలీసులు వేచి ఉన్నారని తమ పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారులు తెలిపారు. జెఎన్‌యు సంఘటనపై విచారణ జరిపిన ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ ఒకటి మార్చి 16, 2016న తన నివేదికను అందించింది. జెఎన్‌యులో ఫిబ్రవరి 9న జరిగిన ఆందోళనల్లో మాస్కులు ధరించిన కొంతమంది బయటి వారు రెచ్చగొట్టే నినాదాలు చేశారని నివేదికలో పేర్కొంది. సాక్షులు ఈ విషయాన్ని ధృవీకరించారని వెల్లడించింది. అయితే దీనికి సంబంధించి వీడియో సాక్ష్యాలు ఏవీ లేవు. అయితే ఈ కేసుకు సంబంధించి ప్రశ్నించేందుకు 2017 ఏప్రిల్ 29 నాటికి తమకు అందుబాటులోకి ఉండాలని 31 మంది విద్యార్ధులను పోలీసులు అదే నెలలోఆదేశించారు.

మూడు లోక్ సభ స్థానాలకు మార్చి 11న ఎన్నికలు : ఎలక్షన్ కమీషన్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, పుల్పూర్ లోక్‌సభ స్థానాలతో పాటు బీహార్‌లోని ఆరారియా లోక్ సభ స్థానాలకు మార్చి 11న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ కమీషన్ శుక్రవారం ప్రకటించింది. యుపిలో యోగి ఆదిత్యనాథ్, కేశవ్ ప్రసాద్ మౌర్య గత ఏడాది ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో రెండు లోక్ సభ స్థానాలకు రాజీనామా చేశారు. ఆ రెండు లోక్ సభ స్థానాలకు వచ్చే నెల ఉప ఎన్నికలు జరగనున్నాయి. బీహార్‌లో ఆర్జేడీ ఎంపి మహమ్మద్ తస్లిముద్దీన్ మరణించడంతో ఆరారియా స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. గత సంవత్సరం బిఎస్‌పి నేత మాయావతి రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయగా ఉత్తరప్రదేశ్‌లోని పుల్పూర్ లోక్ సభ స్థానానికి ఆమె పోటీచేస్తున్నట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. మూడు లోక్ సభ స్థానాలకు ఫిబ్రవరి 13న నోటిఫికేషన్ జారీ చేయడంతో నామినేషన్ల దాఖలు చేసే ప్రక్రియ మొదలు కానుంది. ఫిబ్రవరి 20న నామినేషన్లకు చివరి తేది. ఫిబ్రవరి 21న నామినేషన్ల పరిశీలన, 23న నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చునని ఇసి పేర్కొంది. మార్చి 14న ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఇసి తెలిపింది.

ఉత్తరప్రదేశ్‌లో ఎనిమిదేళ్ళ దళిత బాలిక హత్య

బల్లియా (ఉత్తరప్రదేశ్) : ఉత్తర ప్రదేశ్‌లోని విష్ణుపూర్ గ్రామంలో ఎనిమిదేళ్ళ దళిత బాలిక హత్యకు గురయ్యింది. భూమికి సంబంధించిన వివాదం నేపథ్యంలో దళిత బాలిక హత్యకు గురైనట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మేకలకు మేత కోసం వెళ్ళిన బాలిక గురువారం రాత్రి 8 గంటల సమయంలో హత్యకు గురైందని పోలీసు సూపరింటెండెంట్ అనిల్ కుమార్ తెలిపారు. దళిత బాలిక హత్య వెనుక భూ వివాదం ఉన్నట్లు భావిస్తున్నామని ఆయన చెప్పారు. దీనికి సంబంధించి హత్యకు గురైన బాలిక తండ్రి ఫిర్యాదు చేశారని తెలిపాడు.

కస్‌గంజ్ ఘటనలో కోర్టులో లొంగిపోయిన మూడో నిందితుడు

కస్‌గంజ్ : గత నెల 26న కస్‌గంజ్‌లో జరిగిన హింసాకాండలో చందన్ గుప్తాని హత్య చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న మూడవ నిందితుడు అసిఫ్ జిమ్‌వాలా స్థానిక కోర్టులో లొంగిపోయాడని ఎస్‌పి పియూష్ శ్రీవాత్సవ తెలిపారు. చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వెంటనే అసిఫ్‌ను జైలుకు పంపింది. గుప్తాను చంపడానికి ఉపయోగించిన ఆయుధాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడైన సలీంను గత నెల 31న అరెస్టు చేశారు. రెండో నిందితుడిని ఈ నెల 6న అదుపులోకి తీసుకున్నారు. కస్‌గంజ్‌లో జరిగిన ఘర్షణలు, హింసాకాండ పథకం ప్రకారమే, అత్యంత పకడ్బందీగా జరిగాయని ఈ నెల 5న స్వతంత్ర నిజ నిర్ధారణ బృందం తేల్చి చెప్పింది. ఈ సంఘటన అనుకోకుండా జరిగింది కాదని, మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు పన్నిన కుట్ర అని పేర్కొంది. ఈ హింసాకాండ పట్ల రాజకీయ పార్టీలు ఎందుకు మౌనంగా వున్నాయని ఆ బృందం ప్రశ్నించింది. రిపబ్లిక్ డే రోజున తిరంగా యాత్రలో పాల్గొన్న మోటార్ సైక్లిస్ట్‌లను పోలీసులు అరెస్టు చేసిన లేదా ప్రశ్నించిన దాఖలాలు లేవని కూడా ఆ బృందం పేర్కొంది.

మళ్లీ అదే మాట

(మొదటి పేజీ తరువాయి)

స్టీల్ ప్లాంట్, జాతీయ విద్యా సంస్థలకు నిధులు, వెనుకబడి జిల్లాల ప్రత్యేక నిధులు, ప్రత్యేక ప్యాకేజీ, దుగరాజపట్నం పోర్టు, అమరావతి నిర్మాణానికి నిధులు, పోలవరం పూర్తికి నిధులు వంటి కీలకమైన విభజన హామీలపై స్పష్టతేమీ ఇవ్వకుండా సమాధానం దాటవేశారు. కేంద్ర బడ్జెట్ 2018-19పై జరిగిన చర్చకు శుక్రవారం రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమాధాన మిచ్చారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిధులు సమకూరుస్తూనే ఉన్నాం. రెవెన్యూ లోటుకు సంబంధించి కొంత ఇచ్చాం. బకాయిలపై చర్చించి చెల్లిస్తాం. ఉక్కు కర్మాగారం, ఓడరేవులు తదితర అంశాలకు సంబంధించి సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయి. మరోవైపు పోలవరం పనులు కొనసాగు తున్నాయి. ఏపి విభజన సమయంలో అధిక ఆదాయాన్ని తెలంగాణ పొందింది. ఏపి కోల్పోయిన లోటును భర్తీ చేయాల్సి ఉంది. రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు, కడపలో స్టీల్ ప్లాంట్, పెట్రోలియం క్రాకర్ కాంప్లెక్స్, విశాఖ రైల్వే జోన్, విశాఖ-చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌పై సంబంధిత మంత్రిత్వ శాఖలు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తాయి. ఏపికి సంబంధించిన అంశాలను పరిశీలించి వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆయా శాఖలకు చెప్పాం" అని అన్నారు. విభజన సమయంలో ఏపికి న్యాయం కోసం తాము కూడా పట్టుబట్టామని జైట్లీ చెప్పారు. విభజనతో ఏపి ఆదాయం కోల్పోయిన మాట వాస్తవమంటూనే మొదటి ఏడాది రెవెన్యూ లోటు భర్తీకి రూ.3979 కోట్లు ఇచ్చినట్లు జైట్లీ వెల్లడించారు. ఇతర అంశాలు పరిశీలిస్తున్నామని, వివిధ శాఖలతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే చాలా ఇచ్చాం, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని జైట్లీ చెప్పుకొచ్చారు. రాజధాని, పోలవరం నిర్మాణం కోసం నిధులు ఇచ్చినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు నాబర్డు ద్వారా నిధులు ఇస్తున్నామని, దాన్ని కొనసాగిస్తామని చెప్పారు. పోలవరం నిర్మాణ పనులు ఆగవని తెలిపారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు విడుదల చేస్తున్నామని, కేంద్ర విద్యా సంస్థల్ని ఏపిలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అదనపు నిధులను ఈఏపి ద్వారా ఇవ్వాలని భావించా మంటూ ప్రకటించారు. నాబార్డ్ నుంచి అదనపు నిధులిస్తే....రుణ పరి మితి పెరుగుతుందని చెప్పామని జైట్లీ తెలిపారు. వాటిపై ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. అయితే, తన ప్రసంగంలో ఎక్కడా నిర్దిష్ట ప్రకటన చేయలేదు. అదనపు నిధుల గురించి గానీ, ఈఎపిలపై గానీ స్పష్టత ఇవ్వలేదు. అంతకుముందు గత కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న ఏపి ఎంపిలు రాజ్యసభలో జైట్లీ ప్రకటన చేస్తున్నప్పుడు మాత్రం నిరసన తెలుపలేదు. అందరూ తమ స్థానాల్లోనే కూర్చోన్నారు. అయితే, ఇది చర్చలకు వేదిక అని, ఆందోళనలు చేయడానికి కాదని, సభ్యులు హుందాగా వ్యవహరించాలంటూ జైట్లీ ప్రసంగానికి ముందు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు సభ్యులను కోరారు. అంతకు ముందు పార్లమెంట్‌లో ఎంపిలు చేస్తున్న ఆందోళనకు ముగింపు పలకాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య చొరవ తీసుకున్నట్లు సమాచారం. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత సుమారు రెండున్నర గంటల పాటు చర్చించారని తెలిసింది. చర్చలో అరుణ్ జైట్లీ, అమిత్ షా, సుజనా చౌదరి, ఇతర టిడిపి ఎంపిలు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేకం

మధ్యప్రాచ్యం శాంతి ప్రక్రియలో భారత్ కీలక పాత్ర

పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్

రమల్లా (వెస్ట్‌బ్యాంక్): మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పే ప్రక్రియలో భారత్ కీలకపాత్ర పోషించాల్సిన అవసరం వుందని పాలస్తీనా అధ్యక్షుడు మెహ్మూద్ అబ్బాస్ అభిప్రాయపడ్డారు. ప్రధాని మోడీ తమ దేశంలో పర్యటించటం ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలను దీర్ఘకాలంగా సమర్ధిస్తున్న భారత్ వైఖరిని ప్రతిబింబిస్తోందన్నారు. తమ దేశానికి వచ్చే భారత ప్రధానితో మధ్యప్రాచ్యంలో శాంతి ఏర్పాటు ప్రక్రియను, ఇజ్రాయిల్‌తో తుది అవగాహన కుదుర్చుకునే చర్చలకు అవసరమైన బహుళపక్ష వేదిక ఏర్పాటు ఆవశ్యకతపైన చర్చిస్తానని ఆయన శుక్రవారం ఒక వార్తా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. శనివారం నుండి మూడు దేశాలలో పర్యటించనున్న మోడీ పాలస్తీనాతో తన పర్యటనను ప్రారంభించనున్నారు. జెరూసలేం నగరాన్ని ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన అనంతరం ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన సమయంలో ప్రధాని మోడీ ఈ ప్రాంతంలో పర్యటించటం ప్రాధాన్యతను సంతరించుకుంది. పాలస్తీనాలో చారిత్రాత్మక పర్యటన కోసం వస్తున్న భారత ప్రధానిని తాము సాదరంగా ఆహ్వానిస్తామని ఆయన చెప్పారు. భారత్-పాలస్తీనా ప్రజల మధ్య కొనసాగుతున్న సోదరబంధాన్ని, మైత్రిని ఈ పర్యటన ప్రతిబింబిస్తుందని తాను భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో ఇటీవల చోటు చేసుకున్న తాజా పరిణామాలపై తాను భారత్ ప్రధాని మోడీతో చర్చిస్తానని, దీనితో పాటు ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయటం, ప్రాంతీయ పరిస్థితుల వంటి అంశాలను కూడా తాను ప్రస్తావిస్తానని ఆయన వివరించారు. ఈ ప్రాంతంలో శాంతి ఏర్పాటు ప్రక్రియలో భారత్ కీలక పాత్ర



పోషించాలని తాను కోరుకుంటున్నానన్నారు. అంతర్జాతీయ సమాజంలో భారత్ అత్యంత గౌరవప్రదమైన దేశమన్న అబ్బాస్ పాలస్తీనా, ఇజ్రాయిల్ తుది ఒప్పందం కుదుర్చుకునేందుకు అవసరమైన బహుళపక్ష చర్చా వేదికను ఏర్పాటు చేయటంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం వుందన్నారు. పాలస్తీనా-ఇజ్రాయిల్ వివాదానికి రెండుదేశాల ఏర్పాటు పరిష్కారమన్న వాదనను భారత్ దీర్ఘకాలంగా సమర్ధిస్తున్న విషయం తెలిసిందేనని, ఏళ్ల తరబడి కొనసాగుతున్న పోరాటంలో భారత్ అన్ని సమయాల్లోనూ తమ వైపు నిలిచిందని ఆయన గుర్తు చేశారు. స్వతంత్ర పాలస్తీనా ఆశయ సాధనలో తాము భారత్ మద్దతుపై ఆధారపడ్డామని ఆయన వివరించారు. భారత్-ఇజ్రాయిల్ మధ్య పెరుగుతున్న మైత్రీబంధంపై అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఏ దేశమైనా ఇతర దేశాలతో స్నేహసంబంధాలను కొనసాగించుకునే హక్కు కలిగి వుంటుందన్నారు. భారత్‌తో సోదర బంధం ప్రాధాన్యతను తాము విశ్వసిస్తున్నామని, ఇది మరే ఇతర దేశంతోనూ భారత్ సంబంధాలపై ఎటువంటి ప్రభావాన్నీ చూపబోదని ఆయన స్పష్టం చేశారు.

సంక్షిప్తం

ఖాళీ ప్రభుత్వ భవనాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం

న్యూఢిల్లీ : ఖాళీగా వున్న ప్రభుత్వ భవనాలను నిరాశ్రయులకు రాత్రుళ్ళు ఆశ్రయమిచ్చే కేంద్రాలుగా మార్చే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. దీనివల్ల ప్రభుత్వానికి డబ్బు కూడా ఆదా అవుతుందని, కొత్త నైట్ షెల్టర్లను నిర్మించాల్సిన అవసరం వుండదని పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో దాదాపు 10లక్షల మంది నిరాశ్రయులు వున్నారని, వారికి తాత్కాలిక ఆశ్రయాలను నిర్మించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ మదన్ లోకూర్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది.

పోలీస్ కస్టడీలో యువకుడు మృతి

భువనేశ్వర్ : ఒడిషాలోని సంబల్పూర్ నగరంలో శుక్రవారం ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. గురువారం రాత్రి ఐంతాపాళి పోలీసుల కస్టడీలో ఉన్న అభినాష్ ముండా అనే గిరిజన యువకుడు మృతి చెందడంతో అల్లర్లు చెలరేగాయి. అతని మృతికి నిరసనగా పోలీసు స్టేషన్‌కు, వాహనాలకు ఆందోళన కారులు నిప్పంటించారు. ఈ ఘటన లో పది మంది పోలీసులతో సహా 30 మందికి గాయాలయ్యా యని అధికారులు తెలిపారు. నిరసనకారులు సంబల్పూర్-రూర్కెలా (స్టేట్ హైవే10) రోడ్డును దిగ్బంధించారని, ప్రస్తుతం పరిస్థితి నియంత్రించా మని తెలిపారు దొంగతనం చేశాడనే ఆరోపణపై అభినాష్ అరెస్టు చేసి, అతన్ని కొట్టి చంపారని నిరసనకారులు ఆందోళనలు చేపట్టారు.

ఆర్‌బిఐ ఖాతాదారులకు హెచ్చరిక

ముంబై : ఆర్‌బిఐ పేరిట ఒక నకిలీ వెబ్‌సైట్ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతోందని, ఖాతాదారులు జాగ్రత్తగా ఉండాలని భారత రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. ఖాతాదారుల నుంచి బ్యాంక్ వివరాలను సేకరిస్తుండటంతో ఆర్‌బిఐ ఈ మేరకు స్పందిచింది. వినియోగదారుల వివరాలను ఆర్‌బిఐ ప్రశ్నించదని, ఆ వెబ్‌సైట్‌పై సైబర్ విభాగానికి ఫిర్యాదు చేశామని తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం సాయంత్రం ఒక ప్రకటనను విడుదల చేసింది.

తొలిసారి మీడియా ముందుకొచ్చిన రాజ్‌షా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో ప్రిన్సిపల్ డిప్యూటీ ప్రెస్ సెక్రెటరీగా వ్యవహరిస్తున్న భారత సంతతి అమెరికన్ ఉన్నతాధికారి రాజ్‌షా శుక్రవారం నాడు తొలిసారిగా అధికార హోదాలో మీడియా ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను మీడియా ప్రతినిధులకు పరిచయం చేసిన వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ సారా శాండర్స్ రాజ్‌షా ట్రంప్ ప్రభుత్వంలో అత్యంత సమర్థులైన, ఉత్తమ అధికారుల్లో ఒకరని అభివర్ణించారు. షా గత సెప్టెంబర్‌లో ఈ పదవిలో నియమితులయ్యారు.



పర్యటన

చారిత్రాత్మక పర్యటన కోసం దక్షిణకొరియాకు విచ్చేసిన ఉత్తరకొరియా అధ్యక్షుని సోదరి కిమ్‌యోజోన్ ఇతర ప్రతినిధి వర్గం

ఉత్తర కొరియాపై ఒత్తిడి తీసుకురావాలి

అమెరికా, చైనా పునరుద్ఘాటన

వాషింగ్టన్ : అణు కార్యక్రమం విషయంలో ఉత్తర కొరియాపై ఒత్తిడి తీసుకురావడానికి నిబద్ధతను అమెరికా, చైనాలు పునరుద్ఘాటించాయని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ప్రస్తుతం చైనా విదేశాంగ మంత్రి యాంగ్ జియిచి రెండు రోజుల పాటు వాషింగ్టన్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌తో ఆయన చర్చలు జరపనున్నారు. అత్యంత కీలకమైన అమెరికా–చైనా ఆర్థిక సంబంధాలపై ఇరువురు నేతలు చర్చిస్తారని భావిస్తున్నారు. ఇటీవల ఇరు దేశాలు దెబ్బకు దెబ్బ తీసుకునేలా చర్యలు తీసుకోవడంతో వాణిజ్య యుద్ధం ప్రారంభమవుతుందని అందరూ ఆందోళన చెందారు. అమెరికా విదేశాంగ ప్రతినిధి హీతర్ నారెట్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, ఉత్తర కొరియా అణు కార్యక్రమాన్ని నిలువరించేలా ఒత్తిడి తీసుకురావాల్సిందేనని ట్రంప్, జిన్‌పింగ్‌లు స్పష్టం చేసినట్లు తెలిపారు. ఇరు దేశాల మధ్య గల అభిప్రాయ భేదాలను పరిష్కరించుకునేందుకు, పరస్పర సవాళ్ళపై సహకారం పెంచుకునేలా చర్యలు తీసుకునేందుకు, నిర్మాణాత్మక, విలువలతో కూడిన సంబంధాలు కొనసాగించాల్సిన ప్రాధాన్యతపై టిల్లర్‌సన్, యాంగ్‌లు అంగీకరించారని నారెట్ తెలిపారు. సక్రమమైన, ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు నెలకొల్పే దిశగా చర్చలు జరపాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఉత్తర కొరియా విషయంలో చైనా మరింత ఎక్కువగా చొరవ తీసుకోవాలని తాము ఆశిస్తున్నట్లు నారెట్ చెప్పారు.

ఇజ్రాయిల్ దురాక్రమణ ఎదుర్కొనేందుకు చర్యలు

లెబనాన్ అత్యున్నత రక్షణ మండలి ఆదేశాలు

బీరుట్ : దక్షిణ సరిహద్దు పొడవునా గోడ నిర్మాణాన్ని నివారించడంతో సహా ఇజ్రాయిలీ దురాక్రమణను ఎదుర్కొనడానికి చర్యలు తీసుకోనాలని లెబనాన్ అత్యున్నత రక్షణ మండలి ఆదేశాలు జారీ చేసింది. మండలి అసాధారణ సమావేశం అనంతరం ప్రధాన కార్యదర్శి బ్రిగేడ్ జనరల్ సదల్లా హమద్ మాట్లాడుతూ, దక్షిణ సరిహద్దులో గోడ నిర్మించడం లెబనాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడంగా పరిగణిస్తామని చెప్పారు. ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి 1701 తీర్మానాన్ని కూడా ఇది ఉల్లంఘిస్తోందని అన్నారు. అటువంటి దురాక్రమణలను ధృఢంగా ఎదుర్కొనాల్సి వుందని పేర్కొన్నారు. ఇరు దేశాలకు సరిహద్దుల్లో రాస్ నకరా నగరంలో ఇజ్రాయిలీ సైన్యం గోడ నిర్మాణాన్ని ప్రారంభించిందని మీడియా పేర్కొంది.

వివాహేతర సంబంధంపై బిల్లుకు ఆస్ట్రేలియా ప్రధాని వ్యతిరేకత

సిడ్నీ : పార్లమెంట్ సభ్యులకు, వారి సిబ్బంది మధ్య ఎటువంటి సంబంధాలు వుండకుండా నిషేధం విధించే ప్రతిపాదిత బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ శుక్రవారం తెలిపారు. ఉప ప్రధాని జార్నబీ జోసేకువున్న వివాహేతర సంబంధంపై వివాదం చెలరేగిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇద్దరు వ్యక్తులు పరస్పర ఆమోదంతో కొనసాగించే సంబంధాన్ని నియంత్రించాలనుకోవడం సమర్ధనీయం కాదని ఆయన విలేకర్లతో వ్యాఖ్యానించారు. అమెరికా తరహాలో త్వరలో తాను ఒక బిల్లును ప్రవేశపెడతానని ఇండిపెండెంట్ ఎంపి కేథీ మెక్‌గౌవాన్ ప్రకటించారు.

మూసివేత గండం నుండి బయటపడిన ట్రంప్ సర్కారు

వాషింగ్టన్: గతంలో బడ్జెట్ ప్రతిపాదనలను సెనేట్ ఆమోదించకపోవటంతో మూతపడిన ట్రంప్ ప్రభుత్వం తాజాగా ప్రతినిధుల సభ ఆమోదముద్ర వేయటంతో స్వల్పకాలిక స్థంభన అనంతరం మూసివేత గండం నుండి బయటపడింది. అంతకు ముందు ఈ బడ్జెట్ ప్రతిపాదనలపై స్పీకర్ పాల్ ర్యాన్ అభ్యంతరంతో మరోసారి ప్రభుత్వం మూతపడింది. బడ్జెట్‌ను ఆమోదించే విషయంలో సెనేట్‌లోని రిపబ్లికన్, డెమొక్రాటిక్ పార్టీ సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదిరి మార్గం సుగమమైందనుకుంటున్న సమయంలో స్పీకర్ పాల్ ర్యాన్ ఓటింగ్‌పై అభ్యంతరం చెప్పటం విశేషం. ఓటింగ్‌పై స్పీకర్ పదేపదే అభ్యంతరం వ్యక్తం చేయటంతో వివిధ ప్రభుత్వ శాఖలకు నిధుల కేటాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలతో కూడిన బడ్జెట్ ఆమోదానికి బ్రేక్ పడింది. రాత్రి 11 గంటల (స్థానిక కాలమానం ప్రకారం) సమయంలో కొద్ది విరామం అనంతరం మరోసారి సమావేశమైన ప్రతినిధుల సభ ఎట్టకేలకు బిల్లుకు ఆమోదముద్ర వేసింది. ఈ ఓటింగ్‌లో 240 మంది సభ్యులకు 186 మంది అనుకూలంగా ఓటు వేశారు. దీనితో మార్చి 23 వరకూ ప్రభుత్వ ఖర్చులకు నిధులను కేటాయించే బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం లభించినట్లయింది. అంతకు కొద్దిసేపటి ముందు సెనేట్ ఈ బిల్లుకు ఆమోదముద్ర వేసింది. నిధుల వ్యయంపై ప్రభుత్వానికి ఉన్న అనుమతి గురువారం అర్ధరాత్రితో ముగియటంతో కొన్ని ప్రభుత్వ విభాగాలు మూతపడ్డాయి. దీనితో వెంటనే ప్రభావితమయ్యే విభాగాలేవీ లేవని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అత్యవసర విభాగాల సిబ్బంది తమ విధుల్లోనే కొనసాగుతారని ఈ వర్గాలు వివరించాయి.



యురోపియన్ పార్లమెంట్ మానవ హక్కుల తీర్మానం చెల్లదు

స్పష్టం చేసిన టర్కీ

అంకారా : టర్కీలోని మానవ హక్కులపై యురోపియన్ పార్లమెంట్ చేసిన తీర్మానం చెల్లబోదని టర్కీ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం టర్కీ ఎదుర్కొంటున్న పరిస్థితులకు వాస్తవ దూరంగా తీర్మానం వుందని పేర్కొంది. అత్యవసర పరిస్థితి విధింపులో భాగంగా తీసుకున్న చర్యలన్నీ కూడా చట్టాలకు, అంతర్జాతీయ నియమ నిబంధనలకు లోబడి తీసుకున్నవేనని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. తీవ్రవాదాన్ని నిరోధించేందుకు సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలని టర్కీ గట్టి నిబద్ధతతో వుందని, యురోపియన్ పార్లమెంట్‌లోని కొన్ని శక్తులు ఈ పోరాటం ప్రాధాన్యతను సమగ్రంగా అర్ధం చేసుకోవడంలో విఫలమయ్యాయని ఆ ప్రకటన పేర్కొంది. 2016 జులై 15న కుట్ర జరిగిన నేపథ్యంలో దేశంలో విధించిన అత్యవసర పరిస్థితిని ఇప్పటివరకు పొడిగిస్తూ వచ్చారు. ఆ అత్యవసర పరిస్థితి, పత్రికా స్వేచ్ఛలను లక్ష్యంగా చేసుకుని టర్కీలో మానవ హక్కుల ప్రస్తుత పరిస్థితిపై యురోపియన్ పార్లమెంట్ తీర్మానాన్ని ఆమోదించింది.

ఫిలిప్పీన్స్‌లో మాదకద్రవ్య కార్యకలాపాలపై ఐసిసి దర్యాప్తు



మనీలా : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధంపై, అధికార ప్రచారంపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) దర్యాప్తు ప్రారంభిస్తుందని ఫిలిప్పీన్ అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల విషయంలో అన్యాయంగా హత్యలు జరిగాయని ఆరోపణల నేపథ్యంలో ఈ దర్యాప్తు చేపట్టనున్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అమలు చేసే విధానాలు, వ్యూహాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, విచారించడం జరుగుతుందని అధ్యక్ష భవన ప్రతినిధి హ్యారీ రోక్ తెలిపారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపడం అవసరమా కాదా అని కోర్టు నిర్ణయిస్తుందని అన్నారు. దీనిపై ఫిలిప్పీన్స్ ప్రభుత్వం స్పందిస్తూ, మాదకద్రవ్యాల రంగంలో చట్టబద్ధమైన పోలీసు కార్యకలాపాలే చేపడుతున్నామని తెలిపారు. వారు వారి పరిధిలోపే చర్యలు తీసుకుంటారని తెలిపారు. మొత్తం హత్యల్లో మూడవ వంతు ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల వంటివేనని చెప్పారు.

సిరియాపై అమెరికా పోరులో మరింత ప్రమాదకరమైన దశ



డమాస్కస్ : ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే సిరియా ఈశాన్య ప్రాంత రాష్ట్రమైన డెర్ ఎజార్‌లో బుధవారం వంద మందికి పైగా సిరియా సైనికులను అమెరికా మట్టుబెట్టడం చూస్తుంటే గత మూడేళ్ళుగా సిరియాలో అమెరికా సైన్యం ప్రత్యక్ష జోక్యంలో మరింత ప్రమాదకరమైన దశ ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. ఇది యుద్ధ నేరమని సిరియా ప్రభుత్వం పేర్కొంటోంది. తీవ్రవాదానికి నేరుగా మద్దతివ్వడమేనని వ్యాఖ్యానించింది. యూఫ్రేరేట్స్ నదికి తూర్పు వైపున ఐసిస్ కార్యకర్తలపై తమ బలగాలు సైనిక చర్యలకు పాల్పడుతుంటే వారిపై అమెరికా దాడి జరిపి హతమార్చిందని సిరియా ప్రభుత్వం పేర్కొంది. వందమంది ప్రభుత్వ అనుకూల సైనికులను హతమార్చామని అమెరికా గర్వంగా ప్రకటించుకుంది. అయితే అమెరికా దాడుల్లో డజన్ల సంఖ్యలో సైనికులు మృతి చెందడమే కాకుండా, అనేకమంది గాయపడ్డారని, ఆ ప్రాంతంలో తీవ్ర నష్టం జరిగిందని సిరియా ప్రభుత్వం తెలిపింది. ఈ దాడులతో ఇరు పక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2016 సెప్టెంబరు 17న డెర్ ఎజార్ విమానాశ్రయానికి సమీపంలో సిరియా ఆర్మీ స్థావరంపై అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో 62మంది సైనికులు మరణించారు. వందమందికిపైగా గాయపడ్డారు. ఆ దాడి అనుకోకుండా జరిగిందని, పొరపాటు జరిగిందని అపుడే పెంటగన్ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే ఈసారి మాత్రం ఆత్మ రక్షణ హక్కు పరిధిలో ఈ దాడి జరిగిందని అమెరికా చెబుతోంది. సిరియా ప్రభుత్వ అనుమతి గానీ, ఐక్యరాజ్య సమితి ఆదేశాలు గానీ లేకుండానే సిరియా ప్రభుత్వ భూభాగాన్ని ఆక్రమించి ఈ దాడి జరిపింది.

మొదటి పేజీ తరువాయి

లోయా మృతిపై స్వతంత్ర దర్యాప్తు

లోయాతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కూడా అనుమానాస్పద రీతిలో మరణించారని సీనియర్ కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ తెలిపారు. సిబిఐ అధికారులతో కాకుండా సిట్‌తో దర్యాప్తు నిర్వహించాలని సిబల్ కోరారు. సిబిఐ లేదా ఎన్ఐఎపై తమకు నమ్మకం లేదని, వారేం చేస్తారో తమకు తెలుసునని సిబల్ వ్యాఖ్యానించారు. 2జి స్పెక్ట్రమ్ కేసును విచారించిన సిబిఐ మాజీ టెలికం మంత్రి రాజాతో సహా నిందితులందరినీ డిసెంబరులో విడిచిపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. 2015లో లాయర్ శ్రీకాంత్ ఖండాల్కర్ జిల్లా కోర్టు భవనంలోని ఆరవ అంతస్తు నుండి పడి మృతి చెందారని, 2016లో జిల్లా న్యాయమూర్తి ప్రకాష్ తాంబ్రె రైల్లో పై బెర్తు నుండి కింద పడ్డారని, ఆయన వెన్నెముక విరిగిందని ప్రతిపక్ష నేతలు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. కీలకమైన కేసులను విచారిస్తున్న లాయర్లు, న్యాయమూర్తులను లక్ష్యంగా చేసుకుంటే దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదని కాంగ్రెస్ పేర్కొంది. లోయా మృతిపై అనేక సందేహాలు, అనుమానాలను కుటుంబసభ్యులు కూడా వ్యక్తం చేయడంతో ఆయన మృతిపై వివాదం సుప్రీంకోర్టు వరకు చేరింది.

ఖజానాకు కలవరం

రూ.2వేల కోట్లు దాటిపోయినట్లు స్పష్టం చేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ప్రారంభమైన పెండింగ్ సమస్య నెల నెలా పెరుగుతూ వస్తోంది. డిసెంబర్ వరకు రూ. వెయ్యి కోట్ల వరకు ఉన్న పెండింగ్ బిల్లులు ఇప్పుడు రూ.2,041 కోట్లకు ఎగబాకాయి. అంటే కేవలం ఒక్క నెలలోనే పెండింగ్ బిల్లుల మొత్తం రెట్టింపైనట్లు కనిపిస్తోంది. అక్టోబర్ నెలాఖరుకు రూ. 550 కోట్లు పెండింగ్ ఉండగా, నవంబర్ నాటికి 325 కోట్లు, డిసెంబర్‌కు 275 కోట్లు, జనవరికి 757 కోట్లు బిల్లుల పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ నెల ఇప్పటివరకు మరో రూ. 425 కోట్లు విలువైన బిల్లులు పెండింగ్ జాబితాలోకి చేరిపోయాయి. పెండింగ్ బిల్లుల్లో ఎక్కువగా విద్యుత్ శాఖకు చెందినవే కనిపిస్తున్నాయి. గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన బిల్లులు కూడా అదే స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. అక్టోబర్‌లో విద్యుత్ శాఖకు రూ.275 కోట్లు పెండింగ్‌లో ఉండగా, ప్రతినెలా ఈ మొత్తం అదనంగా కలుస్తోంది. ఇవే వెయ్యి కోట్ల వరకు ఉన్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన బిల్లులు కూడా భారీగానే దర్శనమిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం నెలా 20 రోజుల సమయం మాత్రమే సమయం ఉంది. దీంతో మొత్తం ఈ బకాయిల భారమంతా వచ్చే ఆర్థిక సంవత్సరంపై పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితంగా వచ్చే ఏడాది కూడా ఈ సమస్య కొనసాగుతుందని అధికారులు తేల్చి చెబుతున్నారు.

అమెరికా మార్కెట్ కుదేలు

పాయింట్లు లేదా 3.75 శాతం, అదే విధంగా నాస్‌డాక్ 275 పాయింట్ల లేదా 4 శాతం చొప్పున పతనమైమయ్యాయి. అమెరికాలో వర్షం పడితే ప్రపంచ దేశాలకు జలుబు చేసినట్లు పరిస్థితి తయారయ్యింది. యూరప్, ఆసియన్ మార్కెట్లు భారీ నష్టాలకు గురి కావడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికే భారత్‌లో ఎలాంటి సానుకూల పరిణామాలు లేకపోవడం, అమెరికా మార్కెట్ల ఒత్తిడితో దలాల్ స్ట్రీట్ బెంబేలెత్తింది. ఈ పరిణామాల మధ్య వారాంతంలో బిఎస్ఇ సెన్సెక్స్ ఓ దశలో 550 పాయింట్ల మేర కోల్పోయి తుదకు స్వల్పంగా పుంజుకుని 407 పాయింట్లు పతనమై 34,005 వద్ద ముగిసింది. నిఫ్టీ సూచీ 121 పాయింట్లు పడిపోయి 10,454కు దిగజారింది. వరుసగా ఏడు రోజుల నష్టాల తర్వాత గురువారం నాడు స్వల్ప ఉపశమనం లభించిందని భావించిన మదుపర్లు తిరిగి వారాంతంలో మళ్లీ షాక్‌ను ఎదుర్కొన్నారు.

మే 6వ తేదీన నీట్

తమిళం, కన్నడ, మరాఠీ, ఒరియా, బెంగాలీ, అస్సామీ భాషల్లో నిర్వహిస్తామని పేర్కొన్నది. ఎన్నారై, భారత సంతతి విద్యార్థులు కూడా నీట్ 2018 అధికార వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించింది. సిబిఎస్ఇ జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం దూరవిద్యా విధానంలో చదువుతున్న విద్యార్థులు నీట్ రాయడానికి అనర్హులుగా ప్రకటించింది. గరిష్ట వయో పరిమితి 25 సంవత్సరాలు కాగా, అభ్యర్థులు ఎంబిబిఎస్, బిడిఎస్ మొదటి సంవత్సరం కోర్సుల్లో చేరే సమయానికి, ఈ ఏడాది డిసెంబర్ 31నాటికి 17 సంవత్సరాలు నిండినవారై ఉండాలి. ఎస్సి, ఎస్‌టి, ఒబిసి విద్యార్థులకు ఐదేళ్ల సడలింపునిచ్చారు. ఈ ఏడాది 12వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా నీట్ రాయవచ్చని సిబిఎస్ఇ తెలిపింది. ఒసి, ఒబిసి,విద్యార్థులు రూ.1400, ఎస్సి, ఎస్‌టి, విభిన్న ప్రతిభావంతులు రూ. 750 చెల్లించాల్సి ఉంటుంది.

అన్ని పార్టీలు ఏకం కావాలి

మొదటి పేజీ తరువాయి

తోట నరసింహం, రామ్మోహన్ నాయుడు, శ్రీరాం మాల్యాద్రి, అవంతి శ్రీనివాస్, కేశినేని నాని, గల్లా జయదేవ్, శివప్రసాద్, మురళీమోహన్, నిమ్మల కిష్టప్ప, రవీంద్ర బాబు, మాగంటి బాబు, టిజి వెంకటేష్, తోట సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. వైసిపి ఆందోళనలో ఎంపిలు మేక పాటి రాజమోహన్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, వర ప్రసాద్, అవినాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి పాదాల సాక్షిగా మోడీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏపికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు ఎంపి శివప్రసాద్ పోతు రాజు వేషధారణతో వినూత్న నిరసన తెలిపారు. పూనకం వచ్చినట్లు ఊగిపోయారు. వెంకటేశ్వర స్వామి, విజయవాడ కనక దుర్గమ్మ తనను ఆవహించారని ఆయన చెప్పారు. వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మోడీ హామీలు ఇచ్చి మరిచిపోయారని.. ఇందుకు పార్లమెంట్ సాక్షిగా హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కేంద్రం లెక్కచేయడం లేదని అన్నారు. ఏపిలో కాంగ్రెస్‌కు ఎలాంటి గతిపట్టిందో.. బిజెపికి కూడా అలాంటి పరిస్థితే వస్తుందని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి ఎంపిలు చేస్తున్న ఆందోళన లోక్‌సభ లోనూ కొనసాగింది. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ టిడిపి, వైసిపి ఎంపిలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నిరసన చేపట్టారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. సభ్యులు శాంతించకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి సమావేశాలు ప్రారంభమైనా.. పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సభ మార్చి 5కు వాయిదా పడింది.

ఎపికి సాయంపై జైట్లీతో మాట్లాడా.. ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో..: అద్వానీ వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై లోక్‌సభలో ఆందోళన చేస్తోన్న టిడిపి ఎంపిలతో బిజెపి సీనియర్ నేత ఎల్‌కె అద్వానీ మాట్లాడారు. ఈ సందర్భంగా విభజన హామీలు, సభలో ఎందుకు నిరసన తెలుపుతున్నామో, ఇతర పరిణామాల గురించి ఎంపిలు అద్వానీకి వివరించారు. వారితో అద్వానీ మాట్లాడుతూ ఏపికి కేంద్రం న్యాయం చేయాల్సి ఉందని అభిప్రాయపడినట్లు సమాచారం. ఒకరినొకరు గౌరవించుకోవాలని, సభా మర్యాదలు కాపాడుకోవాలని అన్నట్లు తెలుస్తోంది. ఏపి వ్యవహారంపై ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీతోనూ మాట్లాడానని ఎంపిలతో చెప్పారు. ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో అర్థం కావట్లేదంటూ ఆయన ఎంపిల వద్ద నిరాశ వ్యక్తపరిచినట్లు సమాచారం.

పార్లమెంట్‌లో నిరసన అంతా 'ఒక డ్రామా' : కొత్తపల్లి గీత

పార్లమెంట్‌లో టిడిపి, వైసిపి ఎంపిలు చేస్తోన్న నిరసనంతా ఒక డ్రామా అని అరుకు ఎంపి కొత్తపల్లి గీత విమర్శించారు. తాను నిరసనలు తెలపడం లేదని నిందించేవారు ముందు తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ ఆవరణంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ టిడిపి, వైసిపిలపై మండిపడ్డారు. కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్రం ఎందుకు లెక్కలు చెప్పడం లేదని ప్రశ్నించారు. "తన నియోజకవర్గానికి రూ. 25 వేల కోట్లు తీసుకొస్తే, ఒక్క పైసాకు లెక్క లేదు. అసలు నిధులను ఏం చేస్తున్నారు? హోదా కంటే ప్యాకేజీ మెరుగు అని సన్మానాలు కూడా చేసి, ఇప్పుడు ఎందుకు మాట మార్చారు? రెండెంకల వృద్ధి రేటని ఘనంగా చాటుకుంటూ ప్రత్యేక హోదా ఎలా అడుగుతారు? 90:10 పథకాలకు 100 శాతం గ్రాంట్ ఏ ప్రాతిపదికన అడుగుతున్నారు? టిడిపితో కలిసున్నా ఇవ్వని హోదా వైసిపి కలిస్తే ఎలా వస్తుంది? హోదా ఇస్తే బిజెపితో కలుస్తామని జగన్ ఎలా అనగలిగారు? జగన్ కేంద్రాన్ని ఎందుకు తిట్టడం లేదు" అంటూ ప్రశ్నించారు. టిడిపి, వైసిపికి రెండు పార్టీలకు చిత్తశుద్ధి లేదని, పార్లమెంటు నిరసన అంతా ఒక డ్రామా అని విమర్శించారు. సభలో ఏ ఒక్కరైనా రాష్ట్ర సమస్యలపై ప్రశ్నించారా? చర్చల్లో పాల్గొన్నారా? ఒకరిపై ఒకరు నింద లేసుకుంటూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి చేయాలని, దొంగ నాటకాలు ఆడితే ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రం కోసం ఏ త్యాగానికైనా సిద్ధమని ఆమె అన్నారు.

అన్నీ ఆమోదించారంటూ లీక్

మొదటి పేజీ తరువాయి

జరపారని దీంతో కేంద్రం దిగొచ్చిందన్నది ఈ లీక్‌ల సారాంశం! ప్రత్యేకహోదాకు బదులుగా ప్యాకేజిని ఖరారు చేశారని, దీనికి సంబంధించి త్వరలో నిధులు విడుదల చేస్తారని, విశాఖ పట్నం రైల్వేజోన్ ఏర్పాటుకు సంబంధించి కూడా సానుకూలంగా స్పందించిందని, ఈ మేరకు కేంద్రం ప్రకటన చేయనుందని, నెల్లూరు జిల్లాలోని దుగ్గరాజపట్నం పోర్టుకు ఇస్రో అభ్యంతరాలు తెలిపిన నేపథ్యంలో మరోచోట పోర్టును మంజూరు చేసిందని, కడప జిల్లాలో ప్రైవేటు సహకారంతో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధితో పాటు, లోటు బడ్జెట్‌కు నిధులు విడుదలకు అంగీకరించిందని ప్రచారం సాగుతోంది. అయితే, దీనిని అధికారికంగా ఎవ్వరూ ధృవీకరించలేదు. దేశం వర్గాల నుండే అందిన ఈ సమాచారాన్ని కొందరు టిడిపి ఎంపీలు ఖండించారు. అటువంటి సమాచారమేమి లేదని వారు తెలిపారు. ఉన్నతస్థాయి అధికారవర్గాలు కూడా దీనిని తోసిపుచ్చాయి. శుక్రవారం మధ్యాహ్నం అరుణ్‌జైట్లీతో సుజన భేటీ అయ్యారని, ఆ తరువాతే రాజ్యసభలో ప్రసంగించారని ఆ వర్గాలు తెలిపాయి. రాజ్యసభలో మంత్రి ప్రసంగం ముగిసిన తరువాత ఎటువంటి చర్చలు జరగలేదని వివరించాయి.

ఎపికి కేంద్ర నిధుల విడుదల

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం 14వ ఆర్థిక సంఘం గ్రాంట్ల కింద రూ.369.16 కోట్లు, ఉపాధి హామీ నిధుల కింద రూ. 31.76 కోట్లను శుక్రవారం విడుదల చేసింది. పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తంలో రూ.417.44 కోట్లను గురువారం విడుదల చేసిన సంగతి విదితమే. మరుసటి రోజే ఈ నిధులు కూడా విడుదల చేయడం గమనార్హం.

ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా రాజేంద్రకుమార్ నియామకం

ఫోరెనిక్స్ సైన్స్ ల్యాబ్(ఎఫ్ఎస్ఎల్) డైరెక్టర్‌గా రాజేంద్రకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. ఎఫ్ఎస్ఎల్ నిర్మాణ దశలో ఉన్న నేపథ్యంలో డైరెక్టర్ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది.

భీమవరం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్దఎత్తున తరలొచ్చే అవకాశం ఉంది. సభలకు హాజరయ్యే ప్రతినిధులకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు దాదాపు 300 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. బహిరంగ సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వేదికను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. వేదిక ముందు జనం కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, తదితర అన్ని ఏర్పాట్లూ చేశారు. మహాసభలు ప్రతిష్ఠ, ప్రత్యేకతలను అందరూ వీక్షించేలా సోషల్ మీడియా విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం మహాసభల విషయాలను ఎప్పటికప్పుడు ప్రత్యేక లైవ్ ద్వారా అందిస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా 'భీమవరం' ఫెస్ట్

మహాసభల నేపథ్యంలో భీమవరంలోని నటరాజ్ థియేటర్ పక్కనే ఖాళీ స్థలంలో కళాకారిణి ప్రభావతి ప్రాంగణంలో భీమవరం ఫెస్ట్ ఏర్పాటుచేశారు. ఫిబ్రవరి 7 నుంచి నిర్వహిస్తున్న ఫెస్ట్‌లో రాష్ట్ర నలు మూలల నుంచి తరలొచ్చిన దాదాపు 300 మంది ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక నృత్యాలు, నాటికలు, జానపద గేయాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఆలోచింపజేస్తున్నాయి. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రదర్శన, ఉద్యమ ప్రస్తావనతో కూడిన ఫొటో ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంటోంది.

ఆకర్షణీయంగా ఫ్లెక్సీలు, ఎర్రజెండా తోరణాలు

మహాసభల సందర్భంగా భీమవరం పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ఎర్రజెండా తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తొలిసారి భీమవరంలో రాష్ట్ర మహాసభలు జరుగుతుండటంతో సిపిఎం శ్రేణులు ఎంతో ఉత్సాహంగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. తేదీల ప్రకటన నుంచి ప్రచారంలోనూ పట్టణాన్ని ముస్తాబు చేయడంలో పార్టీశ్రేణులు, వలంటీర్లు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ముఖ్యంగా భీమవరానికి ఆయువుపట్టుగా చెప్పుకునే ప్రకాశం చౌక్ సెంటర్, యనమదుర్రు వంతెనపై, అంబేద్కర్ సెంటర్, జెపి రోడ్డు, ఉండిరోడ్డు, టౌన్‌రైల్వే స్టేషన్‌రోడ్డు, ఓవర్ బ్రిడ్జి, అడ్డవంతెనతోపాటు ప్రధాన కూడళ్లలో అలంకరించిన ఎర్రతోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ మహాసభలకు విచ్చేసే నాయకులు, ప్రతినిధులకు స్వాగతం పలికే విధంగా ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు పట్టణానికి మరింత శోభను తీసుకొచ్చాయి.

రాష్ట్ర సమస్యలపై విస్తృత చర్చ

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర మహాసభల ఏర్పాట్లను మధు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు 25వ రాష్ట్ర మహాసభలు భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రారంభిస్తారని చెప్పారు. మూడురోజులపాటు జరిగే మహాసభలకు పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్‌కరత్, బివి.రాఘవులుతోపాటు పలువురు నాయకులు హాజరవుతారని చెప్పారు. శనివారం మధ్యాహ్నం ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్న సమయంలో జాతీయ నాయకులు మీడియాతో మాట్లాడతారని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పారని, తర్వాత మోడీ సర్కార్ ప్రత్యేక ప్యాకేజీ అంటూ మాటమార్చి మోసగించిందని అన్నారు. ప్రత్యేక హోదా తీసేస్తున్నామని చెప్పడం మోసమన్నారు. ఇటీవలే హిమాచల్‌ప్రదేశ్‌కు ప్రత్యేక హోదాలో భాగంగా రూ.8 వేల కోట్లు మంజూరు చేశారన్నారు.

విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేద న్నారు. రాజధాని నిధులు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, పదకొండు విద్యాసంస్థలు, రైల్వేజోన్, విశాఖ, చెన్నయ్ పారిశ్రామిక క్యారిడార్ వంటివి ఎన్నో పేర్కొన్నా రన్నారు. రైల్వే జోన్, గిరిజన, సెంట్రల్ యూనివర్శిటీలు ఏర్పాటు చేయాలంటే పార్ల మెంటులో తీర్మానం చేయాలని, నాలుగేళ్ల యినా ఒక్కఅడుగూ ముందుకు పడలేదని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. నిధులు, ఉద్యోగాలు లేక అంతా నిరాశలో ఉన్నారన్నారు. వ్యవసాయ రుణాల కింద రూ.11 లక్షల కోట్లు ఇవ్వనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నారని, బ్యాంకింగ్ రంగం సంక్షోభంలో ఉండటంతో బ్యాంకులు రుణాలిచ్చే అవకాశం లేదని అన్నారు. ఇవన్నీ మాటలకే పరిమితం కానున్నాయన్నారు. కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పాలకులకు పట్టడం లేద న్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తుందుర్రు, గరగపర్రు ప్రజానీకం ఎందుర్కొనే సమస్యల పైనా మహాసభల్లో చర్చ జరుగుతుందన్నారు. వామపక్షాలతోపాటు ప్రత్యేకహోదా సాధన సమితి, జెఎసి వంటివి ఏర్పాటైతే అన్నింటినీ కలుపుకుని ముందుకు సాగనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలు జరగనున్నాయని, వీటిపై తీర్మానాలు చేయనున్నామని చెప్పారు. జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమలు, విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తామని చెప్పినా జరగలేదన్నారు. పోర్టు నిర్మాణం అతీగతీ లేదన్నారు. ఆక్వా పరిశ్రమకు సంబంధించిన సమస్యలు ఉన్నాయన్నారు. వరి రైతులు ధాన్యం అమ్ముకున్న డబ్బులు చేతికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి ధాన్యం దిగుమతి చేస్తూ ఇక్కడి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు.

ఎఫ్‌సిఐ ధాన్యం కొనుగోలు చేసి ధర నిర్ణయించాల్సి ఉందన్నారు. మహాసభలో టిడిపి, వైసిపి విధానాలపైనా చర్చ సాగుతుంద న్నారు. ప్రతిపక్ష పార్టీ పోషిస్తున్న పాత్రపైనా చర్చిస్తామన్నారు. వామపక్ష ప్రజాతంత్ర శక్తులే ప్రత్యామ్నాయమని అన్నారు. మహాసభలకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని, అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

మహాసభలకు 600 మంది ప్రతినిధులు : వైవి

రాష్ట్ర మహాసభలకు 13 జిల్లాల నుంచి జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో పార్టీకి ప్రాతినిధ్యం వహించే 600 మంది ప్రతినిధులు మహాసభకు హాజరవుతారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి) అన్నారు. అఖిల భారత నాయకులు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు.

నూతన రాష్ట్ర నాయకత్వాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, పశ్చిమ గోదావరి జిల్లా (డెల్టా) కమిటీ కార్యదర్శి బి.బలరాం పాల్గొన్నారు.

నా దగ్గరున్న కథ వింటే... పవన్ తప్పకుండా చేస్తారు

ఈ ఒక్క సినిమా చేసి కల్యాణ్ రాజకీయాల్లోకి వెళ్లొచ్చు : మంజుల


కిరణ్, సాయి మాధవ్ బుర్రా, సంజయ్ స్వరూప్, మంజుల ఘట్టమనేని, సందీప్ కిషన్, అమైరా దస్తూర్

"నా దగ్గర ఒక అద్భుతమైన సబ్జెక్ట్ ఉంది. అది పవన్ కల్యాణ్‌కి పర్‌ఫెక్ట్‌గా సూట్ అవుతుంది. ఆయన చాలా జెన్యూన్ పర్సన్. సమ్‌థింగ్ డిఫరెంట్‌గా ఉంటారు. ఆ కథ పవన్ కల్యాణ్ విన్నారంటే తప్పకుండా నాతో సినిమా చేస్తారు. ఈ సినిమా ఒక్కటి చేశాక ఆయన పొలిటికల్ సైడ్ వెళ్ళొచ్చు" అని దర్శకురాలు ఘట్టమనేని మంజుల అన్నారు. సందీప్ కిషన్, అమైరా దస్తూర్ జంటగా చేసిన చిత్రం 'మనసుకు నచ్చింది'. త్రిదా చౌదరి మరో కథానాయిక. మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహించారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ బేనర్స్ పై పి. కిరణ్, సంజయ్ స్వరూప్ నిర్మించారు. రాధాన్ మ్యూజిక్ అందించిన ఈ చిత్రం ఆడియోను హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో విడుదల చేశారు. ఈ చిత్రం ఆడియో బిగ్ సీడిని ప్రముఖ జర్నలిస్టులు ఇన్‌కేబుల్ శ్రీను, నాగేంద్ర ప్రసాద్, చల్లా భాగ్యలక్ష్మీ లాంచ్ చేశారు.

దర్శకురాలు మంజుల ఘట్టమనేని మాట్లాడుతూ 'నేను ఇండస్ట్రీలోనే పుట్టాను. ఇండస్ట్రీ మనిషిని. ఎంతోమంది డైరెక్టర్స్‌ని, ప్రొడ్యూసర్స్‌ని చూశాను. ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగాను. అలాంటి నేను ఏదో ఒక సినిమా డైరెక్ట్ చెయ్యాలని ఈ సినిమా తియ్యలేదు. అలాంటి అవసరం నాకు లేదు. ఈ సినిమా తీశానంటే దానిలో ఏదో ఒక మంచి విషయం ఉండబట్టే తీశాను. ఇది చాలా చాలా మంచి సినిమా. నేను ఏంటి అనేది ఈ సినిమా రిలీజ్ అయ్యాక తెలుస్తుంది. చోటా కె నాయుడు ఈ సినిమా చూశారు. ఎక్స్‌లెంట్‌గా ఉంది. ఒన్ ఆఫ్ ది బెస్ట్ లవ్‌స్టోరీ అని అన్నారు. ఈ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. నచ్చనివారుండరు. హార్ట్ ఉన్న ప్రతి ఒక్కరికీ నచ్చే సినిమా ఇది. మా ఆయన ఈ చిత్రంలో ఒక స్పెషల్ క్యారెక్టర్ చేశారు. ఆయన చేసిన సినిమాలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. రీసెంట్‌గా 'దూకుడు' తర్వాత 'అర్జున్‌రెడ్డి'లో చేశారు. ఆ సినిమా మంచి పేరు తెచ్చింది. ఆయన చాలా లక్కీ యాక్టర్. అలాగే మా పాప జాన్వి ఒక ఇంపార్టెంట్ రోల్ ప్లే చేసింది. వారిద్దరూ ఈ చిత్రంలో నటించడం చాలా ప్రౌడ్‌గా ఫీలవుతున్నాను. సూరజ్ క్యారెక్టర్‌లో సందీప్, అమైరా దస్తూర్ పర్‌ఫెక్ట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో బ్యూటిఫుల్‌గా నటించింది. బేసిగ్గా నేను రొమాంటిక్ పర్సన్‌ని. నాకు లవ్‌స్టోరీస్ అంటే చాలా ఇష్టం. అందుకే ఒక అందమైన లవ్‌స్టోరీని కథగా రాసుకున్నాను. ఈ సినిమాకి మహేష్ నేచర్ వాయిస్ ఓవర్ ఇచ్చాడు. సినిమాకి ఇది హైలెట్‌గా నిలుస్తుంది. . మహేష్ ఈ సినిమా సాంగ్స్, ట్రైలర్ చూసి షాక్ అయ్యాడు. వాయిస్ ఓవర్ చెప్పేటప్పుడు సినిమా చూసి చాలా ఇంప్రెస్ అయ్యాడు. నా నెక్స్‌ట్ మూవీ కూడా కిరణే ప్రొడ్యూసర్" అని అన్నారు.


సందీప్ కిషన్ మాట్లాడుతూ 'ఇది ఏ జానర్ మూవీ అని కొంతమంది అడిగారు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. సినిమా చూశాక ఇది ఒక మంచి కాఫీలాంటి సినిమా అన్పించింది. ప్రతి ఒక్కరి లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటనల్ని గుర్తుకు తెచ్చే అందమైన సినిమా ఇది. ఎవరూ ఎక్స్‌పెక్ట్ చెయ్యని ఒక ఇంట్రెస్టింగ్ మెస్సేజ్ ఉంటుంది' అని తెలిపారు.

చిట్టిగాడి గుండెని గోలెట్టిచ్చేసిన రామలక్ష్మి


'రంగస్థలం'లో సమంత

సుకుమార్ తన దర్శకత్వంలో 1985 నాటి పరిస్థితులకు అనుగుణంగా సినిమా తీస్తున్నారంటే అందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. శుక్రవారం విడుదలైన 'రంగస్థలం' టీజర్ చూస్తే 80వ దశకం నాటి రోజులు గుర్తు చేశాయి. రామ్ చరణ్, సమంత జోడీగా నటించిన ఈ చిత్రం టీజర్‌ను, అందులో సమంత ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. టీజర్ మొత్తం సమంత పాత్ర గురించే ఉంది. రామ్ చరణ్‌ది తెరవెనుక నుంచి గొంతు మాత్రమే వినిపించింది. ఇందులో చెర్రీ చిట్టిబాబుగానూ, సమంత రామలక్ష్మి పాత్రలోనూ నటించారు. టీజర్‌లో..రామలక్ష్మి నడుచుకుంటూ వెళ్తుంటే బ్యాక్‌గ్రౌండ్‌లో చిట్టిబాబు ఆమెను కామెంట్ చేస్తూ..'ఓహోహో..ఏం వయ్యారం..ఏం వయ్యారం. ఏమాటకామాట సెప్పుకోవాలండీ..ఈ పిల్ల ఎదురొత్తుంటే ఈ ఊరికే 18ఏళ్ల వయసు వచ్చేసినట్టు ఉంటుంది. ఈ చిట్టిగాడి గుండెని గోలెట్టిచ్చేసింది ఈ పిల్లేనండి..పేరు రామలక్ష్మండి. ఊరు.. 'రంగా..రంగస్థలానా' అంటూ వస్తున్న నేపథ్య సంగీతంతో టీజర్ ముగుస్తుంది. పల్లెటూరి అమ్మాయిగా సమంత ఇమిడిపోయింది. గోదావరి నదిలో దుస్తులు ఉతుకుతూ కనిపించేలా ఉండే సమంత ఫస్ట్‌లుక్ కూడా కథకు తగ్గట్టు పరిస్థితులకు అద్దం పట్టింది. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. మైత్రిమూవీ బ్యానర్‌లో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్(సి.వి.ఎం) నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ చిత్రంలో మొదటి గీతాన్ని 13వ తేదీన విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. ప్రకాష్ రాజ్, సీనియర్ నరేష్, ఆది పినిశెట్టి, అనసూయ తదితరులు నటించారు.

కొడుకును వృద్ధాశ్రమానికి పంపిన తండ్రి


'102 నాటౌట్'లో అమితాబ్, రిషీ కపూర్

అమితాబ్, రిషీ కపూర్ కలసి '102 నాటౌట్' అనే చిత్రం చేశారు. ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. 102 ఏళ్ల వృద్ధుడిగా అమితాబ్, 75 ఏళ్ల కొడుకుగా రిషీ కపూర్ నటించారు. 'దేశంలో కుమారుడిని వృద్ధాశ్రమానికి పంపిన ఏకైక తండ్రిని నేనే' అని అమితాబ్ చెప్తున్న డైలాగ్ ఆలోచింపజేసింది. కొడుకు దృఢంగా ఉండాల్సిందిపోయి..అతని కంటే 102 ఏళ్ల తండ్రే అన్నింటా సమర్థుడిగా, ఆరోగ్యవంతుడిగా ఉండడం విశేషం. తండ్రీ కొడుకులిద్దరూ వర్షంలో డాన్స్ చేయడం ఈ టీజర్‌లో కనిపించింది. బిగ్ బీ, రిషీ కపూర్ కాంబినేషన్‌లో సినిమా 27 ఏళ్ల తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. 1977లో వచ్చిన 'అమర్ అక్బర్ ఆంథోనీ' చిత్రంలో బిగ్‌బీ, రిషి సోదరులుగా నటించారు. ఈ చిత్రంలో తండ్రీకొడుకులు చేశారు '102 నాటౌట్'కు ఉమేశ్ శుక్లా దర్శకత్వం. ఈ సినిమాను మేలో విడుదల చేయనున్నారు.

సినిమాకు కథే హీరో

వరుణ్ తేజ్



"నేను ప్రేమకు చాలా తక్కువగా సమయం కేటాయించాను. సాధారణంగా తొలిప్రేమ అనేది ఏ వ్యక్తికైనా చాలా టఫ్‌గా ఉంటుంది. దాన్ని మిస్ చేసుకుంటే దాని నుండి బయటకు రావడం చాలా కష్టం. నా స్నేహితుల్లో చాలా మంది దాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేశారు. ఓ అబ్బాయి, అమ్మాయి మధ్య తొలిప్రేమ పుట్టిన తర్వాత దాన్నుండి బయటకు రావడం అంత సులభం కాదు. అదే విషయాన్ని మేం ఎనిమిది సంవత్సరాల టైమ్ పీరియడ్‌లో మూడు ఫ్రేమ్స్‌లో చూపించాం" అని అన్నాడు వరుణ్ తేజ్. ఆయన హీరోగా చేసిన చిత్రం 'తొలిప్రేమ'. శనివారం విడుదలవుతున్న సందర్భంగా శుక్రవారం మాట్లాడారు.

మీ బాబాయ్ 'తొలి ప్రేమ'కు..మీ 'తొలిప్రేమ' సంబంధమేంటి?

మా 'తొలిప్రేమ'ను కల్యాణ్ బాబాయ్ తొలిప్రేమతో పోల్చలేం. ఎందుకంటే అప్పటి జనరేషన్‌కు తగినట్లు ఆ తొలిప్రేమను తెరకెక్కించారు. ఆ సినిమా విడుదలైన 20 సంవత్సరాలవుతుంది. ఇప్పటి తరానికి నచ్చేలా మా 'తొలిప్రేమ'ను తెరకెక్కించాం. పాత 'తొలి ప్రేమ'లో హీరో దగ్గర మొబైల్ ఉండదు. తన ప్రేమను చెప్పడానికి రక్తంతో లవ్ లెటర్ రాసిస్తాడు. జనరేషన్ గ్యాప్, ప్రవర్తన ఎలా ఉంటుందో సినిమాలో చూపిస్తున్నాం.

'తొలిప్రేమ' అనే టైటిల్‌ను ఎందుకు పెట్టాలనుకున్నారు?

70 శాతం చిత్రీకరణ పూర్తయ్యేంత వరకు టైటిల్ విషయంలో క్లారిటీ రాలేదు. వెంకీ అట్లూరి రెండు మూడు టైటిల్స్ అనుకున్నారు. ఇంగ్లీష్ టైటిల్స్ వచ్చాయి. తెలుగు టైటిల్ అయితే క్యాచీగా ఉంటుందనిపించింది. సినిమాలో కథకు రిలేటెడ్‌గా ఉండాలని బాపి.. తొలిప్రేమ టైటిల్‌ను సూచించారు. అయితే ఈ టైటిల్‌ను పెట్టాలా? లేదా? అనే దానిపై చాలా ఆలోచించాం. కథేంటో తెలుసు కాబట్టి. కథను యాప్ట్ అయ్యే టైటిల్ ఇదేనని యూనిట్ అందరికీ అనిపించి ఈ టైటిల్‌నే ఫిక్స్ అయ్యాం.

టైటిల్ అనౌన్స్ తర్వాత పవన్‌కల్యాణ్‌తో టైటిల్ గురించి డిస్కస్ చేశారా?

కల్యాణ్ బాబాయ్‌తో ఈ టైటిల్ గురించి డిస్కషన్ రాలేదు. ఉషాకిరణ్ మూవీస్ వారి దగ్గర ఈ టైటిల్ ఉందని తెలిసి.. నిర్మాతలు వారిని సంప్రదించి మాట్లాడారు. వారు తొలిప్రేమ టైటిల్‌ను మాకు ఇచ్చారు.

ప్రారంభం నుండి కొత్త కాన్సెప్ట్ మూవీస్ చేస్తూనే ఉన్నారు కదా?

పెద్దనాన్న, నాన్న, బాబాయ్ హాలీవుడ్ సినిమాలు బాగా చూస్తారు. నేను కూడా మూవీ లవర్‌ని కావడంతో.. చిన్నప్పట్నుంచి సినిమాలు బాగా చూసేవాడిని. హాలీవుడ్ తరహాలో కొత్త జోనర్ సినిమాలెందుకు చేయలేమనే ఆలోచన మదిలో ఉండేది. నేను హీరో అయ్యాక .. ఆ విషయంలో ముందు అడుగు వేస్తే తప్పేంటి అని ఆలోచించి నా వంతుగా ప్రయత్నాలు చేస్తున్నాను.

దర్శకుడు ఈ కథ ఎప్పుడు చెప్పారు?

ఏ సినిమాకైనా కథే హీరో అని నేను బాగా నమ్ముతాను. వెంకీతో ఐదారేళ్లుగా పరిచయం ఉంది. అయితే తను దర్శకుడు కావాలనుకుంటున్నట్లు తెలియదు. కలిసినప్పుడు సాధారణంగా మాట్లాడుకునేవాళ్లం కానీ వెంకీ ఎప్పుడూ చెప్పలేదు. అలాగే మా నిహారిక చేసిన 'ముద్దపప్పు అవకాయ్' వెబ్ సిరీస్‌కు తను రైటింగ్ సైడ్ సహాయం చేశాడు. ఒకసారి కలిసి కథ చెబుతానన్నాడు. కథ వినగానే బాగా నచ్చింది. వెంకీ ఆల్‌రెడీ రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్‌చేశాడు కాబట్టి నాకు వెంకీపై నమ్మకం ఉండేది.

రాశీ ఖన్నాను ఎందుకు ఎంపిక చేశారు?

లవ్‌స్టోరీ అనగానే హీరోయిన్‌గా కొత్త అమ్మాయిని తీసుకోమని చాలా మంది సలహా ఇచ్చారు. అయితే ఆల్‌రెడీ ఇండస్ట్రీలో ఉన్న అమ్మాయినే హీరోయిన్‌గా తీసుకుందామని అనుకుని రాశీ ఖన్నాను సెలక్ట్ చేశారు. 'ఊహలు గుసగుసలాడే' సినిమాలో రాశి నటన అందరికీ నచ్చడంతో తనైతే ఈ సినిమాకు సరిపోతుందనిపించింది. తను కూడా మంచి లవ్‌స్టోరీ కోసం వెయిట్ చేస్తున్నానని చెప్పింది. పాత్ర కోసం బరువు తగ్గింది.

దీని తర్వాత చేసే సినిమాలేంటి?

సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ మూవీ చేయబోతున్నాను. అంతరిక్షానికి సంబంధించిన కథాంశంతో నడిచే సినిమా. కంచె సినిమాను నిర్మించిన రాజీవ్‌రెడ్డి నిర్మాత. కథ మాత్రమే విన్నాను. నాకు ఇది కచ్చితంగా ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ అవుతుంది. తెలుగులో ఈ సినిమాను నిర్మించబోతున్నారు. వాస్తవం సంఘటనే దానికి ఆధారం. అనిల్ రావిపూడి సినిమా స్టార్ట్ కావడానికి సమయం పడుతుంది. అనిల్ ఓ పాయింట్‌లాగానే చెప్పారు. కథ అంతా రెడీ అయిన తర్వాతే వివరాలు తెలుస్తాయి.

భారతమాత ముద్దుబిడ్డ గురించా విమర్శలు?


కంగనా రనౌత్

కొంతమంది వ్యక్తులు ప్రచారం కోసం ఏదొక విషయాన్ని తెరపైకి తెచ్చి పబ్బంగడుపుకుంటారు. ఆ తరహాలో మొన్న రాజ్‌పుత్ కర్ణిసేన 'పద్మావత్'పై నానా రాద్ధాంతం చేసింది. చివరకు సినిమా చూసి రాజ్‌పుత్ గౌరవాన్ని పెంచేదిగా ఉందని తీర్పించారు. ఇప్పుడు 'మణికర్ణిక' సినిమాపై సర్వ్ బ్రహ్మాణ్ మహాసభ లేనిపోని ఆరోపణలు చేసి ప్రచారం పొందే ప్రయత్నం చేస్తుంది. దీనికి మొన్ననే చెప్పుదెబ్బతిన్నట్టయిన రాజ్ పుత్ కర్ణి సేన కూడా మద్దతిచ్చింది. 'మణికర్ణిక' ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథను అందించారు. టైటిల్ రోల్ పోషిస్తున్న కంగనా రనౌత్ మొదటిసారిగా జోద్‌పూర్ ఎయిర్‌పోర్టులో చిత్రంపై వస్తున్న ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. ఆమె చేసిన వ్యాఖ్యలతో ఇప్పటివరకూ అరచి గీపెట్టుకున్న బ్రహ్మాణ్ సంఘం ఆరోపణలన్నీ తుడిచిపెట్టుకుపోయాయని చెప్పాలి. భారతమాత ముద్దుబిడ్డ గురించా విమర్శలు చేస్తారు? అని గట్టిగా నిలదీసే ప్రయత్నం చేసింది. "మణికర్ణిక"పై ఎంటువంటి విమర్శలు లేవు. బ్రిటీష్ పాలకులతో వీరోచితంగా పోరాడిన వీర వనితామె. ఒంటరిగా పోరాడి బ్రిటీష్ వారికి వణుకుపుట్టిన భారతమాత బిడ్డ. దేశ స్వాతంత్ర్య కోసం పోరాడి జీవితాన్ని త్యాగం చేసిన రాణి' అని పేర్కొన్నారు కంగనా. ఈ సినిమాలో ప్రేమకథ అనే కోణమే లేదని స్పష్టం చేసింది. 'ఈ చిత్రానికి 'బాహుబలి' వంటి సూపర్ హిట్ సినిమాకు కథ అందించిన విజయేంద్ర ప్రసాద్ కథ రాశారు. అంతే కాదు. విజయేంద్ర ప్రసాద్ కుమార్తె పేరు కూడా మణికర్ణికే. ఈ చిత్రం దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచుతుంది' అని పేర్కొన్నారు కంగనా. ఇటువంటి ఆరోపణలన్నీ పబ్లిసిటీ కోసం చేసుకునేవేనని కొట్టిపారేశారామె.

నిర్మాత కమల్ జైన్ మాట్లాడుతూ " రాణి లక్ష్మీబాయి జీవిత కథను నిర్మిస్తున్నప్పుడు బాధ్యత గల నిర్మాతగా అన్నీ ఆలోచిస్తాను. ఈ సినిమాకు సంబంధించి చారిత్రకారులను, పండితులతో ముందే అన్ని చర్చించి ఎటువంటి అభ్యంతరాలు లేవని ఓ నిర్ణయానికి వచ్చాక సెట్సపైకి వెళ్లాం. సత్యదూరమైన చారిత్రక విషయాలు ఇందులో లేవు' అని స్పష్టం చేశారు. జాగర్లమూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వం వహిస్తున్నారు.

'శీనుగాడి ప్రేమ' గీతాలు



సుష్మ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై శ్రీనివాసరావు హీరోగా నటిస్తూ నిర్మిస్తోన్న చిత్రం 'శీనుగాడి ప్రేమ'. సిన్సియర్ రా మామా ట్యాగ్ లైన్. ఆర్.కె.దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రణవి, కావేరి, చాందిని కథానాయికలు. రమణ సాకే సంగీతాన్ని సమకూర్చిన ఈ చిత్ర ఆడియో శుక్రవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో విడుదల చేశారు. టిఎస్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ తొలి సీడీ ఆవిష్కరించారు. హీరో–నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ 'నాకు యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. మా దర్శకుడు ఓ రోజు నేను డైలాగ్స్ చెప్పే విధానం చూసి హీరోగా నటించమన్నారు. కథ కూడా బాగుండటంతో నటిస్తూ, నేనే నిర్మించాను. దర్శకుడు ఆర్.కె. చెప్పిన దానికంటే సినిమాను అద్భుతంగా చిత్రీకరించాడ'ని తెలిపారు. దర్శకుడు ఆర్.కె.మాట్లాడుతూ 'శీను అనే పేరు చాలా మందికి ఉంటుంది. అలా శీనులందరికీ కనెక్టయ్యే కథాంశంతో ఈ సినిమా చేశాం. అన్ని అంశాలు పొందుపరిచాం' అని చెప్పారు.

సినిమాలే నన్ను ఎంపిక చేసుకుంటాయి


షారుఖ్ ఖాన్

కథ ఎలా ఉండాలో? ఎటువంటి దర్శకుడితో పని చేయాలి? అన్న విషయాలను సాధారణంగా ఏ హీరో అయినా చేసే మొదటి పని అదే. మంచి కథల కోసం ప్రతి హీరో అన్వేషిస్తుంటాడు. కానీ షారుఖ్ అలా కాదట. ఆయన సినిమాల కోసం అన్వేషించడట. సినిమాలే ఆయనను ఎంపిక చేసుకుంటాయట. ఆ విషయాన్ని షారుఖే స్వయంగా వెల్లడించాడు. "సినిమాలు చేసే విషయంలో ప్రతి ఒక్కరికీ ఓ విధానం ఉంటుంది. ఎవరితో చేయాలి? ఎలా చేయాలి? ఎటువంటి సినిమాలు చేయాలన్నదానిపై ఒక్కొక్కరు ఒక్కోలా ఉంటారు. కానీ నేను సినిమా గురించి అన్వేషించను. నేను 15ఏళ్లుగా సినిమాలు నిర్మిస్తున్నా. నేనెప్పుడూ సినిమాలు నిర్మించలేదు కాబట్టే ప్రొడక్షన్‌లోకి వచ్చా. సినిమాలే నన్ను ఎంపిక చేసుకుంటాయి. కొన్నిసార్లు సినిమాలు బాగా ఆడుతాయి. కొన్ని తీవ్ర నిరాశపరుస్తాయి... నాకు ఈ విషయంలో ఎలాంటి బాధ లేదు. ఫ్లాప్ సినిమాల గురించి బాధపడితే ఉదయాన్నే నిద్రలేచి సినిమాలు చేస్తూ ఉండలేను. నటనను ఉద్యోగంగా భావించను. ఇతరులు అలా అనుకుంటున్నారని అభిప్రాయపడను' అని అన్నారు షారుఖ్.

జర్నీ



పూతరేకులకు ప్రసిద్ధి ఆత్రేయపురం

పిల్లకాల్వల నడుమ ప్రకృతి ఒడిలో ప్రయాణం.. ఓవైపు చారిత్రక ఆనకట్ట విశేషాలు.. మరోవైపు ఆప్యాయతకు మారుపేరైన గోదారోళ్ల ఆత్మీయ పలకరింపులు.. ప్రపంచ ఖ్యాతి పొందిన పూతరేకుల రుచులు.. జుర్రుకు తినాలనిపించే మామిడితాండ్ర రహస్యాలు.. ఈ విశేషాల మేళవింపే ఈ వారం 'జర్నీ'..!

మిత్రులతో కలసి ఒక్కరోజులో దగ్గరలోని విహారయాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం. వేకువజామునే విజయవాడ బస్టాండులో రాజమహేంద్రవరం వెళ్లేందుకు బస్సు ఎక్కాం. భీమడోలు మీదుగా నిడదవోలు చేరే సమయానికి ఉదయం 9 గంటలయ్యింది. అక్కడ నుంచి ఆటోలో మా ప్రయాణం విజ్జేశ్వరం మీదుగా బొబ్బర్లంక ఆనకట్ట వద్దకు చేరింది. అపరభగీరథుడుగా చెప్పుకునే కాటన్ మహాశయుడు కట్టిన ఆనకట్ట గురించి తెలుసుకోవాలని బొబ్బర్లంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే ఒక పెద్దాయన దగ్గరికి వెళ్లి వివరాలు అడిగాం. ఒకప్పుడు కోనసీమ చుక్కనీరు లేక ఎడారిని తలపించేదని, బ్రిటీషు వారి హయాంలో ఈ ఆనకట్ట నిర్మించడంతో ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీరు అందించారంటూ కాటన్ ఘనత చెప్పుకుంటూ వచ్చారాయన. తర్వాత అందరం కలిసి, అప్పటి రాతి కట్టడాలను వీక్షించాం. ఆ ఆనకట్ట నిర్మాణం పరిశీలిస్తే అప్పటి ఇంజనీరింగ్ ప్రతిభకు సలాం చేయాల్సిందే! అక్కడి నుంచి బయలుదేరి రావులపాలెం వైపుగా సాగింది మా ప్రయాణం.

పూతరేకుల పుట్టినిల్లు

ఒకవైపు పిల్ల కాలువ, రెండోవైపు గోదావరి నది మధ్యలో రోడ్డుకిరువైపులా చెట్లు.. ఆ జర్నీ భలే గమ్మత్తుగా అనిపించింది. దారిపొడవునా ప్రకృతి అందాలు మాకు స్వాగతం పలుకుతున్న అనుభూతి కలిగింది. అలా ఆత్రేయపురం గ్రామం చేరుకున్నాం. ఆ గ్రామం పూతరేకులకు ప్రసిద్ధి అని చెప్పారు. దాంతో పూతరేకుల పరిశ్రమల గురించి తెలుసుకోవాలనే కోరిక మాలో మరింత బలపడింది. ఎన్నో ఏళ్లుగా పూతరేకుల తయారీనే ఉపాధిగా చేసుకున్న యాతం సత్యవాణి అనే మహిళ దగ్గరకు వెళ్లి.. పూతరేకుల తయారీ గురించి ఆరా తీశాం. ఆమె ఆ వివరాలను పూసగుచ్చినట్లు చెప్పుకొచ్చింది. ఆమె చెప్పిన దానినిబట్టీ ముందుగా బియ్యాన్ని మూడు గంటలపాటు నానబెట్టి, తరువాత మెత్తగా గ్రైండ్ చేస్తారు. పలుచగా చేసి అనంతరం మట్టి కుండను తీసుకొని దాన్ని బొర్లాపెట్టి కింద మంట పెట్టి ఒక పల్చటి గుడ్డతో పిండిలో ముంచి కుండపై వేస్తారు. దాంతో క్షణాల్లో పలుచని రేకుల పూతరేకు వస్తుంది. వంద నుంచి ఎనభై రేకులు చుట్టలుగా తయారుచేస్తారు. బెల్లాన్ని పొడిగా చేసి జీడిపప్పు, బాదంపప్పును చిన్న చిన్న ముక్కలుగా చేస్తారు. ముందు కొంచె నెయ్యి రాసి, ఆ పొడిని వాటిపై చల్లి, చుట్టలుగా చుడతారంటూ వివరించారు. ఆమె మాటలు విన్న తర్వాత మేమూ ఒక్కసారి పూతరేకుల రుచిని ఆస్వాదించాలని నిర్ణయించు కున్నాం. అక్కడే తయారైన ఓ పూతరేకును నోట్లో పెట్టుకున్నాం. ఇలా పెట్టామో లేదో అలా కరిగిపోయింది. అప్పుడర్థమైంది పూతరేకులు ఎందుకు అంత ప్రసిద్ధి గాంచాయో అని. అవి మేం ఊహించిన దానికంటే చాలా రుచిగా ఉన్నాయి. ఒక్కొక్కటి ఎంత ఉంటుందని అడిగితే.. జీడిపప్పుతో అయితే పది రూపాయలు, డ్రైఫ్రూట్స్ అయితే పదిహేను రూపాయలకు అమ్ముతామని చెప్పారు. అంతే కాదండోయ్! షుగర్ వ్యాధిగ్రస్తులకు షుగర్‌లెస్ పూతరేకులు ఇక్కడ మరో ప్రత్యేకత. ఓ నాలుగైదు ప్యాకెట్లు కొనుగోలుచేసి, మా బ్యాగుల్లో వేసుకుని అక్కడి నుంచి బయలుదేరాం.


బొబ్బర్లంక ఆనకట్ట


కుండ బిర్యానీ


లాల్ల లాకులు

గోదారోళ్ల ఆప్యాయత

అక్కడికి దగ్గరలోనే మామిడితాండ్రకు పేరుగాంచిన ఓ వీధివైపు పడ్డాయి మా అడుగులు. తాండ్ర తయారీలో మంచి అనుభవం ఉన్న దవుడుచి భానుమతి గారిని కలిశాం. విషయం చెప్పకుండానే ఆత్మీయంగా మమ్మల్ని లోపలకు పిలిచి, కూర్చోమని రెండు కుర్చీలు వేసి, తాగడానికి మంచినీళ్లు ఇచ్చారు. గోదారోళ్ల పలకరింపులు ఆ నోటా ఈ నోటా వినడమే కానీ, కళ్లారా చూసింది లేదు. ఆ క్షణంలో అనుభవమూ మాకు తీరిపోయింది. అనంతరం ఆమెను తాండ్ర ఎలా తయారు చేస్తారు అని అడిగాం. పక్వానికి వచ్చిన మామిడిపండ్లను జ్యూస్ తీసి మిక్సీలో వేసి దానికి పంచదార కలుపుతారు. బల్లలుగా ఏర్పాటు చేసిన ఈతచాపలపై రోజుకు మూడుసార్లు పలుచని పొరలా అలుకుతారు. అంతే, ఓ వారం రోజులకు మామిడితాండ్ర తయారువుతుంది. దీన్ని ముక్కలుగా కోసి వ్యాపారులకు విక్రయిస్తారు. కొంత తాండ్రను శీతలగిడ్డంగులలో భద్రపరుచుకొని నెలనెలా తెచ్చి విడిగా కేజీ 80 నుంచి 100 రూపాయలకు అమ్ముతామని ఆమె చెప్పుకొచ్చింది. ఓ రెండు ముక్కలు అక్కడే రుచి చూశాం. అప్పటికే మధ్యాహ్నం అయ్యింది. భోజనం చేసేందుకు పక్కనే ఉన్న రావులపాలెం అనువైందని అక్కడివారు చెప్పడంతో అటువైపుగా బయలుదేరాం.

ప్రకృతి ఒడి

అక్కడి నుంచి రావులపాలెం వెళ్లే మార్గం మధ్యలో ఆహ్లాదకరమైన లాల్ల లాకుల వద్ద ఆగాం. ప్రకృతి సోయగాలను వీక్షించడానికి అదే సరైన ప్రదేశం అని చెప్పొచ్చు. లాకులు నుంచి కిందికి జాలువారే సెలయేటి అందాలను చూడడంతో పాటు పచ్చటి తివాచీ పరిచినట్టుగా కనిపించే పంటపొలాలను, కాలువగట్లను, కొబ్బరి తోటలను మనసారా ఆస్వాదించాం. ఎగసి పడుతోన్న గోదారి నీటి ప్రవాహం మా మనసులను కట్టిపడేసేలా చేసింది. ఆ ప్రకృతి అందాలను మా మొబైల్ ఫోన్‌లలో బందించేందుకు పోటీపడ్డాం!


భలే భలే కుండ బిర్యానీ

అలా రావులపాలెం వచ్చేసరికి మధ్యాహ్నం రెండయ్యింది. అక్కడ కుండబిర్యానీ బాగా ప్రసిద్ధి చెందినదని చెప్పారు. దాని గురించి తెలుసుకునేందుకు విక్టరీ రెస్టారెంట్‌లో దాని వివరాలు అడిగాం. బిర్యానీ తయారీకి బాస్మతీ రైస్‌తో పాటు రెండు కోడి లెగ్‌పీస్‌లను మట్టికుండలోపెట్టి, ఆ కుండను నిప్పులపై వేడి చేసి, ఉడికిస్తారని చెప్పారు. అందుకే కుండబిర్యానీకి ఓ ప్రత్యేకమైన రుచి వస్తుందట! ఒక్కో కుండ బిర్యానీ 220 రూపాయలకు అమ్ముతున్నారు. ఇక ఆలస్యం చేయకుండా మేమూ ఆ బిర్యానీ లాగించేశాం. తర్వాత అక్కడి నుంచి బైపాస్ రోడ్డు మీదుగా విజయవాడకు తిరుగుముఖం పట్టాం. ఒక్కరోజు సాగిన మా ప్రయాణంలో కొన్ని కోనసీమ అందాలతోపాటు.. అక్కడివారి ఆప్యాయతలు, ప్రసిద్ధ రుచులు మూటకట్టుకుని వచ్చాం. మరెందుకు ఆలస్యం మీరూ మీ ప్రయాణాన్ని మొదలుపెట్టండి!

హ్యాపీ జర్నీ!!

- హనుమంతు వరప్రసాద్

అతిపెద్ద మర్రిచెట్టు!



దేశ విదేశాల్లో చూడ్డానికి చాలా పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. ఇప్పుడు మనం మాట్లాడుకుబోయేది ప్రపంచంలోనే అతిపెద్ద మర్రిచెట్టు గురించి.. ప్రపంచంలోని అత్యంత పెద్దదైన ఈ చెట్టును వీక్షించడానికి ప్రపంచంలోని పర్యాటకులందరూ తరలివస్తుంటారు. ఈ చెట్టు కోల్‌కతాలోని ఆచార్య జగదీష్ చంద్రబోస్ ఇండియన్ బొటానికల్ గార్డెన్‌లో ఉంది. ఈ చెట్టు గురించి మరిన్ని విశేషాలు..

ఈ గార్డెన్‌లో సుమారు 150 మొక్కల జాతులు మాత్రమే కాకుండా, 1,44,400 చదరపు మీటర్లు విస్తరించిన మర్రిచెట్టు ఉంది. ఈ గార్డెన్ సుమారు 100 హెక్టార్ల వరకు విస్తరించి ఉంది. ఇందులో ఎక్కువ ప్రాంతాన్ని ఈ చెట్టు ఆక్రమించిందని చెప్పుకోవాలి. చూడ్డానికి ఈ ఒక్కచెట్టు మాత్రమే ఓ అడవిలా కనిపిస్తుంటుంది. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న నీటివల్ల ఈ చెట్టు ఇంకా పెరుగుతూ ఉంది. దీని కారణంగానే ఈ చెట్టు శాఖలు 2,800 కంటే ఎక్కువగా ఉన్న జటలు రూపం దాల్చాయి. అతిపెద్ద విశాలమైన మర్రిచెట్టుగా ఇది పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తుంది. తుపాన్లు వంటివి సంభవించినా ఈ చెట్టు చెక్కుచెదరకుండా ధృడంగా ఉంది. ఇలాంటి ప్రత్యేకతల కారణంగానే ఈ చెట్టు గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. ఈ చెట్టును మరింత అందంగా తీర్చిదిద్దేందుకు దీని చుట్టుపక్కల ప్రాంతాల్లో అందమైన ఆకృతులను పెడుతున్నారు. అంతేకాకుండా, ఈ గార్డెన్‌లో విభిన్నరకాల రంగులు కలిగిన పూలమొక్కలను వీక్షించవచ్చు. ఇంత అందమైన, అద్భుతమైన గార్డెన్‌ను వీక్షిస్తుంటే ఆ మజానే వేరుగా ఉంటుంది. ఈ చెట్టు వయసు సుమారు 200 సంవత్సరాల నుంచి 250 ఉంటుందని అంచనా. ★



'జర్నీ'కి ఆహ్వానం



మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.

మా చిరునామా

జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి





పొడుపు కథ

పండేది ఎండాకాలం,
పండ్లలో రాజఫలం,
కాయ చట్నీల్లో ప్రథమం,
రకాలతో పంట పుష్కలం?

జవాబు : మామిడి

జోక్ :

బంటి :నాన్నా! పెట్రోలు లేకుండా నడిచే కారును నువ్వు చూశావా?
తండ్రి : లేదురా.. నువ్వు చూశావా?
బంటి : ఆ..!
తండ్రి : ఎక్కడ?
బంటి : ఇదిగో నేను ఆడుకునే కారు బొమ్మ..!

నీడ కనుక్కోండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని బొమ్మ నీడను కనుక్కోండి!

ఒకే కొలనులో రెండు రకాల నీళ్లు



అదో సహజ సిద్ధమైన నీటి కొలను. రెండు వందల అడుగుల లోతుంటుందంతే.. అయినా ఓ మంచి పర్యాటక ప్రాంతం...ఆ విశేషాలు తెలుసుకుందాం!

ఆ నీళ్లల్లో డ్రైవింగ్ చేయడానికి ఎక్కడెక్కడి నుంచో బోలెడు మంది వస్తుంటారు. లోపలున్న వింతల్ని చూసి ఆశ్చర్యపోతుంటారు. అద్భుతాల్ని చూసి కేరింతలు కొడతారు. ఇదంతా మెక్సికోలోని 'యుకటాన్' ద్వీపకల్పంలోని సెనోట్ అనే సింక్ హోల్ సంగతి. చిన్న నీటి కొలనులా ఉండే ఇది ఎన్నో ఏళ్ల కిందట సున్నపురాళ్లు బద్ధలై భూగర్భంలోంచి నీరు బయటికి రావడం వల్ల ఏర్పడింది. ఈ నీటి అడుగున చెట్లు ఉండడం మరో విశేషం.



స్వచ్ఛమైన నీటితో కనిపించే ఈ సింక్‌హోల్‌లో రెండు రకాల నీళ్లు విడివిడిగా కలిసిపోకుండా ఉంటాయి. అవును... పైనుంచి 100 అడుగుల లోతు వరకు మంచినీరు, దాని కింద వంద అడుగుల లోతు వరకు ఉప్పునీళ్లు ఉంటాయి. ఇది ఎలా సాధ్యమని మీకు సందేహం వస్తుంది కదా?! ఈ రెండు రకాల నీళ్లు కలిసి పోకుండా మధ్యలో హైడ్రోజన్ సల్ఫేట్ పదార్థంతో ఏర్పడిన మూడు అడుగుల మందపాటి పొర ఉంటుంది. పైనున్న మంచినీటిని, కిందనున్న ఉప్పునీటిని ఇది గోడలా ఉండి వేరుచేస్తూ ఉంటుంది. సాంద్రత ఎక్కువగా ఉండటంవల్ల ఉప్పు నీరు మంచినీటి కన్నా కింద ఉంటుందన్నమాట. ఒకే దాంట్లో ఈ రెండు రకాల నీళ్లు ఉండడం వల్ల.. చూసే పర్యాటకులకు ఇదో అద్భుత లోకంలా కనిపిస్తుంది. ఇదీ అసలు విషయం. భలే ఉంది కదూ ఈ కొలను?! ★



నేను గీసిన బొమ్మ





ఎ. మౌనిక,
7వ తరగతి, మూసాపేట్,
హైదరాబాద్.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

దక్షిణాఫ్రికా గడ్డపై చరిత్ర సృష్టించడానికి టీమిండియా సిద్ధంగా ఉంది. 25 ఏళ్ళ సుదీర్ఘ పర్యటనలలో ఒక్కసారి కూడా ఆ దేశంలో ఏవిధమైన సిరీస్ విజయం సాధించిన దాఖలాలు లేవు. వన్డే సిరీస్‌లో ఇప్పటికే 3-0 ఆధిక్యతలో ఉన్న టీమిండియా గెలుపు లాంఛనమే అయినప్పటికీ డివిలియర్స్ పునరాగమనంతో కొంత జాగ్రత్తగా ఆడాల్సి ఉంది. భారత సారథి విరాట్ కోహ్లి అద్భుత ఫామ్... స్పిన్నర్లు కుల్దీప్, చాహల్‌ల మాయాజాలం ముందు దక్షిణాఫ్రికా జట్టు ఏమాత్రం పోరాడనుందో...



గెలిస్తే చరిత్రే...

నేడు దక్షిణాఫ్రికాతో నాల్గో వన్డే

సాయంత్రం 4.30 గం॥ల నుండి

జోహాన్స్‌బర్గ్ : భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య నాలుగో వన్డే శనివారం జరగనుంది. ఇప్పటికే మూడు వన్డేల్లో గెలిచి జోరుమీదున్న టీమిండియాను నిలువరించడం సఫారీ జట్టుకు కష్టమే అయినప్పటికీ డివిలియర్స్ పునరాగమనం కారణంగా కొంత జాగ్రత్తగా ఆడాల్సిన అవసరముంది. ఆరు వన్డేల సిరీస్‌లో 3-0 ఆధిక్యతలో నిలిచిన టీమిండియా నేడు జరిగే వన్డేలో గెలిస్తే చరిత్ర సృష్టించే అవకాశముంది. దక్షిణాఫ్రికా జట్టు స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందులు పడుతుంది. కుల్దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్‌లు సఫారీ జట్టు పతనాన్ని శాసిస్తున్నారు. వీరిద్దరే తొలి మూడు మ్యాచ్‌లు గెలవడానికి ప్రధాన కారణం. వీరిద్దరూ సఫారీజట్టులోని మూడోవంతు బ్యాట్స్‌మన్లను పెవిలియన్‌కు పంపుతున్నారు. టీమిండియా సారథి విరాట్ కోహ్లి అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మూడు వన్డేల్లో రెండుసార్లు అజేయంగా నిలిచి 300 పైచిలుకు పరుగులు సాధించాడు. అతని ఇన్నింగ్స్‌లో రెండు సెంచరీలు సాధించడమే కాకుండా... ఆడిన మూడు మ్యాచ్‌లలో రెండింటిలో అజేయంగా నిలిచాడు. ధావన్ సైతం రెండు అర్ధసెంచరీలను సాధించగా... రహానే మూడో వన్డేలో 79 పరుగులతో ఆకట్టుకున్నాడు. ఎటొచ్చీ టీమిండియాను వేధిస్తున్న సమస్య ఓపెనర్ రోహిత్ శర్మ ఇన్నింగ్సే... మూడు ఇన్నింగ్స్‌లో కేవలం 35 పరుగులు మాత్రమే చేశాడు.



మార్క్రమ్ (కెప్టెన్)

డివిలియర్స్ ఇన్...

తొలి మూడు వన్డేలకు దూరమైన దక్షిణాఫ్రికా సీనియర్ బ్యాట్స్‌మన్ డివిలియర్స్ ఈ మ్యాచ్‌లో పునరాగమనం చేస్తున్నాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను శాసించగల సత్తా ఉన్న క్రీడాకారుల్లో డివిలియర్స్ ఒకడు. డివిలియర్స్ రాకతో ఆ జట్టు క్రీడాకారుల్లో నూతన ఉత్సాహం నింపే అవకాశముంది. సీనియర్ బ్యాట్స్‌మన్‌గా అతని అమూల్యమైన సలహాలు జట్టు సభ్యులకు ఎంతో ఉపయుక్తం కానున్నాయి. టీమిండియా స్పిన్నర్లపై ఆధిపత్యం చెలాయించే బ్యాట్‌మన్‌లలో డివిలియర్స్ ఒకడు. అంతేగాక డివిలియర్స్‌కు ఐపిఎల్‌లో భారత బౌలర్లను ఎదుర్కొన్న అనుభవం ఉంది. చేతివేలి గాయం కారణంగా తొలి మూడు వన్డేలకు దూరమైన విషయం విధితమే.

భారత్ ఖాతాలో తొమ్మిది విజయాల రికార్డు

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన టీమిండియా వరుసగా విదేశాల్లో తొమ్మిది విజయాలను నమోదుచేసిన భారతజట్టుకు రికార్డ్ సృష్టించింది. మూడోవన్డే విజయంతో విదేశాల్లో వరుసగా తొమ్మిది వన్డేల్లో టీమిండియా గెలిచినట్లయ్యింది.

భారతజట్టు : విరాట్ కోహ్లి (సారథి), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్య రహానె, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్యా, యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమి, శార్దూల్ ఠాకూర్.

దక్షిణాఫ్రికా జట్టు : హషీమ్ ఆమ్లా, డివిలియర్స్, డుమినీ, మార్క్రమ్ (కెప్టెన్), డేవిడ్ మిల్లర్, మోర్కెల్, మోరరీస్, జోండో, రబాడా, తాహీర్, షంషీ, లుంగ్డీ, ఫెల్యూక్వాయో, బెహర్‌డేన్.

అట్టహాసంగా వింటర్ ఒలింపిక్స్ ప్రారంభం







ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : దక్షిణకొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో శుక్రవారం వింటర్ ఒలిపిక్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్తర, దక్షిణకొరియాలు సంయుక్తంగా ఈ వింటర్ ఒలిపింక్స్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రారంభోత్సవానికి ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ సోదరి కిమ్-యో-జోంగ్ హాజరవ్వగా.. దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో కలిసి వింటర్ ఒలిపిక్స్ పోటీలను ప్రారంభించారు. ప్యాంగ్‌చాంగ్ ఒలింపిక్ స్టేడియంలో కళాకారుల ప్రత్యేక ప్రదర్శనలు, బాణసంచా వెలుగుల మధ్య వింటర్ ఒలిపిక్స్ వేడుకలు జరిగాయి.

ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్‌గా ఇంద్రా నూయి

దుబాయి : పెప్సీ కంపెనీ చైర్మన్, సీఈవో ఇంద్రా నూయి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) స్వతంత్ర డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. శుక్రవారం ఐసీసీ ప్రతినిధులు ఈ విషయాన్ని మీడియాకు తెలియజేశారు. ఈ పదవికి ఎన్నికైన తొలిమహిళ. క్రికెట్‌లో అంతర్జాతీయ పాలనా భాగస్వామ్యాన్ని పెంచాలన్న ఉద్దేశ్యంతోనే ఇంద్రా నూయిని ఎంపిక చేసినట్టు ఐసీసీ వెల్లడించింది. గతేడాది జూన్‌లో ఐసీసీ ప్రవేశపెట్టిన ఈ స్వతంత్ర డైరెక్టర్ పదవిలో మహిళలకు మాత్రమే అవకాశం ఇస్తారు. రెండేళ్ల ఈ పదవీ కాలానికి గానూ ఇంద్రా నూయి ఈ ఏడాది జూన్ నుంచి బాధ్యతలు చేపట్టనున్నారు.

శ్రీకాంత్, సింధూ గెలిచినా...

సెమీస్‌కు చేరని భారతజట్లు

అలోర్ సెటార్ (మలేసియా) : ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల, మహిళల జట్లు క్వార్టర్‌ఫైనల్లో ఓటమిపాలయ్యాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో పురుషులజట్టు చైనాతో తలపడి 3-1తో ఓడిపోగా... మహిళాజట్టు ఇండోనేషియా చేతిలోనూ 3-1తోనే ఓటమిపాలైంది. మహిళాజట్టులో పి.వి. సింధు 21-13, 24-22 పాయింట్ల తేడాతో ఫిత్రియానిపై గెలుపొందింది. ఆ తర్వాత జరిగిన మూడు మ్యాచ్‌లలో భారత మహిళా షట్లర్లు ఘోరంగా ఓటమిపాలవ్వడంతో ఇండోనేషియా జట్టు 3-1తో గెలుపొంది సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

రెండో మ్యాచ్‌లోనూ ఓడిన సెహ్వాగ్ జట్టు

సెయింట్ మోర్టిజ్ (స్విట్జర్లాండ్) : సెహ్వాగ్ సారథ్యంలోని డైమండ్స్ జట్టు ఐస్ క్రికెట్‌మ్యాచ్‌లో మళ్ళీ ఓడింది. శుక్రవారం అఫ్రిది సారథ్యంలోని రాయల్స్ జట్టుతో తలపడి రెండో మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. దీంతో రాయల్స్ జట్టు 2-0తో టీ20 ఐస్ సిరీస్‌కప్‌ను గెలుచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన సెహ్వాగ్ డైమండ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు ఐదు వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. 206 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్రిది రాయల్స్ జట్టు రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 16.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేధించింది.



మయూర వాహనంపై మల్లన్న

ప్రజాశక్తి-శ్రీశైలం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు శుక్రవారం మయూర వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పలు రకాల కళారూపాలు, నృత్యప్రదర్శన, విద్యుద్దీపలంకరణ, వేదమంత్రోచరణాల మధ్య ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇందులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి నిఘా కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

టిటిడి దేవస్థానం పట్టువస్త్రాల సమర్పణ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లకు తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున కార్యనిర్వహణాధికారి ఎ.అనిల్‌కుమార్ సింగాల్, ప్రధాన అర్చకులు పట్టు వస్త్రాలను సమర్పించారు. సాంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలతో ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా వీరికి ఇఒ భరత్‌గుప్తా ఐఎఎస్, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. ప్రతి ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాకుల టిటిడి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితి.

కానిపాకం దేవస్థానం పట్టు వస్త్రాల సమర్పణ : భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు కానిపాకం దేవస్థానం తరుపున పట్టు వస్త్రాలను సమర్పించారు. కానిపాకం దేవస్థానం కార్యనిర్వహణాధికారి పూర్ణచంద్రరావు, పట్టువస్త్రాలతో ఆలయం వద్దకు చేరుకోగా ఆలయ సాంప్రదాయాన్ని అనుసరించి ఆలయాధికారులు స్వాగతం పలికారు.

అమిత్‌షా నన్ను మందలించలేదు

- వైసిపి కోవర్టుగా నన్ను చిత్రీకరిస్తున్నారు
- బిజెపి ఎంఎల్‌సి సోము వీర్రాజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరంప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం రూ.4.600 కోట్లు ఇచ్చిందని.. ఈ విషయంలో వాస్తవాలను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేయనున్న జెఎసి పరిశీలించాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంఎల్‌సి సోము వీర్రాజు కోరారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఆయన శుక్రవవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలవరం నిధుల విషయంలో ప్రజల్లో అనుమానాలు ఉన్నందున కచ్చితమైన లెక్క తేల్చాల్సిందేనని చెప్పారు. ఈ బాధ్యతను జెఎసి తీసుకోవాలని కోరారు. కేంద్రం చెబుతున్న లెక్కకూ, రాష్ట్రం చెబుతున్న లెక్కకూ తేడా ఉందని తాను భావించడం లేదన్నారు. పోలవరం పనులు ఇప్పటివరకూ 60 శాతం మాత్రమే పూర్తయ్యాయన్నారు. టిడిపి, బిజెపి పొత్తు కొనసాగింపు విషయం బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చూసుకుంటారని విలేకరుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించిన కాంగ్రెస్ పార్టీతో కలిసి టిడిపి ఎంపీలు ఆందోళన చేయడం సరికాదన్నారు. గురువారం జరిగిన సంపూర్ణ బంద్ దేనికి సంకేతమని విలేకరులు ప్రశ్నించగా, బస్సులు ఆపేసి, స్కూళ్లు, కార్యాలయాలు మూత వేస్తే ఏం జరుగుతుందో అదే జరిగిందన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని కేంద్రం గుర్తించిందా? అని ప్రశ్నించగా.. కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేయలేదన్నారు. దుగరాజుపట్నం పోర్టుకు స్థలాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఖరారు చేయాలని కోరారు. రాష్ట్ర రాజధానికి కేంద్రం రూ.2,500 కోట్లు ఇచ్చిందని అయితే ఇప్పటికీ రాజధాని డిజైన్, డిపిఆర్ పూర్తి కాలేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటులో ఉన్న టిడిపి ఎంపీలు పోలవరం గురించి మాట్లాడలేదని, బిజెపి ఎంపీలే మాట్లాడారన్నారు. ప్రత్యేక హోదా విషయంలో టిడిపి, వైసిపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయన్నారు. తనను బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా మందలించారని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. తన గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని చెప్పిన ఆయన.. ఎవరు గొంతు నొక్కుతున్నారో చెప్పలేదు. తాను గడ్డి తిననని అది తిన్నవారు జైలులో ఉన్నారన్నారు. గతంలో రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన వారు జైలు కెళ్లారని, ప్రస్తుతం రాష్ట్రంలో అలా జరుగుకుండా చూసుకోవాలన్నారు. తనను వైసిపి కోవర్టుగా కొందరు చిత్రీకరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ, యనమల రంగబాబు, రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్యేలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోంది

- రాజ్యసభ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్ర
- ఐఎఎస్, ఐపిఎస్‌లు టిడిపి కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు
- చంద్రబాబు సర్కార్‌పై ఈసీకి విజయసాయి రెడ్డి ఫిర్యాదు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అధికార టిడిపి ప్రలోభాలకు గురి చేస్తోందని వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి విమర్శించారు. ఈమేరకు శుక్రవారం నాడు ఆయన కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి వివిధ అంశాలతో కూడిన వినతి పత్రాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒపి రావత్‌కు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏపి ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతి పాల్పడుతూ, ఆ సొమ్ముతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తోందని ఆరోపించారు. వైసిపి ఎమ్మెల్యేలపై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తోందన్నారు. రాజ్యసభ ఎన్నికల సమయంలో కొంత మంది ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయాలని కుట్ర పన్నుతోందని వెల్లడించారు. "మా పార్టీకి చెందిన 67 మంది ఎమ్మెల్యేల్లో 23 మందిని ఒక్కొక్కరికి రూ.10 నుంచి రూ.20 కోట్లు ఇచ్చి టిడిపి ప్రభుత్వం కొనుగోలు చేసింది. మిగతా 44 మందిలో కనీసం నలుగుర్ని కొనాలని ప్రయత్నిస్తోంది. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.25 కోట్లు ఆఫర్ చేసినట్టు మా దష్టికి వచ్చింది. ఈ విషయాన్ని సిఈసి దష్టికి తీసుకెళ్లాం. రాజ్యసభ ఎన్నికల సమయంలో పోలింగ్ బూత్‌లను ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో పెట్టాలని, కేంద్ర బలగాలతో ఎమ్మెల్యేలకు రక్షణ కల్పించాలని కోరాం. తప్పుడు కేసులు పెట్టకుండా చూడాలని, ప్రత్యేక పరిశీలకుడిని నియమించి ఎన్నికలను పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశాం. గతంలో తెలంగాణలో ఓటుకు నోటు కేసులో చంద్రబాబు ఇరుకున్నారు. అలాగే ఏపి ప్రభుత్వ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కేంద్రం నిఘా పెట్టాలని కోరాం" అని విజయసాయిరెడ్డి తెలిపారు. "వైసిపి నుంచి టిడిపిలోకి వెళ్లిన 23 మంది ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని ఏపి అసెంబ్లీ స్పీకర్‌ను కోరాం. కానీ స్పీకర్ కోడెల శివప్రసాద్ టిడిపి సర్కార్‌కి రాజ్యాంగబద్ధ తొత్తులా తయారయ్యారు" అని విమర్శించారు. "ఆంధ్రప్రదేశ్ సర్కార్ లక్ష 50వేల కోట్లు ప్రజల సొమ్ము దోచుకుని విదేశాలకు హవాలా ద్వారా పంపింది. టిడిపి సర్కారుపై నమ్మకం లేనందునే ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌లో రాజ్యసభ ఎన్నికలు పెట్టాలని కోరుతున్నాము. ఓటుకు నోటు కేసుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు రాజీ పడ్డారు. వైసిపి ఎమ్మెల్యేలను కొనేందుకు తెలుగుదేశం పార్టీ కోసం ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కూడా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఏపి సర్కారులో పిఎస్‌గా పని చేస్తోన్న ఐఎఎస్ అధికారి సతీష్ చంద్ర, అలాగే అడిషనల్ డిజిపి వెంకటేశ్వరావులు తెలుగుదేశం కార్యకర్తల్లా పని చేస్తున్నారు. వారు తమ పదవులకు రాజీనామా చేసి టిడిపిలో చేరితే తమకు అభ్యంతరం లేదు. కానీ రాజ్యాంగానికి లోబడి, ప్రజలకు కోసం పని చేయాల్సిన అధికారులు ఇలా టిడిపి కార్యకర్తల్లా వ్యవహరించడం మంచింది కాదు" అని విమర్శించారు.

"తమ విజ్ఞప్తిపై సిఈసి ముఖ్య ఎన్నికల అధికారి సానుకూలంగా స్పందించారు. సిఈసి న్యాయ సలహాదారుతో విజ్ఞప్తులపై మాట్లాడారు. సిఈసి చట్టం ప్రకారం రాజ్యసభ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర సలహాదారు, రియల్ టైం సిఈసి పర్యవేక్షణ కూడా చేస్తామని సిఈసి హామీ ఇచ్చారు" అని తెలిపారు.

గిరిజనుల జీవన ప్రమాణాల్లో గుణాత్మక మార్పునకు కార్యాచరణ

- గృహ నిర్మాణంపై అసంతృప్తి
- ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి
- సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గిరిజనుల జీవన ప్రమాణాలతోపాటు విద్య, మౌలిక వసతుల అభివృద్ధిలో గుణాత్మక మార్పు తెచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన ఆయన కాకినాడ కలెక్టరేట్‌లోని విధాన గౌతమీ హాలులో శుక్రవారం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. శాఖలవారీగా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. తొలుత కలెక్టర్ కార్తికేయ మిశ్రా, జిల్లా ఎస్‌పి విశాల్ గున్నీ స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఫారమ్ పాండ్స్, వర్మీ కంపోస్టు, సిసి రోడ్లు, పంచాయతీ భవనాలు, ఆటస్థలాలు తదితర నిర్మాణ అంశాల ప్రగతి, పని దినాల కల్పన, సగటు వేతనం చెల్లింపు అంశాలలో జిల్లా ప్రగతి ఉందన్నారు. నిర్మించిన వర్మీ కంపోస్టు, నాఫెడ్ యూనిట్లు అన్నీ తప్పనిసరిగా కంపోస్టు ఉత్పాదన చేస్తే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద గ్రామాలు, పట్టణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ర్యాగ్ పిక్కర్ల ద్వారా సేకరించాలన్నారు. చిన్న చిన్న ముక్కలుగా చేసి పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి రోడ్ల నిర్మాణంలో వినియోగించాలని సూచించారు. హౌసింగ్ పథకంలో గృహ నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయని, ఎన్‌టిఆర్ గ్రామీణ 2016-17 గృహాల గ్రౌండింగ్ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. చిత్తశుద్ధితో రెండు నెలల్లో ప్రగతి పెంచాలని ఆదేశించారు. ఇసుక మైనింగ్ సమీక్షలో అక్రమాలు, పొరుగు రాష్ట్రాలకు రవాణా తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర సరిహద్దు మండలాల్లో చెక్‌పోస్టులు, నిరంతర నిఘా ఏర్పాటుచేసి ఇసుక రవాణా అరికట్టాలన్నారు.

చైతన్యకు కన్నీటి వీడ్కోలు



చైతన్యకుమార్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - మచిలీపట్నం (కృష్ణా)

గత నెల 30న అమెరికాలో మృతి చెందిన కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన బొమ్మల చైతన్యకుమార్ భౌతికకాయానికి శుక్రవారం కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు జరిగాయి. అమెరికా నుండి హైదరాబాద్‌కు విమానంలో శుక్రవారం తెల్లవారుజామున చేరుకోగా రోడ్డు మార్గం గుండా మచిలీపట్నం తీసుకొచ్చారు. చైతన్యకుమార్ మృతదేహాన్ని చూసిన వెంటనే కుటుంబసభ్యులు తల్లడిల్లిపోయారు. అమెరికాలో ఎంఎస్ చదువుతున్న చైతన్యకుమార్ ఆత్మహత్య చేసుకున్న విషయం జనవరి 31న ఆయన తండ్రి రామ్మోహనరావుకు సమాచారం అందినప్పటి నుంచి ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తూనే ఉంది. మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, మాజీ శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావుతో పాటు పురపాలక సంఘానికి చెందిన ఉద్యోగులు, సిబ్బంది, పట్టణ ప్రజలు సందర్శించి నివాళు లర్పించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68